




తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 24.04.2025 | సంపుటి : 11 సంచిక : 275 | పేజీలు : 12 వెల: రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370








తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## సాహో సయీద్ ఆదిల్

**ముష్కరులతో పోరాడి ముస్లిం యువకుడి అమరత్వం**

**తీవ్రంగా ప్రతిఘటించి కాల్పుల్లో మృతి**

**కుటుంబాన్ని పరామర్శించిన షా, ఓమర్ అబ్దుల్లా**

వార్త 2లో



# పహల్గామ్ దాడిపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

## కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

**దీటుగా బదులిస్తాం : రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్**

**ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు**

న్యూఢిల్లీ / శ్రీనగర్ (జనంసాక్షి) :పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి తర్వాత బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు గంటలకు పైగా భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్)తో సమావేశం మిగితా 2 లో



**జపాన్ పర్యటన విజయవంతం**

## హైదరాబాద్‌కు సీఎం రేవంత్

**ఘనస్వాగతం పలికిన అభిమానులు, నాయకులు**



హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) : జపాన్ పర్యటనను ముగించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు పలువురు అభిమానులు, కాంగ్రెస్ నేతలు ఘనస్వాగతం పలికారు. మిగితా 2 లో

## టీపీసీసీ పూర్తిస్థాయిలో ప్రక్షాళన

**గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు**

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడి**

**పార్టీ ప్రక్షాళనకు దిశానిర్దేశం చేసిన ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్**

**పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించిన టీపీసీసీ**

**ఏప్రిల్ 25 నుంచి 30 వరకు జిల్లాస్థాయి సమావేశాలకు ఆదేశాలు**




హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో టీపీసీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు ఉంటుందని చెప్పారు. పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. గాంధీభవన్‌లోని ఇందిరాభవన్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర పరిశీలకుల సమావేశం టీపీసీసీ చీఫ్ అధ్యక్షత జరిగింది. ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణు నాథ్, సీడబ్ల్యూసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమవగానే జమ్మూ కాశ్మీర్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల మృతి పట్ల సంతాపం, 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీ చేసిన మిగితా 2 లో

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండ

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**




న్యూఢిల్లీ (జనంసాక్షి) : పహల్గాం ఉగ్రదాడిని అత్యంత పాశవిక దాడిగా నాలుగు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం ఈ దాడిని సామాజిక మాధ్యమంలో తీవ్రంగా ఖండిస్తూ మిగితా 2 లో

## సాయుధ బలగాలు అప్రమత్తం



శ్రీనగర్ (జనంసాక్షి) : ముంబైలో 2008లో జరిగిన మారణహోమం తరువాత పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రవాద ఘటన భారత్‌ను ఉలిక్కిపడేలా చేసింది. అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కావడానికి కాస్త ముందుగా నలుగురు సాయుధ ముష్కరులు 26 మంది టూరిస్టులను పహల్గాంలో పొట్టనపెట్టుకోవడంతో సాయుధ బలగాలు అప్రమత్తమయ్యాయి. ఈ మారణహోమానికి కారకులైన ముష్కరులను మట్టుపెట్టేందుకు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. వేలాది మంది సాయుధ పోలీసులు, భద్రతా సిబ్బంది జమ్మూకశ్మీర్‌ను జల్లెడ పడుతున్నారు. మిగితా 2 లో

## మిలిటెంట్ల ఊహాచిత్రాల విడుదల



న్యూఢిల్లీ (జనంసాక్షి) : పహల్గామ్ పర్యాటక ప్రాంతంలో మంగళవారం టూరిస్టులపై విచక్షణారహితంగా కాల్పులకు పాల్పడ్డ మిగితా 2 లో

## కుప్పకూలిన టూరిస్టు రంగం

**ఖాళీ చేసి వెళ్లిపోతున్న టూరిస్టులు**

**హెూటళ్లు, రెస్టారెంట్లు ఖాళీ**



శ్రీనగర్ (జనంసాక్షి) : పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం పర్యాటకులు తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. ఇందుకోసం శ్రీనగర్ నుంచి అదనపు విమానాలను నడుపుతున్నారు. పలువురు పర్యాటకులు శ్రీనగర్‌లో హెూటళ్లను ఖాళీ చేసి టాక్సీల్లో వెళ్లిపోతున్న దృశ్యాలు స్థానిక టీవీల్లో ప్రసారమవుతున్నాయి. ఉద్రిక్తతల మధ్య ప్రయాణం కొనసాగించలేమని, వ్యక్తిగత భద్రతకు తాము ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు.

## మృతులకు అమిత్ షా నివాళి



శ్రీనగర్ (జనంసాక్షి) : జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా నివాళులర్పించారు. బుధవారం శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దకు మిగితా 2 లో

**ప్రజలను రెచ్చగొట్టేందుకు కాదు**

# 25 ఏండ్ల ఉత్సవమే మా సభ

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



ఎల్కతుర్తి (భీమదేవరపల్లి), ఏప్రిల్ 23(జనం సాక్షి) : ప్రజలను రెచ్చగొట్టేందుకు బీఆర్ఎస్ రజోత్సవ సభ నిర్వహించడం లేదని, కాంగ్రెస్ వైఫల్యాలను మాత్రం తప్పక ప్రజల ముందుంచుతామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) అన్నారు. కాంగ్రెస్ నమ్ముకుంటే కరెంటు తీసేస్తరు సభ సజావుగా సాగనీయకుండా మోసం చేస్తారని అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనలో మరణించిన భారతీయులకు సభ ప్రాంగణం వద్ద రెండు నిమిషాల పాటు నివాళులర్పించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఒక ఉద్యమ సంస్థగా ఏర్పడి.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆనాడు ఒక మాట చెప్పాడు బోధించు,సమీకరించు, పోరాడు అనే ప్రజాస్వామ్య పద్దతిలో తెలంగాణను సాధించాలనే నినాదంతో పురుడు పోసుకుంటున్న సంస్థ టీఆర్ఎస్ అని తెలిపారు. హిమాలయాల స్థాయికి తెలంగాణను తీసుకొచ్చి పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను అద్భుతంగా నిర్వహిస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. దేశం మొత్తం లో గుర్తింపు తెచ్చుకున్న పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా అని చెప్పారు. రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలకు కష్టమొచ్చినా తెలంగాణ భవన్ కు వస్తున్నారని అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ బీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలందరూ గులాబీ జెండాకు జై కొడుతున్నారని అన్నారు. రజతోత్సవ సభకు ఎల్కతుర్తి వేదిక కావడం గర్వకారణమని కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తి సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వెయ్యి ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. 30-40 వేల వాహనాలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. 10 లక్షల వాటర్ బాటిల్స్,మజ్జిగ ప్యాకెట్లు,మన కార్యకర్తలు ఎండను లెక్కచేయకుండా దూరం నుంచి ప్రయాణం చేసి సభకు వచ్చిన వారికి ఏమైనా ఇబ్బంది కలిగితే ఎమర్జెన్సీ వారికి వెయ్యికి పైగా వైద్య బృందాలు,20 అంబులెన్స్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంత చక్కటి ఏర్పాట్లు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు మీద నమ్మకం లేదని కేటీఆర్ అన్నారు. అందుకే సభ మిగితా 2 లో



## ప్రశాంతంగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్

- రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి
- 78.57 శాతం పోలింగ్ నమోదు


వార్త 12లో

## పసిడి ప్రియులకు ఊరట

**ఒకేరోజు భారీగా తగ్గిన బంగారం ధరలు**



న్యూఢిల్లీ (జనంసాక్షి) : రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరకు నేడు బ్రేక్ పడింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి పసిడి ధర గణనీయంగా తగ్గింది. దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ. 3,000 వరకు దిగిరావడం పసిడి కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చింది. బుధవారం ఉదయం 11 గంటల సమయానికి బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 98,700 వద్ద ట్రేడ్ అయింది. బంగారం బాటలోనే వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది. కిలో వెండి ధర బులియన్ మార్కెట్‌లో రూ. 98,720 గా నమోదైంది. మంగళవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో జూన్ నెల డెలివరీ కాంట్రాక్టు బంగారం ధర ఇంట్రాడేలో రూ. 99,358 వద్ద సరికొత్త రికార్డును సృష్టించిన విషయం తెలిసిందే. అయితే, బుధవారం ట్రేడింగ్‌లో ఈ ధర కూడా తగ్గుముఖం పట్టింది. ఉదయం రూ. 96,500 వద్ద ప్రారంభమైన ధర, ఒక దశలో రూ. 95,457 కనిష్ఠ స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా ఔన్సు పసిడి ధర 3,320.40 డాలర్లకు తగ్గింది. మంగళవారం నాడు ఈ ధర 3,467 డాలర్లుగా ఉంది. ప్రపంచ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాలే దేశీయంగా బంగారం ధర తగ్గడానికి కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాతో వాణిజ్య ఒప్పందంపై మిగితా 2 లో

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
24 ఏప్రిల్ 2025

## సాహో సయీద్ ఆదిల్



**కాశ్మీర్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** జమ్మూకశ్మీర్లో పహల్గాం ప్రాంతంలో అనూహ్యంగా జరిగిన ఉగ్రదాడి సందర్భంగా హార్స్ రైడర్, ముస్లిం యువకుడు సయీద్ అదిల్ హుస్సేన్ షా వీరోచిత పోరాటం చేశాడు. ఉగ్రవాదులు పర్యాటకులపై దాడికి దిగగా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. వారినుంచి తుపాకీ లాక్కొనేందుకు శక్తికిమించి ప్రతిఘటించాడు. ఈ క్రమంలో మిగతా ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. పర్యటకులను కార్ పార్కింగ్ ప్రాంతం నుంచి బైసరన్ పచ్చిక బయళ్ల వద్దకు అదిల్ హుస్సేన్ షా గుర్రం మీద తీసుకువెళ్లిన సమయంలోనే ఈ ఘటన జరిగింది. హుస్సేన్ మృతితో అతడి కుటుంబం కన్నీరుమున్నీరైంది. పెద్దదిక్కును కోల్పోయింది. అతడి మీద ఆధారపడి తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఉండగా.. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. "పని నిమిత్తం నా కుమారుడు మంగళవారం పహల్గాం వెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఈ దాడి గురించి మాకు తెలిసింది. దాంతో వెంటనే ఫోన్ చేశాం కానీ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. తర్వాత సాయంత్రం 4.40 గంటల సమయంలో ఫోన్ రింగ్ అయింది. కానీ ఎవరూ లిఫ్ట్ చేయలేదు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. ఆ దాడిలో నా కుమారుడు గాయపడినట్లు మాకు తెలిసింది" అని హుస్సేన్ తండ్రి సయ్యద్ హైదర్ షా వాపోయారు. బుల్లెట్ గాయాలకు పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయినట్టు తెలిపాడు. ఆ యువకుడి నివాసానికి వెళ్లిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సాయుధ బలగాలు అప్రమత్తం



పలు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, అమానుష దాడికి పాల్పడిన ముష్కరులను మట్టుబెట్టి, బాధితులకు న్యాయం చేసేందుకు బలగాలు పూర్తి స్థాయిలో దృష్టిసారించాయని ఇండియన్ ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. పహల్గాం దాడులు తప పనేనంటూ అంతగా ప్రాచుర్యంలో లేని కశ్మీర్ రెసిస్టెన్స్ మిలిటెంట్ గ్రూప్ ప్రకటించుకుంది. 85,000 మందికి పైగా బయటవ్యక్తులు (ఔట్ సైడర్స్) కశ్మీర్ ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకోవడం ద్వారా డెమోగ్రాఫిక్ మార్పులు చోటుచేసుకుంటున్నాయని మిలిటెండ్ గ్రూప్ సామాజిక మాధ్యమాల్లో అసంతృప్తి వ్యక్తం చేసింది. మంగళవారం తాము ఎవరిపై దాడి చేశామో ఆ టూరిస్టులు సాధారణ టూరిస్టులు కాదని, భారత భద్రతా ఏజెన్సీలతో ముడిపడిన వ్యక్తులని పేర్కొంది.

## పహల్గామ్ దాడిలో ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

నిర్వహించారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో ప్రధాని మోదీ తన రెండు రోజుల సౌదీ అరేబియా పర్యటనను ముగించుకుని బుధవారం ఉదయం ఢిల్లీకి తిరిగి వచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తదితరులు పాల్గొన్నారు. పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది.
మంగళవారం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో అమాయకులు మరణించడం పట్ల రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని శిక్షిస్తామని తెలిపారు. ఉగ్రవాదాన్ని నామరూపాల్లేకుండా పెకిలివేస్తామని, ముష్కరుల చర్యలతో సహనం నశించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన ప్రతి చర్య తీసుకుంటుందని, ఈ చర్యకు పాల్పడిన వారిని మాత్రమే కాకుండా, తెరవెనుక ఉన్న వారినీ విడిచిపెట్టేది లేదని తెలిపారు పహల్గామ్‌లో జరిగిన పిరికి చర్యలో మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించారు.

## హైదరాబాద్‌కు సీఎం రేవంత్



ఈ నెల 16న జపాన్ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం అక్కడి పలు కంపెనీలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించింది. ఈ క్రమంలో రూ. 12,062 కోట్ల మేర పెట్టుబడులకు ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకు రావడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్' బృందం 8రోజుల జపాన్ పర్యటన కృషితో వేలాది మందికి ఉపాధి మార్గాలు కూడా రానున్నాయి.

# టీపీసీసీ పూర్తిస్థాయిలో ప్రక్షాళన



అభ్యర్థులు, ఏఐసీసీ, పీసీసీ ఆఫీస్ బేరర్లు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను ఆహ్వానించాలని సూచించారు. టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాలు తెలంగాణలో పెద్ద ఎత్తున విజయవంతం అవుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కో ఆర్డినేటర్లు ఇచ్చిన బాధ్యతలను మంచిగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు తెలంగాణలో జరుగుతున్న జై బాపు, జై భీమ్ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం చాలా కీలకమని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ పార్టీ విస్తృత భావజాలం ఉన్న పార్టీ : మీనాక్షి నటరాజన్**

కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని.. బ్రిటిష్ వాళ్లతో కూడా పోరాటం చేసిందని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని.. జాతీయ స్థాయి ఆలోచనలతో కాంగ్రెస్ పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలతో నడుస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని సూచించారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్‌గా పని చేయాలని మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. ప్రస్తుతం గుజరాత్ మోడల్‌గా పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు విస్తారంగా జనంలోకి పోవాలని సూచించారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం, గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని ఉద్ఘాటించారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీనాక్షి నటరాజన్ సూచించారు.

## ఉగ్రదాడి మృతులకు అమిత్ షా నివాళి

హెలికాప్టర్ లో చేరుకున్న అమిత్ షా మృతదేహాల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పరిస్థితిపై ప్రధానీ మోదీ, అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ లు సమీక్షలు చేశారు.
జమ్మూ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నివాళులర్పించారు. బుధవారం శ్రీనగర్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న అమిత్ షా మృతదేహాల వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. కాల్పుల ఘటన జరిగిన తీరుతెన్నుల వివరాలను అమిత్ షా వారిని అడిగి స్వయంగా తెలుసుకొన్నారు. ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని తమ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో విడిచి పెట్టదని వారికి ఆయన స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండ

భారత్‌కు సంఘీభావం తెలిపారు. ఉగ్రవాదంపై పోరుతో భారత్‌కు అమెరికా అండగా ఉంటుందన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇటలీ ప్రధాని మెలోని సైతం పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. అమాయక ప్రజానీకంపై ఉగ్రదాడులు ఆమోదయోగ్యం కాదని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పహల్గాం ఘటనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మా అతిథులు లోయను (కశ్మీర్) విడిచిపెట్టి వెళ్తుండటంతో హృదయం బరువెక్కిపోయిందని, అయితే ఇదే సమయంలో వాళ్లు ఎందుకు వెళ్లిపోతున్నారో అర్థం చేసుకోగలమని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకులు సురక్షితంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ యంత్రాగానికి ఆదేశాలిచ్చామని చెప్పారు. మరోవైపు, ఉగ్రదాడులకు పాల్పడిన వారి వెనుక ఎవరున్నారనేది అధికారికంగా ఇంకా ధ్రువీకరణ కానప్పటికీ పాక్ తీవ్రవాద గ్రూపులే ఈ అమానుషానికి పాల్పడినట్టు అనుమానిస్తున్నామని అధికారులు తెలిపారు. కాగా, పహల్గాం దాడిలో పలువురు టూరిస్టులు ప్రాణాలు కోల్పోవడంపై పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ ఖాన్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

## పసిడి ప్రియులకు ఊరట

సానుకూలంగా మాట్లాడటంతో అమెరికా స్టాక్ మార్కెట్లు పుంజుకున్నాయని, డాలర్ విలువ కూడా బలపడిందని వారు తెలిపారు. సాధారణంగా డాలర్ బలపడితే, బంగారం వంటి సురక్షిత పెట్టుబడులకు ఆదరణ తగ్గుతుంది. ఈ పరిణామాలన్నీ బంగారం ధరపై ఒత్తిడి పెంచాయని నిపుణులు చెబుతున్నారు.

## మిలిటెంట్ల ఊహాచిత్రాల విడుదల

నరహంతకుల ఫొటోను భద్రతా సంస్థలు విడుదల చేశాయి. తొలుత ముగ్గురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేశాక.. తాజాగా నలుగురు అనుమానితుల ఫొటోను తాజాగా భద్రతా సంస్థలు విడుదల చేశాయి. ఫొటోలో ఏకే-47 రైఫిల్స్ పట్టుకుని ఫొటోలో పోజులిచ్చారు. వీరిలో ముగ్గురి పేర్లు సులేమాన్ షా, అబు తల్హా, ఆసిఫ్ ఫౌజీ అని అధికారులు వెల్లడించారు. అలాగే ఘటనాస్థలిలో ఏకే-47 తుపాకీ పట్టుకుని ఉన్న ఆ ఉగ్రవాది చిత్రం కూడా బయటకు వచ్చింది. పహల్గామ్ దాడి వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి లష్కరే తోయిబా అగ్ర కమాండర్ సైఫుల్లా సాజిద్ జట్‌గా అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఇతడు ఇస్లామాబాద్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తాడని గుర్తించింది. పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ ప్రాంతానికి చెందిన వాడిగా కనిపెట్టారు. ఇక ఈ ఉగ్రవాదులకు స్థానిక ఇద్దరు స్థానికులు సహకరించినట్లుగా గుర్తించారు. ఇక ఉగ్రవాదులు బాడీ కెమెరాలు ధరించినట్లుగా కనుగొన్నారు.



## ధాన్యం తూకంలో మోసం

- రైతుల ఆందోళన

**కట్టంగూర్, (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో తేడా వచ్చిందని బుధవారం రైతులు ఆందోళన నిర్వహించారు. కొనుగోలు కేంద్రంలో మూడు కంప్యూటర్ కాంటాలు ఉండగా అందులోని ఒక కాంటాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం బస్తా 40 కేజీల 700 గ్రాముల ఉండాల్సి ఉండగా అదే బస్తాను గ్రామంలోని మరో కంప్యూటర్ కాంటాలో తూకం వేయగా 41 కేజీల 500 గ్రాములుగా చూపించింది. దాంతో రైతులు కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టారు. క్వింటాలుకు రెండున్నర కేజీల వరకు అదనంగా తూకం వేయడంతో తీవ్రంగా నష్టపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తూకంలో జరిగిన మోసంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీసీ శంకర్ కొనుగోలు కేంద్రానికి వచ్చి కాంటా వెయిట్ సరి చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమంలో గుడుగుంట్ల వెంకన్న, తవిటి నాగార్జున, బీసం లింగయ్య, నార్ల సత్యనారాయణ, నిమ్మనగోటి వెంకన్న, బెల్లి శేఖర్ పాల్గొన్నారు.

# 25 ఏండ్ల ఉత్సవమే మా సభ

కోసం 200 జనరేటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులందరూ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ చరిత్రలోనే ఎల్కతుర్తి సభ భారీ బహిరంగ సభగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ను చూడాలని అయన మాట వినాలని ప్రజలు ఉర్రూతలు ఊగుతున్నారని అన్నారు. బండి ఎనక బండి గట్టి పద్దతిలో పెద్ద ఎత్తున సూర్యాపేట రైతన్నలు వస్తున్నారని తెలిపారు. సభ కోసం 2వేల మంది వాలంటీర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నెల 27 న 12796 గ్రామ పంచాయతీల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కదం తొక్కిన ఉత్సాహంతో ఛలో వరంగల్ సభకు చేరుకుందామని అన్నారు. కాంగ్రెస్ అరాచక పాలనను వరంగల్ సభలో ఎండగడుదామని అన్నారు. 11 ఏళ్లుగా బీజేపీ తెలంగాణకు అన్యాయం చేస్తుందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ సందేశాన్ని గులాబీ సైనికులు ప్రతి గ్రామానికి చేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు వినయ్ భాస్కర్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి, సత్యవతి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ సంగీతకు విలియం షేక్స్‌పియర్ అవార్డు 2025 ప్రదానం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** విలియం షేక్స్‌పియర్ రచనలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా చదువుతారని, విశ్లేషిస్తారని ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ మాజీ అధిపతి ప్రొఫెసర్ ఏ కరుణాకర్ అన్నారు. బుధవారం ప్రపంచ ఆంగ్ల భాష దినోత్సవం, విలియం షేక్స్‌పియర్ జయంతిని పురస్కరించుకొని కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. షేక్స్‌పియర్ ఒక ఆంగ్ల నాటక రచయిత, కవి , నటుడు అతను ఆంగ్ల భాషలో గొప్ప రచయితగా, ప్రపంచంలోని ప్రముఖ నాటక రచయితగా విస్తృతంగా పరి గణించబడ్డాడని ఏ.కరుణాకర్ అన్నారు. వికాస భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ కె రామ్ గోపాల్ రెడ్డి గత 25 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమ అభివృద్ధి కోసం నిరంతరం ఉచిత సేవలందిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, ఆంగ్లభాషాధిపతి, సాహితివేత్తగా సేవలందిస్తున్న డాక్టర్ ఎం సంగీతను ఈ ఏడాది విలియం షేక్స్‌పియర్ ఎక్సలెన్సీ అవార్డు 2025 ను ముఖ్య అతిథి శాలువా, జ్ఞాపిక, పూలమాల, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించి అవార్డును ప్రదానం చేశారు.

## పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత.. కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్ ట్రాప్‌లో టీఆర్ఎఫ్ కమాండర్



**శ్రీనగర్:** జమ్ము కశ్మీర్‌లోని కుల్గామ్‌లో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. తంగ్‌మార్గ్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతున్నది. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) టాప్ కమాండర్ ఈ కాల్పుల్లో చిక్కుకున్నట్లు తెలుస్తున్నది. మంగళవారం పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఇద్దరు విదేశీయులతో సహా 28 మంది మరణించారు. మరి కొందరు గాయపడ్డారు. పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న లష్కరే తోయిబా అనుబంధ ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్ ఈ దాడికి బాధ్యత వహించింది. కాగా, బుధవారం తెల్లవారుజామున సరిహద్దులో ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని భారత సైన్యం తిప్పికొట్టింది. బారాముల్లాలో భారీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులను మట్టుబెట్టింది. ఎన్‌కౌంటర్ తర్వాత పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రితోపాటు పాకిస్థాన్ కరెన్సీని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

## మంచి నీళ్ల కోసం రోడ్డెక్కిన లాల్‌గడి మలక్‌పేట వాసులు



**శామీర్‌పేట, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** వారంతా మంచినీళ్ల కోసం చాలా రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యను పరిష్కరించుకునేందుకు ఇక ఆందోళనే శరణ్యమని భావించిన బస్తీ వాసులంతా రోడ్డెక్కారు. లాల్‌గడి మలక్‌పేట వాసులు ఇవాళ ఖాళీ బిందెలతో రోడ్డుపై భైఠాయించి నిరసన వ్యక్తం చేస్తూ.. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్‌గడి మలక్‌పేట మాల బస్తీ వాసులు మాట్లాడుతూ.. మంచి నీటి కోసం మూడు వారాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. పంచాయతీ కార్మికుల సమ్మెతో నీటి సమస్య మొదలైందని తెలిపారు. 20 రోజులుగా మిషన్ భగీరథ నీళు రావడం లేదని.. దీంతో వంటావార్పు చేయలేని పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యాలయం తెలిపిన స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో రోడ్డెక్కడం జరిగిందన్నారు బస్తీ వాసులు . ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని.. లేదంటే కార్యాలయాలను ముట్టడిస్తామని బస్తీ వాసులు హెచ్చరించారు. కాలనీ వాసులకు గ్రామస్తులు మద్దతు ప్రకటించడంతో ధర్నా ఉధృతంగా మారింది.

## యాదగిరిగుట్టలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు వ్యక్తులు మృతి

**యాదగిరిగుట్ట, ఏప్రిల్23 (జనంసాక్షి) :** అతివేగంతో వెళ్తున్న కారు ముందుగా వెళ్తున్న బైకును ఢీ-కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరుకు చెందిన మొరిగాడి పరుశురామ్, మొరిగాడి సంతయ్య ద్విచక్ర వాహనం (టీఎస్30సీ8493) పై 163వ జాతీయ రహదారిపై ఆలేరుకు వెళ్తున్నారు.
మండలంలోని బాహుపేట స్టేజీ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న కారు(టీఎస్03ఈపీ5350) బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడడంతో వారి తలలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందిన్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## సీల్‌ను తొలగించి మరీ నిర్మాణం

- భవనం సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు



**అల్లాపూర్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ -23 టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి రమేష్ హెచ్చరించారు. గాయత్రి నగర్ ప్లాట్ నెంబర్ 371లో భవన నిర్మాణానికి మూడంతస్తులు అనుమతులు తీసుకొని.. అదనంగా మరో రెండు అంతస్తులు నిర్మించారు. ఈ క్రమంలో టీజీబీపాస్ యాక్ట్ 2020 ప్రకారం సదరు నిర్మాణదారులకు షోకాస్ నోటీసు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాన్ని సీజ్ చేశారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులు భవనానికి వేసిన సీల్‌ను సదరు నిర్మాణదారులు తొలగించి యధావిధిగా నిర్మాణం చేపట్టారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం చేస్తున్న సదరు భవన యజమానులపై జీహెచ్ఎంసీ అధికారులు అల్లాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఎన్ ఎస్ సెక్షన్ 223,334(2) ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవ లోగో ఆవిష్కరణ

ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి) :



సింగరేణి సంస్థ కొత్తగూడెంలో తొలి మహిళా కళాశాలను ప్రారంభించి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ రూపొందించిన గోల్డెన్ జూబ్లీ లోగోను సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ బుధవారం హైదరాబాద్ నుండి వర్చువల్ గా ఆవిష్కరించారు.మహిళా విద్యకు అంకితమై ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఈ కళాశాల మరింతగా వృద్ధి చెందాలని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ కళాశాలగా ఎదగాలని ఛైర్మన్ ఎన్.బలరామ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పి.పి మరియు పా) కె.వెంకటేశ్వర్లు, సి.పి.పి. ఎ.మనోహర్ కొత్తగూడెం నుండి సింగరేణి విద్యాసంస్థల కార్యదర్శి గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. 1975వ సంవత్సరంలో సింగరేణి సంస్థ మహిళా విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ పూర్తి మారుమూల, గిరిజన ప్రాంతమైన కొత్తగూడెంలో సింగరేణి మహిళా కళాశాలను ప్రారంభించడం జరిగింది. ఈ కళాశాలలో సింగరేణి కార్మికుల అధికారుల పిల్లలే కాక సమీప పట్టణాల గ్రామాలకు చెందిన వారు కూడా ఈ కళాశాలలో చదివిన అనేకమంది డాక్టర్లుగా, ప్రొఫెసర్లుగా, ఉద్యోగులుగా స్థిరపడ్డారు. నాటినుండి ఈ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ డిగ్రీ కళాశాల గా, పీజీ కళాశాలగా కూడా ఎదిగింది. తొలుత ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఈ కళాశాల ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీకి అనుబంధ కళాశాలగా ఉంది. సుమారు 2000 మంది ఈ కళాశాలలో చదువుతున్నారు. హాస్టల్ వసతి, క్రీడా మైదానాలు, మంచి ప్రయోగశాలలు, ఆడిటోరియం వంటి అత్యుత్తమ సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. ఈ కళాశాల కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో చదువులోనూ, క్రీడల్లోనూ అగ్రస్థానంలో నిలుస్తూ వస్తోంది. గోల్డెన్ జూబ్లీ సంవత్సరం సందర్భంగా ఏడాది పొడుగునా పలు రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# నెరవేరిన జనరల్ మజ్దూర్ల కల

ఇకపై మజ్దూర్లకు జనరల్ అసిస్టెంట్ గా గుర్తింపు

మార్పును అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):



14 వేల మంది జనరల్ మజ్దూర్ల కల ఎట్టకేలకు నెరవేరింది. సింగరేణి సంస్థలో కేటగిరి-1లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లను ఇకపై ఆ పేరుతో కాకుండా జనరల్ అసిస్టెంట్ గా మార్పు చేస్తూ సింగరేణి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భూపాలపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన జాతీయ స్థాయి వేజ్ బోర్డు ఒప్పందంలో ఈ పేరు మార్పునకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరాం తక్షణమే అమలు జరపాలని ఆదేశించడంతో ఈ మేరకు సర్కులర్ జారీ చేయడం జరిగిందని చెప్పారు. దీనిపై సింగరేణిలోని 14 వేల మంది జనరల్ మజ్దూర్ల తోపాటు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సింగరేణి సంస్థలో కేటగిరీ-1లో పనిచేసే వారిని జనరల్ మజ్దూర్ అని పిలవడం అలవాటుగా వస్తుందని తెలిపారు. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు, కూలి అని అర్థమని, సింగరేణి సంస్థలోనే కాక, కోల్ ఇండియాలో కూడా ఈ కింది స్థాయి ఉద్యోగులను ఇదే పేరుతో పిలుస్తూ వస్తున్నారని అన్నారు. బొగ్గు తవ్వకం తొలి రోజుల్లో గుత్తేదారులే యజమానులుగా ఉంటుందేవారు. బొగ్గు తవ్వడం కోసం పల్లె ప్రాంతం నుంచి కూలీ(మజ్దూర్) లను తీసుకొని వస్తుండేవారని, కాలక్రమంలో బొగ్గు గనులు జాతీయకరణ జరిగిన తర్వాత ఈ మజ్దూర్ లను అన్ని రకాల శారీరక శ్రమకు సంబంధించిన పనులకు వినియోగిస్తుండేవారని, అందుకే వీరిని జనరల్ మజ్దూర్ లుగా గుర్తించడం జరిగిందన్నారు. గతంలో కేవలం నిరక్షరాస్యులు మాత్రమే జనరల్ మజ్దూర్లు గా పనిచేస్తుండేవారని, నేడు కారుణ్య నియామకాల్లో ఉన్నత చదువులు చదివిన వారు కూడా తొలుత బదిలీ వర్కర్లుగా ఎంపికై ఏడాది తర్వాత జనరల్ మజ్దూర్లుగా గుర్తించబడు తున్నారన్నారు.

బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో జనరల్ మజ్దూర్లు కూడా కీలకంగా ఉంటున్నందువల్ల, వీరి వృత్తికి కూడా సముచిత గౌరవం ఇవ్వాలన్న ఉద్దేశంతో జనరల్ మజ్దూర్ అనే పేరును తొలగించి జనరల్ అసిస్టెంట్ గా మార్పు చేశారని ఆయన తెలిపారు.

# ఉగ్రవాద హత్యాకాండ అమానుషం

హైదరాబాద్ (జనంసాక్షి)



జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పర్యాటక ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద ముష్కరులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి ఒక మతానికి చెందిన 28 మంది అమాయక పౌరులు, పర్యాటకులను అతి క్రూరంగా చంపివేసారు. చనిపోయినవారిలో హైదరాబాదు ఇంటలిజెన్స్ బ్యూరోలో పనిచేస్తున్న మనీష్ రంజన్ కూడా ఉన్నారు. ఇది దేశ పౌరులనే కాదు, ప్రపంచ దేశాలను కలచివేస్తున్నది. ఈ అమానవీయ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. గాయపడిన 20మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది. మతంపేరుతో జరుగుతున్న ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి, మాటలతో సరిపెట్టకుండా అన్ని కోణాలనుంచి దర్యాప్తు చేసి దుండగులను న్యాయస్థానం ముందుంచి, కఠినంగా శిక్షించాలి. జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొనేలా, ఇలాంటి ఉగ్రవాద ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించి అక్కడి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ(ఎం) కోరుతున్నది.

# మహిళలను కోటీశ్వరులను చెయ్యడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : మంత్రి సీతక్క

త్వరలోనే మహిళలకు మీసేవ.. పౌల్ట్రీ.. డైరీ వ్యాపారాలు ఏర్పాటుకు ప్రోత్సాహం

కొత్తగూడలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను, ఈషా ప్రైవేట్ హాస్పటల్ ప్రారంభం

కొత్తగూడ ఏప్రిల్ 23 (జనంసాక్షి)



: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రములో మహిళా శక్తి క్యాంటీన్ ఇషా ప్రైవేట్ హాస్పటల్ ను ప్రారంభించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ సంవత్సరం 20 వేల కోట్ల రూపాయలు రుణాలు బ్యాంక్ లీకేజీ ద్వారా అందించామని రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభించడం జరుగుతుందని, నూతనమైన ఆహార పదార్థాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు.అదే విధంగా మహిళలు మీ సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్, డైరీ ఫాంలు, సోలార్ లైట్స్.. అదేవిధంగా 60 లక్షల పాఠశాల ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్?లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని,నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్లు దేశానికే ఒక బ్రాండ్ గా నిలవాలని, స్థానిక వనరులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ ను త్వరలోనే రూపొందిస్తామన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు, క్యాంటీన్ల ఏర్పాటుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించడంతోపాటు వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.అతి కొద్ది రోజుల్లో మండల కేంద్రంలో రోడ్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ ప్రాంతా అభివృద్ధికి మరింతగా కృషి చేస్తున్న అన్నారు. ఈషా హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి సీతక్క.. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కల్తి కొమ్మక్క, ఎల్లయ్య, డాక్టర్ కల్తి సవేర, డాక్టర్ తిరుపతి, దుర్గయ్య, భూదేవి ఈషా హాస్పిటల్ ఏర్పాటు చేసిన యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలి

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :





ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పారదర్శకంగా జరగాలని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన వెరిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన నివేదికలననుసరించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయుట, పరిశీలించుటకు ఎంపీడీవోలు ఎ.ఈ, ఏ.ఓ, ఎంపీవోలను టీంగా ఏర్పాటు చేసిన బృందానికి పర్యవేక్షణ అధికారిగా మండలాల ప్రత్యేక అధికారులుగా ఉంటారని, జిల్లాలోని 11 మండలాలతో పాటు మున్సిపాలిటీలను కలిపి మొత్తం 86 మంది వెరిఫికేషన్ అధికారులను నియమించడం జరిగిందని, ఈ మొత్తం ప్రక్రియ ఏప్రిల్ 30 వరకు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో వెరిఫికేషన్ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు వెరిఫికేషన్ లిస్టు లో ఉన్న వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రిమార్క్స్ కాలమ్ లో నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలన్నారు. వెరిఫికేషన్ అధికారులు ఏవైన సందేహాలు ఉన్నట్లయితే ఎంపీడీవో, హౌసింగ్ పీడీల ద్వారా అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ కోసం క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు చుట్టుపక్కల వారిని కూడా అర్హులా కాదా అనేది విచారించాలని, వివరాలు అన్నీ కూడా సరిగా నమోదు చేయాలన్నారు. వెరిఫికేషన్ లో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి అర్హులైన అత్యంత నిరుపేదలు, అసలు ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలన్నారు. వేసవి వడగాలుల దృష్ట్యా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఉపాధి పనులు మరే ఇతర పనులకు వెళ్ళే అవకాశం ఉన్నందున వెరిఫికేషన్ టీం లబ్ధిదారులు ఇంటివద్ద ఉన్న సమయంలో వెళ్లాలని అన్నారు. ఇందిరమ్మ వెరిఫికేషన్ టీంలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు ఐడి కార్డ్స్, క్యాప్స్ అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యా రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జడ్పి సీఈవో రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, హౌసింగ్ పిడి గణపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసూన రాణి, జిల్లా అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 (జనం సాక్షి)



అర్హత కలిగిన కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం లింగం పేట్ మండల కేంద్రం లోని బిసి కాలనీ కి చెందిన ఇబ్రహీం మమత రేకులషెడ్ ను కలెక్టర్ పరిశీలించారు. తాను కూలీ పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను అని, తన భర్త మరణించాడని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలనీ కలెక్టర్ ను కోరారు. ప్రస్తుతం ఉన్న రేకుల షెడ్ ను తొలగించి, అదే స్థలంలో ఇల్లు కట్టుకుంటానని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే 5 లక్షల రూపాయలతో పాటు ఇతర మార్గాల ద్వారా ఇల్లు నిర్మించుకుంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఇతర సిబ్బంది ఉన్నారు.

# సమస్య వుంటే తన దృష్టికి తీసుకురండి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ ప్రతినిధి: ఏప్రిల్ 23(జనంసాక్షి) :



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్య వుంటే తన దృష్టికి తీసుకరావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందికి సూచించారు. బుధవారం అర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆర్మడ్ రిజర్వ్ తో పాటు హెూంగార్డ్స్ పాల్గొన్న ఈ సమావేశం లో పోలీస్ కమిషనర్ ముందుగా సిబ్బంది శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, సిబ్బంది సమస్యల పరిష్కరం కోసం తీసుకోవాల్సిన చర్యలు పై పోలీస్ కమిషనర్ సంబంధిత పరిపాలన విభాగం అధికారులు అడిగి తెలుసుకోవడం తో పాటు త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సీపీ అధికారులను అదేశించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ విభాగంలో ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది చాలా కీలకమని, మీరందరు కీలకమైన విధులు నిర్వహిస్తున్నారని, కావున వ్యక్తిగత శ్రద్ధతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, మీరు నిర్వహించే విధులపై ఫిర్యాదులు రావద్దని, మీకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని. మీకు ఏదైనా సమస్య వుంటే ముందుగా మీ సంబంధిత అధికారుల దృష్టి కి తీసుక వెళ్లాలని, వీలైనంత వరకు సదరు అధికారులు సమస్య పరిష్కరించబడుతాయని. మీ సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బందికి అందుబాటులో ఉంటానని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, ఏ.ఎస్పీ మనన్ భట్, ఏసీపీలు జితేందర్ రెడ్డి,నాగయ్య, అనంతయ్య, సురేంద్రతో పాటు ఆర్.ఐ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో 2వ స్థానాన్ని దక్కించుకున్న రైతుబిడ్డ.



పెర్కిట్ గ్రామానికి చెందిన జక్క రమణయ్య కుమారుడు జక్క రీషిత్ తేజ

ఆర్మూర్, ఏప్రిల్ 23

ఆర్మూర్ పట్టణ పరిధిలోని పెర్కిట్ గ్రామానికి చెందిన జక్క రమణయ్య, జక్కలక్ష్మి ప్రియల కుమారుడు జక్క రీషిత్ తేజ ఇటీవల విడుదలైనటువంటి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానాన్ని దక్కించుకున్నాడు.హైదరాబాద్ శ్రీ చైతన్య కళాశాల నందు బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 437 మార్కులు వచ్చాయి. అందుకు కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు అభినందించారు.రిషిత్ తేజ కృషి పట్టుదలతో కష్టపడి విజయాన్ని సాధించాడు.ద్వితీయ సంవత్సరం కూడా ఇలాగే కష్టపడి మంచి విజయాన్ని సాధిస్తానని తెలియజేశాడు.తమ కుమారుడికి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తపరిచారు.

# రామప్పకు ప్రపంచ సుందరీమణుల రాక

కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

ములుగు/వెంకటాపూర్, ఏప్రిల్23 (జనంసాక్షి)



: వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు మే 14వ తేదీన ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతంగా సాగేవిధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు.బుదవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామం లోని రామప్ప ఆలయం, హరిత హెూటల్, ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లలో జరుతున్న పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజధాని హైదరాబాద్ నగరం లో నిర్వహించే ప్రపంచ సుందరీ పోటీలలో పాల్గొనే వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు హైదరాబాద్ నుండి ములుగు పర్యటనలో భాగంగా రామప్ప దేవాలయం ను సందర్శించనున్న నేపథ్యంలో రామప్ప పరిసర ప్రాంతాన్ని స్వాగత ఆర్చ్, ఆలయంను లైటింగ్ తొ సుందరికరించి,గ్రీనరీ పెంచాలని,స్వాగత ఏర్పాట్లు,కాకతీయ కట్టడాలను ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడానికి విదేశీ పర్యటకులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని,రాష్ట్రంలో మొదటిసారిగా ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా దేశాల సుందరి మనలను పర్యాటక ప్రాంతాలకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన వివరించారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రపంచానికి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం చరిత్రక విశేషాలను తెలియజేసేందుకు లభించిన ఈ అవకాశాన్ని విజయవంతంగా నిర్వహించాల న్నారు. కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, మండల అధికారులు, షో బోట్ ఈవెంట్ ప్రతినిధి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో అక్కచెల్లెలు మృతి

కొత్తగూడ ఏప్రిల్ 23 జనంసాక్షి



: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో రోడ్డు ప్రమాదంలో అక్కచెల్లెలు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.ఎదురెదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.మండలం లోని దుర్గరం గ్రామానికి చెందిన జంగా మౌనిక (17), జంగా నవ్య(16) గా గుర్తించారు.వీరితోపాటు మరో ఇద్దరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం.మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తగూడ ఎస్ ఐ కుశకుమార్ తెలిపారు.

# ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్


## ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య

హైదరాబాద్ (జనంసాక్షి)

తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు నిన్న విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. తీవ్ర మనస్తాపానికి గురై ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని, వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థినికి తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ విద్యార్థిని అశ్వితగా గుర్తించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరం చదివాడు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.హైదరాబాద్ మోతీనగర్ సమీపంలోని అవంతినగర్‌కు చెందిన విద్యార్థి బల్కంపేటలోని ఓ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఆవేదనకు గురై.. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# సహకారం, సమన్వయం లోపించిన శాసన, కార్యనిర్వాహణ, న్యాయశాఖలు

రాజ్యాంగంలోని ముఖ్యమైన మూడు అంగాలైన కార్యనిర్వాహక, శాసనసభ మరియు న్యాయవ్యవస్థల మధ్య సహకారం . సమన్వయం ఉండాలి, కానీ వీటి మధ్య కాలానుగుణ ఘర్షణ చోటు చేసుకోవటం దురదృష్టకరం.మొదటగా, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి, శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను రాజ్యాంగం ప్రకారం ఆమోదించి తెలపకుండా మూలాన పడేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ తమ తీర్పులో ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు బిల్లులను ఎక్కువ కాలం ఏదో ఒక నిర్ణయం తీసుకోకుండా నిలిపివుంచే అధికారం లేదని చెప్పారు. అసాధారణ సందర్భాల్లో మాత్రమే గవర్నర్ బిల్లులను రాష్ట్రపతికి పంపాలని న్యాయమూర్తులు చెప్పారు. ఈ సందర్భంగా గవర్నర్ అలాగే రాష్ట్రపతి ఇద్దరి ప్రత్యేక అధికారాల విషయంలో సుప్రీంకోర్టు సమీక్ష జరిపింది. 1987లో కూడా శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించ లేదు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది, సుప్రీంకోర్టు గవర్నర్‌ను తీవ్రంగా మందలించింది. అయినా మనం గవర్నర్ ల ప్రవర్తనాతీరు మారలేదు . ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ను కూడ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నానా ఇబ్బందులూ పెట్టారు. సుప్రీంకోర్టు సూచనలు, సలహాల కంటే వారిని గవర్నర్లుగా నియమించిన కేంద్రంలోని అధికారపార్టీకి విధేయత చూపటం మేలు అన్నట్లుగా ఉంది.




అయితే, ఇప్పుడు సుప్రీంకోర్టు మూడు నెలల్లోపు అటువంటి బిల్లులను ఆమోదించాలని, గవర్నర్ తో పాటు రాష్ట్రపతిని కూడా ఆదేశించడం ద్వారా సుప్రీంకోర్టు తన అధికారాన్ని అతిక్రమించినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చర్చ ఏమిటంటే, దానికి అలా చేసే అధికారం ఉందా? లేదా? అనేది సమస్యగా ఉంది .కనీసం, దానికి కాలపరిమితిని నిర్ణయించాల్సిన అవసరం లేదు. అది పార్లమెంటు మాత్రమే చేయగల రాజ్యాంగ సవరణకు దారితీయవచ్చు అని కొందరు. సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాన్ని కూడా ఉపయోగించుకుంది అని మరి కొందరు నిపుణులు పరస్పర భిన్నంగా వాదిస్తున్నారు. రాజ్యాంగ విషయాలలో సుప్రీంకోర్టు తన న్యాయ సమీక్షాధికారాన్ని ఉపయోగించ కుండా మౌనంగా ఉండలేదు.రాజ్యాంగ విషయంలో చట్టాన్ని వ్యాఖ్యానించటం తన విధి.



ఇప్పుడు, అసలు తప్పు తమిళనాడు గవర్నర్ దే అయినా, ఇతరులు జాగ్రత్తగా వ్యవహరించి ఉండవచ్చు. గతంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వం స్థిరపడిన ఆచారాలతో, ముఖ్యంగా రాష్ట్రాల ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయాలలో నిరంతర సంఘర్షణకు గురైనప్పుడు, హోం మంత్రిత్వ శాఖ కీలక మధ్యవర్తి పాత్ర పోషించడంతో విభేదాలు నిశ్శబ్దంగా పరిష్కరించబడ్డాయి. అరుదుగా ఇటువంటి విషయాలు న్యాయవ్యవస్థ జోక్యం కోసం వచ్చాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా ఈ శైలి అనవసరమైన ఘర్షణ మరియు వ్యాజ్యాల ద్వారా భర్తీ చేయబడింది. పర్యవసానంగా, గవర్నర్ల మాదిరిగానే, సుప్రీంకోర్టు కూడా ఇప్పుడు రాజ్యాంగం ఊహించని పాత్రను పోషిస్తోంది. శాసనసభల విషయానికొస్తే, అవి బాక్సింగ్ లేదా రెజ్లింగ్ రింగులుగా మారుతున్నాయి. కార్యనిర్వాహక వర్గం సైద్ధాంతిక లక్ష్యాలను అనుసరిస్తోంది. అది ఘర్షణలను మరింత తీవ్రతరం చేసింది. రాష్ట్రంలోని మూడు అంగాలు చెక్స్ అండ్ బ్యాలెన్స్ పద్ధతిలో ఘర్షణ వీడి పరస్పర సహకారం, సమన్వయంతో తమపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి తమను తాము మంచి ఉదాహరణగా చూపించుకోవాలి.



డాక్టర్.బైశెట్టి కవిత
అసిస్టెంట్ ప్రొఫెసర్
(పొలిటికల్ సైన్స్) కేజీసీ,
హన్మకొండ

# అందాల కాశ్మీర్‌లో రక్తపాతం.. ఉగ్రవాదుల క్రూర దుశ్చర్య

**2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్ సమీపంలోని అందమైన బైసరన్ గడ్డి మైదానం ఒక భయానక రక్తపాత దృశ్యంగా మారింది. లష్కర్-ఎ-తొయిబాతో సంబంధం కలిగిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ఉగ్రవాదులు అమాయకపు పర్యాటకుల బృందంపై కాల్పులు జరిపారు. కనీసం 28 మందిని హతమార్చి, 20 మందికి పైగా గాయపరిచారు. 2019 పుల్వామా బాంబు దాడి తర్వాత ఇది అత్యంత ఘోరమైన.హేయమైన దాడి. ఈ దాడి కేవలం నిరపరాధులపై జరిగిన హత్యాకాండే మాత్రమే కాదు,ఈ ప్రాంతంలోని ఇప్పుడిప్పుడే పునరుద్ధరించబడుతున్న శాంతిని, అభివృద్ధిని భగ్నం చేసే కుట్ర. వర్ధమాన పర్యాటక రంగంపై లక్ష్యంగా చేసుకొని ముష్కరులు జరిపిన దాడి. ఈ ఘటనను మానవత్వం గల ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలి.**



బాధితులు కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి వచ్చిన పర్యాటకులు.వారిలో ఒక 26 ఏళ్ల భారత నావికాదళ అధికారి, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి, నేపాల్, యూఏఈ నుండి వచ్చిన ఇద్దరు విదేశీయులు ఉన్నారని తెలుస్తోంది. సాక్షులు భయానక దృశ్యాన్ని వివరించారు. అందులో అనేక విషయాలు బయట పడుతున్నాయి. ఉగ్రవాదులు టూరిస్టుల గుర్తింపు కార్డులు చెక్ చేసి,ముస్లిమేతరులను ప్రత్యక్షంగా గుర్తించి, వారి పై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఒక బాధితురాలు తన భర్త తలలో కాల్చబడి, ప్రాణాల కోసం వేడుకుంటూ కుప్పకూలిన దృశ్యాన్ని గుర్తు చేసుకుంది. టీఆర్ఎఫ్ ఈ దాడిని భారత ప్రభుత్వం కాశ్మీర్‌లో "జనాభా మార్పులను" ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తుంది. ఇది భయాన్ని, విభజనను సృష్టించే వారి ఉద్దేశాన్ని కప్పిపుచ్చే సాకు మాత్రమే.



ఈ హత్యాకాండను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించడం అత్యవసరం. నిరాయుధులైన పౌరులపై, ముఖ్యంగా భారతదేశంలోని అత్యంత సుందరమైన లోయలలో సంతోషంగా సమయాన్ని గడుపుతున్న కుటుంబాలపై అమానుషంగా దాడి చేయడం పిరికితనం. జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సరిగ్గా చెప్పినట్లు, ఈ దాడి చేసినవారు "మానవత్వం లేని జంతువులు, ఖండించదగినవారు." ఈ దాడి ప్రాంతంలో పర్యాటకుల ఆతిథ్య, మర్యాదల సంప్రదాయాన్ని అవమానిస్తుంది. దశాబ్దాల సంఘర్షణ తర్వాత పర్యాటక రంగం ద్వారా జీవితాలను పునర్నిర్మించిన స్థానికుల ఆశలను నాశనం చేస్తుంది.

కానీ, కేవలం ఈ విషయం లో ఆగ్రహం సరిపోదు. ఈ దాడి భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యవస్థలోని లోటుపాట్లను బయటపెడుతుంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, ప్రభుత్వం "నయా కాశ్మీర్" చిత్రాన్ని ప్రచారం చేసింది. హింస తగ్గిందని, సాధారణ స్థితి నెలకొందని కేంద్ర ప్రభుత్వం నమ్మకంగా చెప్పింది. కానీ, 2024లో జమ్మూలో 44 మరణాలు ఈ వాదనను ఖండిస్తున్నాయి. కాశ్మీర్ లోయ నుండి జమ్మూ ప్రాంతానికి ఉగ్రవాదం మారినట్లు కనపడుతుంది.శాంతి భద్రతలు సున్నితంగా ఉన్న ఈ ప్రాంతంలో భద్రతా దళాలకు,ఇతల అధికారులకూ ప్రమాదమే. ఇప్పుడు లడాఖ్ ప్రాంతంలో చైనాతో ఉద్రిక్తతలు చోటు చేసుకున్న నేపథ్యంలో సైన్యాన్ని ఎక్కువ భాగాన్ని "లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్" కు మళ్లించడం కూడా జమ్మూను దుర్బలంగా మార్చింది.పాకిస్తాన్ చొరబాటు దారులకు మొదటి నుండీ అక్కడ దొంగ దారులు, తప్పించుకొనే లోయ ప్రాంతాలు, సరిహద్దులు, దట్టమైన అడవులను ఏలా ఉపయోగించు కోవాలో కిటుకులు,కీలక ప్రాంతాలు వారికి తెలుసు.

కేంద్ర ప్రభుత్వం ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నప్పటికీ, ఇంకా కొన్ని ఇంటెలిజెన్స్ వైఫల్యాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. లైన్ ఆఫ్ కంట్రోల్ ఆవతల ఉగ్రవాద శిబిరాల గురించి హెచ్చరికలు ఉన్నప్పటికీ, ఈ దాడి తీవ్రత ముందస్తు చర్యలలో లోపాన్ని సూచిస్తుంది. టీఆర్ఎఫ్ వంటి సమూహాలకు స్థానిక మద్దతు నెట్‌వర్క్‌లపై జాతీయ దర్యాప్తు సంస్థ దర్యాప్తు స్థానిక సమాజంలో ఉగ్రవాదులకు ఆశ్రయం, లాజిస్టిక్ సహాయం లభిస్తున్నాయని సూచిస్తుంది. ఇది సమాజ ఏకీకరణ, తీవ్రవాద నిర్మూలన ప్రయత్నాల ప్రభావం గురించి అసౌకర్యమైన అనేక భద్రతా లోపాల ప్రశ్నలను లేవనెత్తుతుంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ పర్యటనను అర్ధాంతరంగా ముగించడం, హోం మంత్రి అమిత్ షా శ్రీనగర్‌కు వెళ్లడం, ఇవి సాధారణ స్పందనలు కావు. భద్రతా నిపుణులు సూచించినలు పాటించాలి. ఈ సందర్భంగా కేవలం సైనిక చర్య మాత్రమే సరిపోదు. గ్రామ రక్షణ బృందాలను బలోపేతం చేయాలి. స్థానికులను ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించడం అవసరం. బయటి నుంచి వచ్చే భద్రతా దళాలకు స్థానిక ప్రాంతాల రహస్య స్థావరాలను అవగాహన చేసుకోవటం కష్టం.

రాజకీయంగా, ఈ దాడి ఆర్టికల్ 370 రద్దుపై చర్చను తిరిగి రగిలించింది. ఒమర్ అబ్దుల్లా, భారత జాతీయ కాంగ్రెస్ వంటి విమర్శకులు ఈ విధానం స్థిరత్వాన్ని తెచ్చిపెట్టడంలో విఫలమైందని, జమ్మూ కొత్త "ఉగ్రవాద కేంద్రం"గా మారిందని వాదిస్తున్నారు. జమ్మూ నగరంలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు, చర్యల కోసం కేకలతో నిరసనలు ప్రజల వ్యాకులతను ప్రతిబింబిస్తాయి. అయితే, టీఆర్ఎఫ్‌కు లష్కర్-ఎ-తొయిబాతో సంబంధం ఉన్నందున పాకిస్థాన్‌ను నిందించడం సమంజసమైనప్పటికీ, స్థానిక అసంతృప్తి, భౌగోళిక రాజకీయ పోటీలతో రగులుతున్న ఈ సంక్లిష్ట తిరుగుబాటును తేలికగా తీసుకుంటే ప్రమాదం.

అమర్‌నాథ్ యాత్ర సన్నాహాల్లో ఉన్న జమ్మూ కాశ్మీర్‌కు ఈ దాడి ఒక గట్టి హెచ్చరిక. భారతదేశం తన ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవాలి. సరిహద్దు భద్రతను మెరుగుపరచాలి. మరో విషాదం జరగకుండా గట్టి వైఖరి తీసుకోవాలి.భద్రతా దళాలు పెంచాలి. యావత్ భారత దేశం ప్రజలు ఈ దుఃఖంలో మునిగి ఉంది. నిరపరాధుల టూరిస్ట్ లు రక్తం న్యాయం కోరుతోంది.స్థానిక ప్రజలం, ప్రభుత్వం బాధితులకు అండగా నిలవాలి.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# ఎందుకు ఎంపికచేసిన సెన్సర్షిప్..?



కల్పనా పాండే

"ఫూలే" నేషనల్ అవార్డును గెలుచుకున్న అనంత మహాదేవన్ దర్శకత్వంలోని చిత్రం, "ది స్టోరీటెలర్" వంటి సున్నితత్వం, లోతు, కళాత్మక విలువలతో ప్రసిద్ధి చెందినది, విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకొని ఉంది. అసలు ప్రదర్శన తేదీ ఏప్రిల్ 11, 2025 నుండి, కొన్ని బ్రాహ్మణ సంస్థల అభియోగాల కారణంగా, ఏప్రిల్ 25, 2025కి మార్చబడింది. ఆ అభియోగాలు చిత్రం జాతివ్యవస్థను ప్రోత్సహించడమనే ఆరోపణలతో వచ్చినవి.


"ఫూలే" కథలో ప్రామాణికంగా జ్యోతిరావు మరియు సవిత్రిబాయి ఫూలేలను చూపిస్తుంది. భారతదేశంలో మొదటి బాలికల పాఠశాలని స్థాపించిన వారు, 'పక్కదారుల' జాతుల హక్కులవేత్తలు వీరుల విద్య, సామాజిక న్యాయం కోసం చేసిన అచంచల పోరాటాన్ని 19వ శతాబ్దం భారతదేశ నేపథ్యంతో వివరంగా నొక్కి చూపిస్తుంది. ప్రతీక గాంధీ జ్యోతిరావు ఫూలే పాత్రలో, పత్రలేఖా సవిత్రిబాయి ఫూలే పాత్రలో కనిపిస్తున్నారు. ఈ చిత్రం 1848లో భారతదేశంలో మొదటి బాలికల పాఠశాల స్థాపనను కూడా మరియు జాతి-లింగ వివక్షలపై వారి నిరంతర పోరాటాన్ని నమోదు చేస్తుంది. అనంత మహాదేవన్ ఉద్దేశ్యం ఫూలే కుటుంబం సమానత్వం కోసం చేసిన ఉద్యమాన్ని ప్రధాన ప్రవాహంలో తీసుకురావడం, ఇంకా జాతి మరియు లింగ అన్యాయాలపై వారి పోరాటాన్ని విపులంగా ప్రకటించడం.

బ్రాహ్మణ సంఘాల ఆరోపణలకు ప్రతిస్పందనగా, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్సీ) "మాంగ్" "మహార్" మరియు "పేష్వే" వంటి కుల సంబంధిత పదాలను తొలగించడం లేదా మార్చడం, "మూడు వేల సంవత్సరాల బానిసత్వం"ని "చాలా సంవత్సరాల బానిసత్వం"గా మార్చడం వంటి కోతలు, మార్పులను సిఫార్సు చేసింది. ఫూలే ఉద్యమానికి కేంద్రంగా ఉన్న బ్రాహ్మణ ఆధిపత్యం యొక్క కఠినమైన చరిత్రను మృదువుగా చేయడానికి ఈ సూచనలు ఉద్దేశించబడ్డాయి. ఈ మార్పులు ఫూలే యొక్క అర్థవంతమైన వారసత్వాన్ని ప్రభావితం చేస్తాయి మరియు అణగారిన వర్గాల చారిత్రక పోరాటాలకు తగిన గౌరవం ఇవ్వడంలో విఫలమవుతాయి. సిబిఎఫ్సీ తీసుకున్న నిర్ణయాలను పాశ్చాత్యీకరించబడినవి. అసంఘటితమైనవిగా వివిధ సామాజిక సంస్థలు విమర్శించాయి.

మొదటి అంశం విషయం ఏమిటంటే, మన దేశంలో సర్టిఫికేషన్ ప్రమాణాలు సమానంగా వర్తింపజేయబడుతున్నాయా? "ది కేరళ స్టోరీ" "ది కాశ్మీర్ ఫైల్స్" వంటి వివాదాస్పద, రెచ్చగొట్టే ప్రకటనలతో కూడిన చిత్రాలకు సిబిఎఫ్సీ ఎటువంటి అవసరమైన మార్పులు లేకుండా అనుమతి ఇచ్చినప్పటికీ, బ్రాహ్మణ, కులతత్వ విలువలను నేరుగా ఎదుర్కొన్న సామాజిక సంస్కర్తలు జ్యోతిరావు మరియు సావిత్రిబాయి ఫూలే గురించిన చిత్రం, అలా చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు అనేక మార్పులకు గురవుతోంది. జ్యోతిరావు ఫూలే ఏప్రిల్ 11న జన్మించినందున, ఈ చిత్రం యొక్క ఉద్దేశించిన విడుదల తేదీ కూడా అతని జన్మదినంతో సమానంగా ఉంటుంది. ఇది వాణిజ్యపరమైన పరిగణనలు ప్రభావం చూపవచ్చని సూచిస్తుంది. అధిక బాక్సాఫీస్ అవకాశాలను పొందడం కంటే - ఆలస్యం, సూచించిన మార్పులు సిబిఎఫ్సీ దాని మార్గదర్శకాలను సమానంగా అమలు చేయడం లేదని సూచిస్తున్నాయి. కొన్ని అభిప్రాయాలకు మద్దతు ఇచ్చే చిత్రాలకు తక్కువ అడ్డంకులు ఉన్నప్పటికీ, సవాలుతో కూడిన అంశాలతో వ్యవహరించే చిత్రాలపై అనేక పరిమితులు ఉన్నాయి. ఈ విధానం ఎంపిక సిబిఎఫ్సీ నిష్పాక్షికతపై సందేహాన్ని కలిగిస్తుంది మరియు కళాత్మక స్వేచ్ఛ మరియు చారిత్రక సత్యాలను నిజాయితీగా ప్రతిబింబించే దాని హక్కుపై పరిమితులను విధిస్తుంది.

రెండవ విషయం ఏమిటంటే, భారతదేశంలో కేసు ఆధారిత వివక్షత చాలా సున్నితమైన సమస్యగా మిగిలిపోయింది మరియు అది నేటికీ కొనసాగుతోంది. "ఫులే" వంటి సినిమాలు ఈ ప్రశ్నలను నేరుగా ఎదుర్కొంటాయి. అనేక విధాలుగా అడ్డంకులను ఎదుర్కొంటాయి. సెన్సార్ బోర్డు సభ్యుల పేర్లు, వారి నేపథ్యాలను పరిశీలిస్తే, సిబిఎఫ్సీ చర్యలు రాజకీయ ఒత్తిడిని లేదా సామాజిక స్థిరత్వాన్ని కొనసాగించడానికి తీసుకున్నాయని స్పష్టమవుతుంది. "ఫులే" వంటి సినిమాపై కఠినమైన నియమాలను విధించడం ద్వారా, సిబిఎఫ్సీ చేదు సత్యాన్ని, సామాజిక మార్పును ప్రోత్సహించే చిత్రాలను నియంత్రించాలనే దాని కోరికను, అలాగే వివాదాస్పద కథలకు కొంత వెసులుబాటు కల్పించే దాని విధానాన్ని ప్రతిబింబిస్తోంది.

ఈ సమస్యలో మూడవ అంశం తీవ్రమైనది ఎందుకంటే "ఫూలే"కి సర్టిఫికేషన్ నిరాకరించడం ప్రధానంగా కొన్ని బ్రాహ్మణ సంస్థల బలమైన ఆరోపణల కారణంగా జరిగింది. జ్యోతిరావు, సావిత్రిబాయి ఫూలే జీవితాల ఆధారంగా తీసిన ఈ చిత్రం బ్రాహ్మణ సమాజాన్ని సానుకూలంగా చిత్రీకరించలేదని, బ్రాహ్మణులకు అవమానకరమైనది లేదా అన్యాయం చేసిందని ఈ సంస్థలు ఆరోపించాయి. ఈ ఆరోపణలకు ప్రతిస్పందనగా, సిబిఎఫ్సీ సినిమా విడుదల గురించి ప్రశ్నలు లేవనెత్తింది. కొన్ని సన్నివేశాలు, సంభాషణలకు మార్పులను సిఫార్సు చేసింది, పక్షపాతం జోడించింది, ఇది సర్టిఫికేషన్‌ను ఆలస్యం చేసింది. అయితే, దర్శకుల ప్రకారం, ఈ చిత్రం చారిత్రాత్మకంగా ఖచ్చితమైనది, ఫూలే ప్రోత్సహించిన హృదయపూర్వక బ్రాహ్మణ పాత్రలను కలిగి ఉంది మరియు ఏ సమాజాన్ని కించపరచడానికి ఉద్దేశించబడలేదు. అయితే, సిబిఎఫ్సీ బ్రాహ్మణ సంస్థల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చింది. కుల సంబంధిత పదాలు లేదా సంఘటనలలో మార్పులకు గట్టిగా పిలుపునిచ్చింది. ఈ ఎంచుకున్న విధానం సిబిఎఫ్సీ నిష్పాక్షికతపై సందేహాలను లేవనెత్తుతుంది, ఇది భావోద్వేగాల సమూహం కంటే కళాత్మక సమగ్రతకు, దర్శకుల సృజనాత్మక దృష్టికి ప్రాధాన్యతనిస్తుంది. అందువల్ల, సిబిఎఫ్సీ స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటుందా లేదా బాహ్య ఒత్తిడికి లొంగిపోతుందా అనే ప్రశ్న



తలెత్తుతుంది. సిబిఎఫ్సీ బలవంతంగా చారిత్రక వాస్తవాలను లేదా కళాత్మక దృశ్యాలను మార్పిస్తున్నట్లయితే, దర్శకుల అసలు సందేశం తెలియజేయబడుతుంది. ప్రేక్షకులు సహజంగా పొందే హక్కు రాజీపడుతుంది. కాబట్టి, సిబిఎఫ్సీ విధానాలు, విశ్వసనీయతను ప్రశ్నించడం సహజం, అవసరం.

నాల్గవ అంశం ఏమిటంటే, ఈ సమస్య కళాత్మక స్వేచ్ఛపై భారాన్ని తగ్గించదు. అణచివేత సామాజిక వ్యవస్థను అధికారికంగా పరిష్కరించడమే "ఫూలే" ఉద్దేశ్యం అయినప్పటికీ, దాచిన వ్యతిరేకత మరియు సామాజిక సంఘర్షణ అనివార్యమైన పరిస్థితులను ఇది సృష్టించింది. ఈ విధంగా విధించిన కోతలు సినిమా యొక్క చారిత్రక నిజాయితీని దెబ్బతీయడమే కాకుండా, దర్శకుల కళాత్మక దృష్టిని మరియు ప్రేక్షకుల సత్యాన్ని ఎటువంటి అడ్డంకులు లేకుండా గ్రహించే హక్కును కూడా దెబ్బతీస్తాయి. ఈ పోరాటం చారిత్రక వాస్తవాల ఆధారంగా సామాజిక భావాలను ప్రతిబింబించే కళాత్మక వ్యక్తీకరణకు, ప్రస్తుత రాజకీయ వ్యవస్థ విధించిన పరిమితులకు మధ్య సంఘర్షణను సూచిస్తుంది.

మహాత్మా ఫూలే తన భార్య సావిత్రిబాయి ఫూలే మద్దతు లేకుండా అతని పని సాధ్యం కాదు. ఆమె ఎటువంటి అధికారిక విద్యను పొందలేదు, కానీ ఆమె వివాహం చేసుకున్నప్పుడు, ఆమె చదువుకుంది మరియు భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మారడానికి స్త్రీ శక్తిని నింపింది. ఆమె, ఇతరులతో కలిసి, సామాజిక అన్యాయాన్ని ఎదుర్కొని విద్య యొక్క దీపాన్ని ప్రకాశవంతంగా వెలిగించింది. కలిసి, ఫూలే కుటుంబం కుల ఆధారిత విద్యా వ్యవస్థ గోడలను బద్దలు కొట్టి, పేదలు, దళితులు మరియు శూద్రుల పిల్లలకు ప్రత్యేక పాఠశాలలను స్థాపించింది. ఆ పాఠశాలల్లో, కులంపై విచారణ జరగలేదు - ఆ కాలానికి ఇది విప్లవాత్మక చర్య. "గులామగిరి" వంటి రచనల ద్వారా, ఫూలే కుటుంబం కుల వ్యవస్థ వాస్తవాలను బహిర్గతం చేసి, బ్రాహ్మణ నియమావళిపై ప్రత్యక్ష దాడిని ప్రారంభించింది, "అందరూ చదువుకునే వరకు, సమాజం బానిసత్వంలోనే ఉంటుంది" అని ప్రకటించింది.

మహాత్మా ఫూలే కృషి విద్యకే పరిమితం కాలేదు. సత్యశోధక సంఘాన్ని స్థాపించడం ద్వారా, ఆయన సామాజిక సమానత్వం వైపు కొత్త మార్గాన్ని తెరిచారు. పండిత పునర్వివాహం, గర్భస్రావం చేసుకునే మహిళల హక్కు, బాలికల విద్య అవసరం, వ్యవసాయంలో అణచివేత మరియు బ్రాహ్మణ పూజారి తరగతి ఆధిపత్యం వంటి వివిధ అంశాలపై ఆయన రచనలు చేసి చర్యలు తీసుకున్నారు. ఆయన తన పోరాటాన్ని ఎప్పుడూ ఆపలేదుబీ కులాంతర సమానత్వాన్ని కాపాడటానికి మరియు బ్రాహ్మణ కులతత్వాన్ని రక్షించడానికి ఆయన సత్యశోధక సంఘాన్ని స్థాపించారు.

సత్యశోధక సంఘం పేరుతో, వివాహాలు, నామకరణ వేడుకలు, అంత్యక్రియలు వంటి మతపరమైన వేడుకలు బ్రాహ్మణ పూజారులు లేకుండానే జరిగాయి. సంఘ్ సామాజిక భోజనాలు మరియు బహిరంగ సమావేశాల సంప్రదాయాలను కులాల వారీగా విభజించే ఆలోచన లేకుండా స్థాపించింది. అన్ని కులాల ప్రజలు తమను తాము "సత్యశోధకులు"గా నిర్వచించుకోవడానికి కలిసి వచ్చారు. మొదటిసారిగా, దళితులు, శూద్రులు మరియు మహిళలకు నిజమైన సామాజిక వేదిక ఇవ్వబడింది మరియు ఉద్యమం సంఘంలోకి విద్యను ప్రవేశపెట్టింది.

వృద్ధాప్యంలో ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ, మహాత్మా ఫూలే సామాజిక సేవ పట్ల ఉత్సాహం ఎప్పుడూ తగ్గలేదుబీ ఆయన మరణం తర్వాత కూడా సత్యాన్వేషణ ఉద్యమం కొనసాగింది. తరువాత, సాతు మహారాజ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ వంటి నాయకులు సత్యాన్వేషణ భావాల నుండి ప్రేరణ పొందారు. నేటికీ, కులం పేరుతో హత్యలు జరుగుతున్నాయి, మతపరమైన అంశంగా అంధ విశ్వాసం పెరుగుతోంది మరియు మహిళలు, దళితులు మరియు ఓబిసిల హక్కులపై నిరంతరం దాడి జరుగుతోంది.

దర్శకుడు అనంత్ మహాదేవన్ తన చిత్రాన్ని స్పష్టంగా సమర్థించారు: "నా చిత్రంలో ఎటువంటి రహస్య ఎజెండా లేదు. ఇది భారతీయ సమాజాన్ని మార్చిన సామాజిక సంస్కర్తలకు నిజాయితీగా అంకితం చేయబడిన సినిమాటిక్ కళాఖండం." ఆయన ఇలా వివరించారు: ఈ చిత్రం కేవలం రెచ్చగొట్టడం కాదు, ప్రేరణ మరియు విద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఫూలే వారసత్వం ఒకే చిత్రానికి పరిమితం కాదుబీ ఇది భారతదేశ జాతి సంఘర్షణల చుట్టూ ఉన్న లోతైన అస్థిరతను ప్రదర్శిస్తుంది. మహాత్మా ఫూలే యొక్క అమూల్యమైన పాత్రను విద్యాపరంగా జరుపుకుంటున్నప్పటికీ, మీడియా ద్వారా సామాజిక మార్పు గురించి ఆయన దృక్పథాన్ని చిత్రీకరించే ప్రయత్నాలు ఇప్పటికీ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయి.

కుల అసమానతలను సవాలు చేస్తూ, దళిత మరియు అణగారిన వర్గాలను శక్తివంతంగా ఆలింగనం చేసుకుంటూ, ఫూలే కుటుంబం నిరంతర పోరాటంలో పాల్గొంది. వారు ప్రారంభించిన మేధో పోరాటం ఇప్పటికీ అపారమైన విలువను కలిగి ఉంది. విద్య, సమానత్వం మరియు న్యాయం వైపు ప్రతి అడుగు మహాత్మా ఫూలే స్ఫూర్తిదాయక వారసత్వం నుండి ప్రేరణ పొందింది. జ్యోతిరావు మరియు సావిత్రిబాయి ఫూలే చూపిన "సత్యశోధన" మార్గం ఇప్పటికీ చాలా మంది నమ్మకాలకు మద్దతుగా నిలుస్తుంది.

Kalpana281083@gmail.com
(9082574315)

## బిసి కాహళిక

మతం.. వర్గం.. కులం
గణాల కాలంలో లేవు
గుంపుల జీవితాల్లో
అందరు సమానమే
రాను రాను.. మారి మారి
మతాల వటవృక్షాల నీడల్లో
మనుష్యులు విభజింపబడి
కొందరిని ఎదగ కుండా
ఆ నీడల్లో అణిగిమణిగి
అడుగులకు మడుగులు
వత్తుకుంటు సాగినవి జీవితాలు...
పేద ధనిక వర్గాలుగా
దళిత బిసి మైనార్టీలు
ఓసిలుగా విభజింపబడి
ప్రజాస్వామ్యం లో మనుగడ
ఎవరి ఉన్నతికి వారి వారి పోరాటాలు...
రైలుభోగీల్లో తరగతులుగా
రిజర్వేషన్లు విభజనకు లోనయ్యాయి
ఉద్యోగాల్లో ఊరట ఎక్కడ
గుంపులుగా విడగొట్టబడ్డాయి
ఎవరి గూడు వారి గోడుతో సరి
ఐక్యతా రాగం లేనందునే...
వంకాయల టెంకాయల దూషణలు
అశ్లీల అసంబద్ధ నిర్వచనాలు
బిసి ఓట్లతో గెలిచిన నేతల ప్రవచనాలు
ఓసీ లనే గెలిపిస్తారు బిసీలు
మానవ సహజ నైజాలు జీవన బీజాలు...
విడిపోతే పడి పోతాం
లింకుల లంకెతో బలపడతాం
మనరాజ్యాంగ హక్కుకై కదులదాం
కలసి పోరాడాలి కదను తొక్కాలి
ఎన్నాళ్లీ ఎన్నేళ్ళని దుఃఖాన్ని అణుచుకోవాలి
నోటికి అందె బుక్క అందకుండ చేస్తే ఊరుకోవాల
మనజనాభ దామాస ప్రకారం
అధికారాలు మనకు దక్కాలీ
శాసనకర్తలుగా శాసన నాయకులుగా
బిసిలు ఎదగాలి...
విభజింపబడ్డ వారం
భజన పరులుగా ముద్ర పడిన వారం
మీ వృత్తులు మాకోసం
మీ జాతులు మా ఊడిగం కోసం
బుర్రలేని వెధవలు
గొర్రెతోక మూరు?లు
చెట్ల లాపెంచు తాం
నీడను పండ్లను అనుభవిస్తాం
కోపం వస్తే గొడ్డలితో నరకేస్తం
పెద్దల పెత్తందార్ల
మాటల దుంధుబి మోతలు
వినిపించడం లేదా
అందుకే అందుకే
పూరించండి ఐక్యత కాహళిక
పాడండి పాడండి
ఐక్యతా సాధన గీతిక

**రేడియమ్**
**9291527757**

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా వెనుకంజ

- **ప్రథమ సంవత్సర ఫలితాల్లో 34వ స్థానం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 31వ స్థానం, ఉమ్మడి జిల్లాలో చివరి స్థానం**
- **ఫస్టియర్ 47.79 శాతం, సెకండియర్ 62.82 శాతం**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఈ నెల 22న వెలువడిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షా ఫలితాలలో నాగర్ కర్నూల్ జిల్లా వెనుకంజలో నిలిచింది.ఇంత తక్కువ శాతం ఫలితాలు రావడమేంటని,దీనికి గల కారణాలు ఏంటని విద్యార్థులు , విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంటర్ మొదటి సం వత్సరంలో 47.79 శాతం విద్యార్థులు,ద్వితీయ సంవత్సరంలో 62.82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెండింటిలోనూ బాలికలే పైచేయిగా నిలిచారు. మొదటి సంవత్సరంలో మొత్తం 4,877 మంది వి ద్యార్థులకు గాను 2,341 మంది ఉత్తీర్ణులయ్యారు. అందులో 567 మంది బాలురు ఉండగా 1,774 మంది బాలికలు ఉన్నారు. అదేవిధంగా ద్వితీయసంవత్సరంలో మొత్తం 4,629 మంది విద్యార్థులకు గాను 2,908 మంది వి ద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో 817 మంది బాలురు, 2,091 మంది బాలికలు ఉన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా లో మహబూబ్ నగర్, నారాయణ పేట, జోగులాంబ గద్వాల,వనపర్తి, నాగర్ కర్నూల్ ఐదు జిల్లాలు ఉన్నాయి.ఉమ్మడి జిల్లాల్లో ఇంటర్మీడియట్ పరీక్షా



ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలోనూ నాగర్ కర్నూల్ జిల్లా చాలా వెనుకబడింది. అదేవిధంగా రాష్ట్ర స్థాయి ఫలితాల్లో సైతం నాగర్ కర్నూల్ జిల్లా మొదటి సంవత్సరం ఫలితాల్లో 34వ స్థానంలోనూ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 31వ స్థానంలో నిలవడంతో జిల్లాలోని విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులను అసంతృప్తికి గురి చేసింది.ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఉత్తీర్ణత సాధించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో మార్కులు విద్యార్థులు ఆశించిన స్థాయిలో కాకుండా చాలా తక్కువగా రావడంతో విద్యార్థుల మొత్తం మార్కులు ఊహించని విధంగా తారుమారయ్యాయి. దీంతో బాగా చదువుకున్న విద్యార్థులు ఇంగ్లీష్ సబ్జెక్టు మూల్యాంకనం చేసిన విధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రివాల్యుయేషన్ కు దరఖాస్తు చేసుకోవడానికి సిద్దమవుతున్నారు.

### కళాశాలలకు సక్రమంగా హాజరు కాకపోవడమే



విద్యార్థులు కళాశాలలకు సక్రమంగా హాజరు కాకపోవడమే ఫలితాలలో వెనుక బడి పోవడానికి ప్రధాన కారణం.ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులకారణంగా వారి తల్లిదండ్రుల వెంట పనులకు వెళ్ళడంతో కళాశాలకు సక్రమంగా హాజరు కాలేదు.ఈ కారణంగా అధ్యాపకులు చెప్పిన పాఠాలు వినలేక పోవడంతో పరీక్షా ఫలితాల్లో ఫేయిల్ అయ్యారు.కెజిబివి, ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ కళాశాలల విద్యార్థులు, పట్టణంలో ఉండే కళాశాలకు వసతి గృహాల సౌకర్యం ఉండడంవల్ల అక్కడే ఉంటూ కళాశాలలకు సక్రమంగా హాజరైన విద్యార్థులు ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అయితే రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఉత్తీర్ణత కాని విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు, ఆఫ్లైన్ తరగతులు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధతో బోధించి అధిక మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదింపజేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

**వెంకటరమణ, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి**

# ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయం




**పెద్దపల్లి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో పెద్దపల్లి జిల్లా కీలకంగా పనిచేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యమ సమయంలో సింగరేణి సమ్మె చేస్తే ఢిల్లీకి ఉద్యమ సెగ తగిలిందని గుర్తుచేశారు. పెద్దపల్లి జిల్లాలో గురువారం పర్యటించిన ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 160 నుంచి 170 పార్టీ వచ్చి పోయాయని.. కానీ 25 ఏండ్లుగా నిలబడ్డ ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గుండె చప్పుడైందని తెలిపారు. ప్రతి ఒక్కరితోనూ బీఆర్ఎస్ పార్టీ పెనవేసుకుందని.. తెలంగాణ ప్రజలతో పార్టీది పేగుబంధమని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు అవహేళన చేసిన వారికి కూడా గులాబీ జెండా రక్షణగా ఉందని అన్నారు. పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే నంబర్‌వన్‌గా నిలిపామని గుర్తుచేశారు. గులాబీ జెండా 25 ఏండ్ల చరిత్రను యావత్ తెలంగాణ గుర్తుచేసుకుంటుందని కల్వకుంట్ల కవిత అన్నారు. ఏడాది పాటు బీఆర్ఎస్ పార్టీ వేడుకలు చేస్తామని తెలిపారు. ప్రతి ఏటా ప్లీనరీలు జరుపుకుంటున్నా.. ఈ రజతోత్సవ సభ ప్రత్యేకమైందని తెలిపారు. గత 25 ఏళ్లుగా ఉద్యమ, బీఆర్ఎస్ పాలనా కాలాన్ని ప్రజలంతా నెమరేసుకునేలా ఈ సభ ఉండబోతుందని చెప్పారు. ఈ రజతోత్సవ సభకు పెద్దపల్లి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అంటే ప్రేమ ఉన్న ప్రతిఒక్కరూ వరంగల్ సభకు రావాలన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా, తెలంగాణ కుంభమేళాగా సభ జరగనుందని చెప్పారు.

## వైద్యాధికారులు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** జిల్లాకు అవసరమైన వైద్యాధికారులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ సంయుక్తంగా సూచించారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాలల్లో అవసరమైన ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు,అసోసియేట్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితర నియామకానికి అవసరమైన ఖాళీల వివరాలను శనివారం వరకు అందజేసినట్లయితే, పొరుగు సేవల క్రింద నియామకాలు చేపట్టేందుకు సోమవారం రోజు ప్రకటన జారీ చేయుటకు వీలు పడుతుందన్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, వాటి పూర్తి వివరాల ప్రతిపాదనలను అందజేయాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ ప్రెసిడెంట్ల నియామకాలు చేపట్టేందుకు జిల్లా నియామక కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది నియామకానికి పురుగు సేవల ఏజెన్సీల ద్వారా నియామకాలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన టీ హబ్ ఎక్స్టెన్షన్ పనులు, ఆక్సిజన్ ప్లాంట్, క్యాంటీన్ ఏర్పాటుకు టీజీఎంఐడిసి వారిని సంప్రదించి ప్రతిపాదనలను అందించాలని సూచించారు.క్యాంటీన్ నిర్వహణకు మహిళా శక్తి సభ్యులకు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రిలో అవసరమైన అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఇతర జిల్లాల్లోని ఆసుపత్రులకు ముఖ్యంగా కర్నూలు ఆసుపత్రికి రిఫర్ చేయకుండా అన్ని



రకాల వైద్య సేవలను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య అధికారుల నియామకాలు చేపట్టేటప్పుడు స్థానికులను ఎంపిక చేసినట్లయితే మంచి సేవలు అందించే అవకాశం ఉంటుందని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు పార్కింగ్ షెడ్ ఏర్పాటు చేసి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను స్పష్టంగా గుర్తించి, వాటి పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను అందించాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరిడెంట్ ఇందిర, వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

- **ఎమ్మెల్యే జారే**


**చండ్రుగొండ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మరో మారు ఇందిరమ్మ ఇల్లు లక్షలాదిమంది పేదలకు మంజూరు చేసిన ఘనత దక్కిందని అశ్వరావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ అన్నారు. బుధవారం చండ్రుగొండ మండలంలో విస్తృత పర్యటన చేశారు. మద్దుకూరులో రాష్ట్రంలోనే మొదటి మోడల్ అంగన్వాడి భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో ఎన్నికల హామీలో భాగంగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తానని చెప్పి దానిని నిజం చేసి ఈరోజు ఇల్లు మంజూరు చేసి బేస్ మట్టం లెవెల్ పూర్తయిన వాటికి లక్ష రూపాయలు వారి అకౌంట్లో వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. ప్రతిపక్షాలు సైతం ముక్కున వేలు వేసుకునే విధంగా పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో తమ ఉనికిని చాటుకోవడానికి కాంగ్రెస్ పార్టీ వారికి ఇల్లు ఇచ్చామని చెబుతూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను త్రోసిపుచ్చే విధంగా ఆ పార్టీ వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత మాకే దక్కుతుందని అటువంటి ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని ఇంకా రానివారికి రెండవ మూడవ ఫేసులో కచ్చితంగా వస్తాయని తెలిపారు. అంగన్వాడి భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభించి చిన్నారులకు అన్ని రకాలుగా సదుపాయాలు అందజేయడమే కాకుండా చదువుల్లో రాణించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గాను లక్షలాది రూపాయలు మంజూరు చేసి పనులు పూర్తయిన సిసి రోడ్లు



కోతులు బెడద లేకుండా సోలార్ ఫెన్సింగ్ ను ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి రానున్న రెండు నెలల్లో ప్రభుత్వ వైద్యశాల భవనాలు మరమ్మత్తులు పూర్తి చేసే విధంగా రూ అయిదు లక్షలు అక్కడికక్కడే మంజూరు చేశారు. అదేవిధంగా డార్మెటరీ ఎలక్ట్రిఫికేషన్ హోమియోపతి వైద్యశాలకు అదనపు గదిని ఏర్పాటు చేస్తానని తెలిపారు. మండలంలో ఎక్కడికి వెళ్లినా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రజలు సాదరంగా ఆహ్వానించి సమస్యల సాధనకు కోట్లాది రూపాయలు వెచ్చించి పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నందుకు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమాలలో నాయకులు భోజ్య నాయక్, నల్లమోతు వెంకటరమణ తుమ్మలపల్లి సురేష్, ఫజల్ భక్ష్ ,బొర్రా సురేష్ ,సారేపల్లి శేఖర్, బడుగు కృష్ణవేణి, కిరణ్ రెడ్డి, బాబులాల్, ఆలకుంట రామదాస్, బుంగ శ్రీను ,చాపలమడుగు లక్ష్మణ్ ,రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నించేవారే కదలాలి

- **సామాజిక తత్వవేత్త, బీసీ కమిషన్ తొలి చైర్మన్ బిఎస్ రాములు**



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఇన్ని ఘోరాలు నేరాలు జరుగుతుంటే మన మేధావులేమైపోయారు? అని కొందరు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా అందరు గమనించాల్సిన విషయం ఏమంటే ఈ ప్రభుత్వాలను మనమే ఎన్నుకున్నాము. ప్రభుత్వ యంత్రాంగం , న్యాయవ్యవస్థ పద్ధతి ప్రకారం ఎన్నుకున్నవే. ఇక ఇన్ని ఘోరాలు నేరాలు అవినీతి అక్రమాలు జరుగుతుంటే మత ద్వేషాలు పెరుగుతుంటే మేధావులు విద్యావంతులు , ప్రజాస్వామ్యవాదులు ఏం చేస్తున్నారని ప్రశ్నకు రాజ్యం అన్ని యంత్రాంగాలు ప్రభుత్వాలు జవాబుదారీ కద! వాళ్లను ఎన్నుకున్నదే అందుకు! ఎన్నుకున్నదే మనం. ఎన్నుకునేటప్పుడే ఈ సోయి వుండాలి. ఎవరికో వోటేసి వాళ్లు తప్పు చేస్తే ఇంకెవరినో పోరాటం చేయాలి, అని అడగడమేమిటి ?అధికారం ఒకరికిచ్చి మరొకరిని పోరాటం చేయాలంటే కుదరదు అన్నాడు కాన్సీరాం. సిపి ఐ సిపియం వాళ్లు చేసిన పోరాటాల వల్ల ప్రయోజనం పొందినవాల్లంతా ఓటేస్తే 130 పార్లమెంటు సీటు రావాలి. ముప్పయి సీట్లే వస్తున్నాయంటే పనిచేసినవారికి ఓటేయలేదని అర్థం అన్నారు కాన్సీరాం. అందువల్ల అవసరం ఉన్నవాల్లే, ఇలా అడిగిన వాల్లే పోరాటం చేయాల్సింది . వాల్లు ఇంటిలో వుంటే ఇతరులు పోరాటం చేయాలని కోరడం సంస్కారం కాదు. మేధావులు ఎప్పటికప్పుడు అన్యాయాలగురించి చెప్తేనే కదా ప్రజలకు తెలిసింది. ఏరీ మేధావులు అని అడిగేవారు ముందు బడితే మేధావులు మద్దతుగా కదిలి వస్తారు. వారు రాకపోతే వీరే మేధావులుగా నాయకులుగా ఎదుగుతారు. అందువల్ల కదలాల్సింది మేధావులను ప్రశ్నించే చైతన్యం పొందినవారే. ఎందుకు అలాంటి వాల్లకు ఓటేసారో అని ప్రజలనుకూడా ప్రశ్నించకపోతే ప్రయోజనం ఏమిటి? పత్రికలు టీవీలు జర్నలిస్టులు మేధావులు ఎప్పటికప్పుడు అన్యాయాలు అక్రమాలు అవినీతి వెలికి తెస్తున్నారు . నిలదీస్తున్నారు. కదలాల్సింది మేధావులను ప్రశ్నించే వారే! తాము చేయని పని మంది చేయాలనే స్వార్థ తత్వం వదులుకుని ముందుకు కదలాలి. కలిసివచ్చే మేధావులు మద్దతు ఇస్తారు! ప్రజలు ఇటీవల బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్ట సభల్లో విద్యా ఉద్యోగ రంగాల్లో కల్పించాలని రాజ్యాంగ సవరణ చేయాలని కదులుతున్నారు. వారికి మద్దతుగా కదిలితే బీసీ వర్గాల ప్రాతినిధ్యం పెరుగుతుంది. అవకాశాలు జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ప్రజలుఈ విషయాలు గమనించాలని కోరుతున్నాను.

## ప్రభుత్వ బడిలో..నాణ్యమైన విద్య




**పాపన్నపేట, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం కుర్తివాడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బతుకమ్మ, బోనాలతో ప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేఘ్య నాయక్,పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

## భూభారతి చట్టంతో రైతులకు బహుళ ప్రయోజనాలు

- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చేలా భూ భారతి చట్టం రూపొదించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం మఠంపల్లి మండలంలో నిర్వహించిన భూభారతి చట్టం -2025 పై అవగాహన సదస్సుకు ముఖ్య



అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన, న్యాయమైన సేవలు అందుతాయని అన్నారు.ఈ చట్టంలో ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని, తమ సమస్యను దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మంగా, ఎంపిడిఓ జగదీష్, డిటి బాలరాజు, పిఎసిఎస్ చైర్మన్ జవ్వాజి రామచంద్రయ్య,వైస్ చైర్మన్ బాబు నాయక్, డిప్యూటీ తహశీల్దారులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంఐఎం విజయం లాంఛనమే..!



- **పోలింగ్ కు దూరంగా ఉన్న బీఆర్ఎస్**
- **ప్రశాంతంగా ముగిసిన లోకల్ బాడీ ఎమ్మెల్సీ పోలింగ్**
- **మొత్తం ఓట్లు 112, పోలింగ్ 80 శాతం**

**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** జీహెచ్ఎంసీ లోకల్ బాడీ స్థానం పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ పార్టీకి చెందిన మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి మొత్తం 112 మంది ఓటర్లున్నారు. వీరిలో అత్యధికంగా 50 మంది ఓటర్లు ఎంఐఎం పార్టీకి చెందిన వారే ఉండగా, వీరంతా మూకుమ్మడిగా కలిసి రెండు బూత్‌లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ స్థానం పరిధిలో పోలైన ఓట్లలో సగానికి పై ఒక ఓటు అదనంగా వచ్చిన అభ్యర్థి విజయం సాధించినట్టేనని అధికారులు వెల్లడించిన నేపథ్యంలో ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన 24 మంది ఓటర్ల మినహా మిగిలిన 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, అందులో సగం కంటే ఎక్కువ అంటే దాదాపు 50 పై చిలుకు ఓట్లు మజ్లీస్ పార్టీకి అనుకూలంగా ఓటింగ్ చేసిన నేపథ్యంలో ఈ ఎలక్షన్ లో ఎంఐఎం పార్టీ విజయం



లాంఛనమేనని తేలిపోయింది. సుమారు 22 ఏళ్ల తర్వాత లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగగా, మిగిలిన సందర్భాల్లో ఈ స్థానం ఎన్నిక ఏకగ్రీవం కాగా, ఈసారి పోలింగ్, కౌంటింగ్ అనివార్యమైంది. జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్ లలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారీ బందోబస్తుతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం చుట్టూ పోలీసులు కట్టుదిట్టంగా ఆంక్షలను అమలు చేస్తూ పోలింగ్ నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్‌లో భాగంగా బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, డా కే లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి లు తొలుత పోలింగ్ బూత్ నెంబర్.1 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎంఐఎం హైదరాబాద్ ఎంపీ అసదుద్దిన్ ఓవైసీ ఎమ్మెల్యేలు అక్బరుద్దిన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దిన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలాలు ఒకేసారి వరుసగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఉగ్రదాడిని ఖండించిన బీజేపీ

**జహీరాబాద్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** కశ్మీర్‌లో హిందువులపై జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ బీజేపీ జహీరాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణ బీజేపీ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టి బొమ్మలు, చిత్రపటాలు దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ మాట్లాడుతూ, “కశ్మీర్‌లో జరిగిన అమానుష ఘటనలు తాళలేనివి. చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. దేశాన్ని శాంతిభద్రతలతో నడిపించేందుకు ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ప్రతి దాడికి తగిన ప్రతిచర్య తప్పదు,” అని స్పష్టం చేశారు. ఈ



కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబత్ జగన్నాథ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, గొల్ల భాస్కర్, విజేందర్ రెడ్డి, సుధీర్ భండారి, జిల్లా నాయకులు శ్రీనివాస్ గుప్తా, అల్లాడి బక్కయ్య గుప్తా, మతం విశ్వనాథ్, మండల అధ్యక్షులు దుర్గయ్య, రమేష్ రెడ్డి, మల్లేష్, బంటు విశ్వనాథ్, వైజ్యనాథ్, మహిళా నాయకురాలు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం

**ఉర్కొండ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వములో మంచి రోజులు వచ్చాయని, భూభారతి తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని,మండలంలోని రైతులు ఈ యొక్క అవకాశాన్ని వినియోగించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల యొక్క దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరించేందుకు విప్లవాత్మకమైన “భూ భారతి చట్టం”ను రూపొందించిందని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్.డి. ఓ, శ్రీనివాసులు, తహశీల్దార్ ఎండి యూసుఫ్ అలీ, ఎంపీడీవో కృష్ణయ్య, వ్యవసాయ అధికారి దీప్తి, దేవాలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



జనంసాక్షి www.janamsakshi.org | గురువారం 24 ఏప్రిల్ 2025

# సూరీడు..భగ..భగ





- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కొన్ని ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పెరిగిన ఉక్కబోత వెలవెలబోతున్న రహదారులు
- ఇంట్లో ఉన్నా.. ఒంట్లోంచి చెమటలే..
- టోపీయే అండ..
- జిల్లా వ్యాప్తంగా మండుతున్న ఎండలు

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ఉదయం 8 గంటలకే ఉష్ణోగ్రత పెరుగుతున్నది ఎండ తీవ్రత రోజురోజుకు క్రమేపి పెరుగుతున్నది. ఏటా మార్చి నెల చివరి వారం నుంచి పెరిగే ఉష్ణోగ్రతలు ఈ సంవత్సరం మార్చి నెల మొదటి వారం నుంచే పైపైకి వెళ్లడం ప్రారంభించాయి. వారం క్రితం వరకు 30 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైన ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా 37, 40 డిగ్రీలకు చేరుకున్నాయి. దీంతో మధ్యాహ్నం వేళ ఎండ చిరాకెత్తిస్తున్నది. టెంపరేచర్లు కూడా పెరగడంతో ఇంచుమించు మూడు నెలలుగా ఏసీల వైపు కన్నెత్తి చూడని ప్రజలు స్విచ్ ఆన్ చేస్తున్నారు. ఈ ఏడాది చలి ఎంత అధికంగా ఉందో ఎండ కూడా ఎక్కు వగానే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎండలకు రోడ్లన్నీ వెలవెలబోతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు.

### ఎండ తీవ్రతకు ప్రజలు విలవిల..

భానుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ఉష్ణోగ్రతలకు బయటకు రావడానికే భయపడుతున్నారు. పెరిగిన వేడి నుంచి ఉపశమనానికి వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్లా ఉష్ణోగ్రత 36 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ దాటి నమోదైతున్నాయని చెబుతున్నారు. ఎండ తీవ్రతకు ప్రజలు వణికిపోతున్నారు.మరో వైప ఉక్కబోతతో నరకయాతన అనుభవిస్తున్నరు.

### చిన్నారులు, వృద్ధులపట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం..

వేసవి వచ్చిందంటే మధ్య తరగతి, పేద కుటుంబాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొంటాయి. వేసవి ఉష్ణోగ్రతలు, ఉక్క పోతను భరిస్తూ నానా అవ స్థలు పడుతుంటారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు వేసవి తాపానికి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో అప్ర మత్తంగా ఉండి కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకుంటే మండు వేసవిలో సైతం చల్లని వెన్నెలలను ఆస్వాదించవచ్చు.

### బయటకు వెళ్ళేటప్పుడు తీసుకునే జాగ్రత్తలు..

వేసవిలో వీలైనంత వరకు ప్రయాణాలు చేకుండా చూసుకోవాలి. తప్పనిసరై బయటకు వెళ్తే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. వేసవిలే ఎండల వల్ల కళ్లకు ప్రమాదం ఉంటుంది. అందుకు కళ్ళకు సన్ గ్లాసెస్, తలకు టోపీ ధరించాలి, అలాగే శరీరానికి తేలికపాటి, కాటన్ దుస్తులు ధరించాలి, నీళ్ల సీసా వెంటబెట్టుకోవాలి, ఆల్క హాల్, సిగరెట్, కార్బొనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.

### తినే ఆహారంలోనూ జాగ్రత్తలు అవసరం..

వేసవిలో ఎండలు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందాలంటే తీసుకునే ఆహారంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. నూనె శాతం తక్కువగా ఉండాలి. ఆకు కూర లు ఎక్కువగా తీసుకోవాలి. ఉదయం పూట నూనె వంటకాలు కాకుండా ఆవిరి కుడుములు, ఇడ్లీలు, నీటి శాతం ఎక్కువగా ఉండే కర్బూజ వంటి పండ్లను తినాలి. మజ్జిగ అన్నంతో మామిడి పండ్లు తీసుకుంటే శరీరానికి ఏ.డి విటమిన్లు ఎక్కువగా లభిస్తాయి. రసాయినాలతో శరీరానికి హాని కలిగించే శీతలపానియాలు తీసుకోవడం కన్నా కొబ్బరినీళ్లు తాగడం మంచిది. కాఫీ, టీలు వంటి వాటికి వీలైనంత దూరంగా ఉండాలి. పలుచని మజ్జిగలో కాసింత నిమ్మ లేదా కర్వేపాకు, దబ్బాకులు వేసి ఉప్పు వేసుకుని పలుచగా కలిపి తాగితే శరీరానికి చల్లదనంతో పాటు, ఆరోగ్యానికి ఎంతో మంచిది.

### వాహనాల పట్ల జాగ్రత్తలు..

వేసవిలో బయటకు వెళ్ళేటప్పుడు ప్రయాణించే వాహనాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రయాణాలకు ఉపయోగించే ద్విచక్రవాహనాలను ప్రయాణానికి ముందే క్షుణ్ణంగా పరిశీలించాలి. టైర్లలో గాలి ఉందో లేదో తనిఖీ చేయాలి. ప్యాచిలు, అరిగి ఉన్న టైర్లను తొలగించాలి. ఎండలో వాహనాలను ఎక్కువ సేపు నిలపరాదు. వాహ నాలపై అతివేగంగా ప్రయాణించకూడదు. ఎండ వేడికి టైర్లు పేలిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఏకదాటిగా ఎక్కువసేపు ప్రయాణించకుండా కాస్త చెట్టునీడలో సేద తీరాలి.

### చిన్నారులు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు..

వేసవిలో మధ్య వయస్కులు కంటే చిన్నారులు, వృద్ధుల పట్ల జాగ్రత్త వహించాలి. సాధారణంగా వేసవిలో పిల్లలు ఎండలోకి వెళ్ళి ఆటలు ఆడతారు, దీంతో పిల్లలు వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అందుకు వారిని ఇండోర్ గేమ్స్ ఆడించాలి. బయటకు పంపిం చినా వదులుగా ఉండే దుస్తులు తలకు టోపీ, కాళ్ళకు సౌకర్యంగా ఉండే చెప్పులు వేయాలి. వృద్ధులు అవసరమైతే తప్ప బయటకు వెళ్ళరాదు. ఊపిరితిత్తుల సమస్యలు గుండె సంబంధ వ్యాధులు ఉన్నవారు ఎండ తీవ్రత పల్ల తీవ్ర డీహైడ్రేషన్కు గురయ్యే అవకాశం ఉన్నందున వారు జాగ్రత్తలు తీసకోవడంతో పాటు వారితో అవసరమయ్యే మందులు తీసుకువెళ్ళాలి.

### టోపీయే అండ..

ఎండల తీవ్రతకు టోపీల విక్రయాలు ఊపు అందుకున్నాయి. జీన్స్, కాటన్ టోపీలకు క్రేజ్ పెరిగింది. వాహనాలపై తిరిగే వారు ఎండ వేడిమినుంచి ఉపశమనం పొందడానికి వీలుగా టోపీలు కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన రహదారులు వెంబడి చల్లని చెట్ల నీడన టోపీలు విక్రయిస్తున్నారు. పలుర కాల డిజైన్లలో యువతకు అందుబాటు లోకి వచ్చాయి. టోపీ నాణ్యతను బట్టి రూ.50 నుంచి 300 వరకు ధర పలుకుతుంది. చిన్నారులకు ఇబ్బంది లేకుండా ఉండేలా కాటన్ టోపీలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇక యువకులు ఎక్కువగా జీన్స్, కాటన్ టోపీలపై మక్కువ చూపిస్తున్నారు. వాటి నాణ్యత ప్రకారం ధర ఉంటుంది. దుకాణాల్లో ఉండే రకాలు కూడా పుట్పాత్లపై సైతం అందుబాటులో ఉంటున్నాడు.

## ఐరాస హక్కుల ఒప్పందపత్రం అమలుకు నోచుకోవడం లేదు

- 29న వికలాంగుల చట్టాల అమలు - అనుభవాలపై రాష్ట్ర సదస్సు
- ముఖ్య అతిథులుగా రానున్న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ



**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** అంతర్జాతీయ అటిజం అవేరేనెస్ దినోత్సవం సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, వికలాంగుల వాయిస్ మాస పత్రిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల చట్టాల అమలు – అనుభవాలు అనే అంశంపై రాష్ట్ర సదస్సు ఏప్రిల్ 29న నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర సదస్సు పోస్టర్ను చిక్కడపల్లి రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ వికలాంగులు పోరాడి సాధించుకున్న చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. చట్టాల అమలును పర్యవేక్షణ చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టంలో పేర్కొన్న అనేక అంశాలు వికలాంగులకు అందుబాటులోకి రాలేదని, తీవ్రవైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలావెన్స్ ఇవ్వాలనే సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు పట్టించుకోవడం లేదన్నారు. 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ అమల్లోకి వచ్చిన మానసిక వికలాంగులకు భరోసా కల్పించడం లేదన్నారు. మానసిక వికలాంగుల సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని చట్టంలో ఉన్న ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 1999 నేషనల్ ట్రస్టో అటిజం, సెరిబ్రాల్ పాల్సి, బుద్దిమంధ్యత, బహుళవైకల్యం కలిగిన వికలాంగుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్న అమలు కావడం లేదన్నారు. ఐక్యరాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం అమలుకు నోచుకోవడం లేదని అన్నారు.వికలాంగుల చట్టాల అమలుపై జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు వికలాంగులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి శశికళ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన రైతు ఉత్పత్తిదారుల సంఘం



**చిలప్చేడ్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** మండలంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్ పి వో) చిలప్ చేడ్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన నాబార్డు డిడిఎం కృష్ణా తేజ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలప్ చేడ్ మండలంలో నాబార్డ్ ద్వారా ఫైజాబాద్ గౌతాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుంది దాదాపుగా గత మూడు సంవత్సరాల నుండి ధాన్యం కొనుగోలు చేపట్టడానికి నాబార్డు సంస్థ నుండి ఎన్నో ప్రయత్నాలు చేయడం జరిగింది అదృష్టవశాత్తు ఈ సంవత్సరం మా నాబార్డ్ (ఎఫ్ పి వో) సంస్థకు ఫైజాబాద్ గౌతపూర్ గ్రామాలలోని రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చామని ఇక్కడ ఉన్నటువంటి ఇరు గ్రామాల రైతులు సంఘం సభ్యుల సహకారంతో ఎటువంటి అటంకాలు జరగకుండా వరి ధాన్యని కొనుగోలు చేపడతామని ఇందుకు మండలంలోని అధికారుల సూచనలతో ఎఫ్పివో సంఘ సభ్యుల మద్దత్తుతో ధాన్యం కొనుగోలు చేపడతామని డిడిఎం కృష్ణ తేజ అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి డిడిఎం నిఖిల్ రెడ్డి, ఎన్జీవో ప్రేమ్ కుమార్, ఎంపీడీవో ఆనంద్, ఏఈఓ దివ్యశ్రీ, చిలప్ చేడ్ మండల ఎఫ్ పివో అధ్యక్షులు యాసీన్,కార్యదర్శి గోపాల్ రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి సింధుజ నాయకులు అంజి రెడ్డి మాణిక్ రెడ్డి శంకరయ్య మనోహర్ రెడ్డి ఎఫ్ పి వో సంఘం గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ర్యాంక్లతో మెరిసిన రావూస్ కాలేజీ విద్యార్థులు

- ప్రణాళిక బద్ధంగా విద్యార్థులకు బోధించడం వల్లే సాధ్యం
- విద్యార్థుల ర్యాంక్లతో లెక్చరర్ల కృషి ఫలించింది
- కళాశాల ప్రిన్సిపల్ రామ్ కుమార్





**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఇంటర్మీడియట్ ఫలితాలలో తెలంగాణ రాష్ట్ర ర్యాంకులతో సత్తా చాటి వనపర్తికి ఘన కీర్తిని రావుస్ కళాశాల విద్యార్థులు అందించారని, రావూస్ కళాశాల ప్రిన్సిపాల్ ఇ. రాంకుమార్ మేనేజ్మెంట్ సభ్యులు ఏ,శ్రీనివాస్ పి. అమరేందర్ రెడ్డి, బి. రమేష్ రెడ్డి, కె, శ్రీనివాస్ తెలిపారు. సెకండ్ ఇయర్ ఎంపీసీలో సందడి మాధవి 994 మార్కులు, కె. హర్షవర్ధన్ 991, బి. గాయత్రి 990, బైపీసీలో వై.మనీషా 990, సీఈసీలో మూలరాళ్ల రవి 929 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో బి. సంతోష్ నాయుడు 468, ఎం.అక్షయ, రిమసా బేగం 467, ఎం.హాషితాశ్రీ, రాకేశ్ 466 మార్కులు, బైపీసీలో టి. రాధ, కె.దేవిక 435, గోవిందమ్మ434, గీతాంజలి 433 మార్కులు సాధించారని తెలిపారు. సీఈసీలో ఫరూఖ్ ఖాన్ 483, ఎంఈసీలో ఆయేషా బేగం 487 మార్కులు సాధించినట్లు తెలిపారు. కాలేజీ టాపర్లను వారు అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రణాళికబద్ధంగా విద్యను అందించడంతో ఈ ర్యాంకులను సాధించామని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అన్ని చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నామని వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మంచి బోధన అందించడమే లక్ష్యంగా ఈ కళాశాలను స్థాపించామని అందుకు అనుగుణంగానే ప్రతి సంవత్సరం మంచిర్యాంకులతో రాష్ట్రంలోనే గుర్తింపు తెస్తున్నారన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని వనపర్తికి విద్యాపరంగా మంచి గుర్తింపు ఉందని, ఈ ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలోనే విద్యాపర్తిగా పిలువబడే వనపర్తికి విద్యార్థులు మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను కళాశాల లెక్చరర్లు సిబ్బందిని విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

## భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం భూభారతి చట్టం



- కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం భూభారతి చట్టం అమలవుతుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన మునిపల్లి లో భూభారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మాధురి, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు కార్యక్రమాన్ని ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి,తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ పాటతో ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భూభారతి చట్టం సందేశం రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం అంబేద్కర్ ఆశయ సాధన, పేద ప్రజలు తమ భూ సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా భూ భారతి చట్టం అమలు చేస్తుందన్నారు. నూతన భూ చట్టంతో భూ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని రైతులు భూ యజమానులు ఏవైనా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ధరణిలో లేదని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. భూసమస్యల పరిష్కరించేందుకు రైతులు, ప్రజలు, మేధావుల అభిప్రాయాలు, సూచనలతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. రైతులు, భూ యజమానులు భూభారతి చట్టం ద్వారా తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. తమ సమస్యలను హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చన్నారు.రైతులు, భూ యజమానులు, ప్రజలు తమతమ భూసమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ అవగాహన సదస్సులో అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, తహసిల్దార్ గంగాభవాని, ఎంపీడీవో హరి నందన్ రావు, కాంగ్రెస్ మునిపల్లి మండల ఉపాధ్యక్షులు రసూల్ పటేల్ రైతు లు, రైతు సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రైతుల భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం మద్దూరు మండలం జాదవ రావు పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సును ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సుల్లో రైతుల నుంచి వచ్చే సమస్యల వినతులను స్వీకరించాలన్నారు.సదస్సులో గ్రామానికి సంబంధించిన పహాని,పాత, కొత్త ఆర్ ఓ ఆర్ , సేత్వార్ తదితర భూ రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు.సదస్సు కి ఇప్పటి దాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అక్కడి సిబ్బందిని ప్రశ్నించగా 26 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 14 అసైన్డ్ భూముల సమస్యలే ఉన్నాయని, మిగతా వాటిలో కొన్ని విరాసత్, మరికొన్ని పేరు మార్పిడి ల సమస్యలు ఉన్నాయని సిబ్బంది తెలిపారు.సాదా బైనామా లపై దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం ఉన్న ఖాతాలెన్ని అని కలెక్టర్ అడగగా 797 ఖాతాలు ఉన్నాయని డీ.టి. వాసుదేవ రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, సర్వేయర్ అశోక్, రెవెన్యూ అధికారులు కమలాకర్,ప్రకాష్ తదితరులున్నారు.

# భూ భారతి ద్వారా సాదా బైనామా సమస్యలకు పరిష్కారం



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** భూ భారతి ద్వారా సాదా బైనామా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి తెలిపారు.ఈ కొత్త పోర్టల్ తో రైతులకు వారి భూములపై అన్ని రకాల హక్కులు కల్పించబడతాయని వారు పేర్కొన్నారు.భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా బుధవారం నారాయణ పేట నియోజకవర్గంలోని ధన్వాడ, దామర గిద్ద , తహాసిల్దార్ల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డును ఇవ్వడంజరుగుతుందన్నారు. ధరణిలో అధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ధరణిలో సాదా బైనామా ల పరిష్కారానికి ప్రొవిజన్ లేకపోయిందని,కొత్త పోర్టల్ లో వాటికి పరిష్కారం లభిస్తుందని ఆమె తెలిపారు. అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని,అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.జూన్ 2 తర్వాత జిల్లాలోని అన్ని మండలాల్లోని రెవెన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి రైతుల నుంచి సమస్యల దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి మాట్లాడుతూ ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు.భూ భారతిలో తహసిల్దార్ వద్దనే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇవి కూడా ఉచితంగానే పరిష్కారం అవుతాయని, ఎవరు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కింది స్థాయి నిర్ణయాన్ని పై స్థాయిలో అప్పీల్ చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ప్రస్తుతం అందరికి ఆధార్ కార్డులు ఉన్నట్టే ఇకపై ప్రతీ రైతుకు తన భూమికి సంబంధించిన అన్ని వివరాలతో కూడిన భూదార్ కార్డును కూడా అధికారులు ఇస్తారని ఆమె తెలిపారు. జూన్ 2 తర్వాత అధికారులే మీ మీ గ్రామాలకు వచ్చి ఇలాంటి సదస్సులు పెట్టి సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తారని ఆమె చెప్పారు. కొత్త చట్టం గురించి రైతులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఆమె కోరారు.కాగా ఇటీవలే వెలువడిన ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ఫలితాలలో దామరగిద్దకు చెందిన చెన్నారం అక్షయ 470 మార్కులకు గాను 469 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు ను సాధించడం పట్ల కలెక్టర్, ఎమ్మెల్యే ఆ విద్యార్థిని దామర గిద్ద సదస్సులో శాలువాతో సన్మానించి అభినందించారు.ఆయా సదస్సులలో ధన్వాడ సింగిల్ విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, దామరగిద్ద సింగల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, ధన్వాడ, దామరగిద్ద తహాసిల్దార్లు సింధుజ, జమీల్, ఎంపీడీవోలు సుదర్శన్, జయ లక్ష్మీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకం

● అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీనిపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. బుధవారం కే.టీ దొడ్డి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం-2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని,చట్టం అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందిం చిందన్నారు. ఎంతోమందిమేధావులు,అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని,గతంలో జరిగిన కొన్ని చట్టాలు, సర్వేలు, పాస్‌బుక్‌లు, ఆర్.ఓ.ఆర్ చట్టం వంటి చర్యలను గుర్తుచేశారు.ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనున్నదని తెలిపారు.ఈ చట్టాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారు.చట్టం రూపొందించే సమయంలో రైతుల సంక్షేమం కోసం వారి సమస్యలను ప్రస్తావించి, అభిప్రాయాలను చట్టంలో ప్రతిబింబించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గతంలో ధరణి ద్వారా మన జిల్లా టాప్ 5లో ఉండగా,భూ భారతి చట్టంతో ప్రక్రియలు త్వరగా పూర్తి అవుతాయని తెలిపారు.ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ పొందుపరచారని, దీనివల్ల ఏ సమస్యకు ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేయాలో రైతులకు అర్థమయ్యేది కాదని అన్నారు. భూభారతిలో 6 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని వివరించారు.భూ భారతి చట్టంలో తహసిల్దార్ స్థాయి నుండి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే అప్పీల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని, భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు.వార సత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని తెలిపారు.పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ దరఖాస్తులపై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. గడువు తర్వాత ఆటోమేటిక్‌గా మూటేషన్ జరుగుతుందని అన్నారు.మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని,దీని ద్వారా భూ ఆక్రమణలకు అవకాశం ఉండదని అన్నారు .గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తామన్నారు.భూ భారతి చట్టం మొదట రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో పైలెట్‌గా అమలవుతుందని, తరువాత ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో నిర్వహించి, అవసరమైతే మార్పులు చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తారని తెలిపారు. రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు.భూమి హక్కుల రక్షణకు భూ భారతి చట్టం ఉపయోగకరమైందని, రైతులు దీన్ని అర్థం చేసుకుని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు,కేటీ దొడ్డి తాసిల్దార్ హరి కృష్ణ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి

● ఎస్పీ యోగేష్ గౌతం



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** నకిలి విత్తనాలు,నాసిరకం ఎరువులపై అధికారులు ఉక్కు పాదం మోపాలని నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతం అధికారులను ఆదేశించారు.నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులను గుర్తించి సీజ్ చేయాలనీ, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దు అని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు సరఫరా జరగకుండా చూడాలి అని అన్నారు.రాష్ట్రానికి, దేశానికి ముఖ్యమైన ఆధారం వ్యవసాయం అని అలాంటి వ్యవసాయం చేసి, ఆరుగాలం కష్టపడే రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉన్నదని, విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి అని అన్నారు.రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగేలా నకిలీ విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని, పి.డి యాక్ట్ తప్పదని, షీట్స్ నమోదు చేస్తాం అని హెచ్చరించారు. నారాయణపేట జిల్లా కర్ణాటక రాష్ట్రానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నది ఇక్కడ నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉన్నది, ముందస్తు తనిఖీలు, రైతులకు అవగాహన కల్పించడం, డీలర్స్ కు అవగాహన కల్పించడం, సరిహద్దు లలో పటిష్టమైన నిఘా తో నకిలీ విత్తనాలు నివారించాలి అని ఎస్పీ అన్నారు. రైతులతో సమావేశాలు నిర్వహించి చైతన్య పరచాలి,గతంలో నకిలీ విత్తనాల కేసుల్లో సంబంధం ఉన్నవారి పై నిఘా ఉంచాలి అని సంబంధిత అధికారులకు ఆదేశించారు.రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.నాణ్యమైన కంపెనీ విత్తనాలు ఎంచుకోవాలి, లేబుళ్లు, ప్యాకింగ్ లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని కోరినారు,తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లోకి వచ్చే మధ్యవర్తుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దు,ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్స్ నుండి విత్తనాలు కొనుగోలు చేస్తే మంచిదని అన్నారు.ఇతర రాష్ట్రాల నుండి జిల్లాల లనుండి ఎక్కువ మొత్తంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని కోరినారు.నకిలీ విత్తనాల గురించి, అనుమానిత బ్రోకర్లు, డీలర్ల గురించి పోలీసు వారికి డయల్ 100 కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కానీ వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి అని ఎస్పీ కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య

● కలెక్టర్ క్రాంతి వల్లూరి



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కంది, మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో కొత్త గా నిర్మించిన అదనపు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు వెళ్లకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని, వారికి ఏకరూప దుస్తులు పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవీంధర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో హమాలీ కార్మికులు, రైతులకు అవస్థలు



**చేర్యాల, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలో పలు గ్రామాలలో ఐకెపి సెంటర్లలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా కనీస వసతులు తాగునీరు, పనిచేస్తున్న సమయంలో హామాలీలకు ప్రమాదం జరిగినప్పుడు ప్రథమ చికిత్సకు అవసరమైన సామాగ్రి లేకపోవడం, వడ్లు కాంటలు పెట్టి లోడ్ చేసేందుకు లారీల కోసం హామాలి కార్మికులు, రైతులు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికీ కొన్ని గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం విచారకరం. గ్రామాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైనా కొద్దిరోజులే అవుతున్నా లారీలు సరైన సమయంకు రాక వర్షాలు పడుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హామాలీ సంఘం వారు కాంటలు పూర్తిచేసి లారీల కోసం రోజు మొత్తం మార్కెట్లోనే ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ఐకెపి సెంటర్లో పనిచేసే సీఏలు, లారీ సంఘం వారు సమన్వయం చేసుకొని సకాలంలో కొనుగోళ్ళను వేగవంతం చేసి లారీలు వచ్చే విధంగా ఉన్నత అధికారులతో మాట్లాడాలని రైతులు, హామాలీ సంఘం వారు కోరుతున్నారు.

# శరవేగంగా సుంకిశాల ప్రాజెక్ట్ పనులు

● సుంకిశాల ప్రాజెక్టు పనులు పరిశీలించిన జల మండలి ఎండీ



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** నాగార్జున సాగర్ వద్ద నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని జలమండలి ఎండీ. అశోక్ రెడ్డి సందర్శించారు. జలమండలి ఉన్నతాధికారులతో కలిసి ప్రాజెక్టు పనులను ఆయన బుధవారం సందర్శించి పైప్ లైన్ విస్తరణ పనులు.. సుంకిశాల ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు పరిశీలించారు. ప్రాజెక్టు పైపు లైన్ పనుల్ని ఎండీ పరిశీలించారు. పైపు విస్తరణ పనులలో ప్రత్యేక దృష్టి సారించాలని ఏజెన్సీ అధికారులకు సూచించారు. నాణ్యత లో నిర్లక్ష్యం వహించకూడదు అని సూచించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ... ప్రస్తుతం సివిల్, టన్నెల్, ఎలక్ట్రికల్, పైపు లైన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. వీటిలో టన్నెల్, ఎలక్ట్రికల్ పనులు తుది దశకు చేరుకున్నాయని సివిల్ వర్క్స్ ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రిటైనింగ్ వాల్ శిధిలాల తొలగింపు పనులు శరవేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎండీ అశోక్ రెడ్డి సుంకిశాల టన్నెల్ గేట్ రిటైనింగ్ వాల్ ఓ పక్కకు ఒరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. శిథిలాల తొలగింపు పురోగతిని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. సిమెంట్ శిధిలాల తొలగింపు పనులలో వేగం పెంచమని అధికారులను ఆదేశించారు. సాధారణంగా నాగార్జునసాగర్ రిజర్వాయర్ లో డెడ్ స్టోరేజీలో 131 టీఎంసీలు, 510 అడుగుల నీరు ఉన్నంత వరకు వాడుకునే వెసులుబాటు ఉంటుంది. వేసవిలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం సుంకిశాల ఇంటేక్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. నాగార్జున సాగర్ లో జలాలు డెడ్ స్టోరేజికి పడిపోయినా.. ఈ ప్రాజెక్టు ద్వారా నగరానికి తాగునీరు అందించవచ్చు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం మహేష్, జిఎంలు, ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

● డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంటావార్పు



**చేర్యాల, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెడుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని గత కొద్దిరోజులుగా చేర్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట దీక్ష, వంటావార్పు కార్యక్రమం చేస్తున్నా డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ కి బుధవారం జేఏసీ చైర్మెన్ వకుళభరణం నర్సయ్య పంతులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇది వరకు నడుస్తున్న పాత విదానాన్ని కొనసాగించాలని చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ తరుపున నల్ల బ్యాడ్జీలు దరించి రాష్ట్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆదాయం కొరకు ఏవేవో కొత్త స్కీంలు ఎల్.ఆర్.ఎస్ వంటి వాటిని ప్రవేశపెట్టిందన్నారు. ఇంతకు ఎల్.ఆర్.ఎస్. గురించి ప్రభుత్వం వారికే సరైన అవగాహన లేక రిజిస్ట్రేషన్ కొరకు వచ్చే వారు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదేమి లేకున్నా వచ్చే ఆదాయం గంగలో కలిసి పొయినట్టు అయిందన్నారు. స్లాట్ బుకింగ్ విధానం వల్ల కొత్తగా ప్రభుత్వంనకు వచ్చే ఆదాయం ఏమి లేదు. స్లాట్ బుకింగ్ వల్ల రిజిస్ట్రేషన్ దారులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ప్రభుత్వం వారు 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందని అంటున్నారు. కానీ స్లాట్ బుకింగ్ విధానం ప్రారంభం చేసిన రోజునే కొన్ని ఆఫీసులలో గంటల తరబడి ఆగిపోయినవని తెలిపారు. ధరణి దస్తావేజును చూస్తేనే నవ్వు వస్తుంది ఎందుకంటే ఒక్క స్టాంప్ పేపర్ కూడా ఉండదు, స్టాంపు వెండర్ల జీవనోపాధి కూడా ఇబ్బందిగా మారింది. డాక్యుమెంట్ రైటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం లైసెన్స్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇచ్చిన హామీపై మాట నిలబెట్టుకోలేదు. ఇప్పటికైనా సి.ఎం.రేవంత్ రెడ్డి, రెవిన్యూశాఖా, రిజిస్ట్రేషన్, స్టాంప్ ల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రిజిస్ట్రేషన్, స్టాంప్ ల శాఖా కమీషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ లు ఈ విషయంపై సానుకూలంగా స్పందించాలని చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ తరపున డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి చొరవతో నిధులు మంజూరు



**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి గారికి, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారికి, ఇంచార్జ్ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ గారికి, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి గారికి, కృతజ్ఞతలు తెలియజేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిఏదుల, శ్రీరంగాపూర్ నూతన తాసిల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఈ తహసిల్దార్ కార్యాలయాల నిర్మాణంతో ఆయా మండలాల ప్రభుత్వ పాలన వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. శ్రీరంగాపురం మండలంతో పాటు నూతనంగా ఏర్పడిన ఏదుల మండలానికి సైతం తాసిల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరీకి కృషిచేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారికి ఆయా మండలాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గీతంలో సిబ్బంది శ్రేయస్సు కోసం క్రీడా పోటీలు



**పటాన్‌చెరు, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని అధ్యాపకులు, సిబ్బంది మధ్య స్నేహం, శ్రేయస్సును ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న మూడు రోజుల బ్యాడ్మింటన్, క్యారమ్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ తో కలిసి గీతం హైదరాబాద్ మహిళా సెల్ నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలలో బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్ డ్ డబుల్స్, అలాగే క్యారమ్ పురుషుల, మహిళల డబుల్స్ విభాగాలలో పోటీలున్నాయి. ఏప్రిల్ 23న ప్రారంభమైన, 25వ తేదీ వరకు కొనసాగే ఈ పోటీలలో వివిధ విభాగాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటూ, క్రీడా-జట్టు స్ఫూర్తిలను ప్రదర్శిస్తున్నారు. విజేతలను వారి ప్రతిభ, అంకితభావాన్ని గుర్తించేలా ముగింపు వేడుకలో ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరించనున్నారు. ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బందితో సహా పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రైతులకు మేలు జరగడం కోసమే భూ భారతి చట్టం

● భూ లిటిగేషన్ సమస్యలను కూడా భూభారతిలో పరిష్కరించే అవకాశం ఉంది

● మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



**బోడుప్పల్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఎంతోమంది మేధావులు నిపుణులు అనుభవజ్ఞులు లీగల్ ఎక్స్పర్ట్స్ ఎన్నో విధాలుగా ఆలోచించి ప్రజలకు రైతులకు మేలు జరగాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ భూభారతి చట్టాన్ని రూపకల్పన చేయడం జరిగిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం మేడిపల్లి మండలం లోని పిర్జాదిగూడ గ్రామంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ గౌతమ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి పరుస్తూ తెలిసి తెలియక జరిగిన తప్పులను సవరించే ఆప్షన్ ఈ భూభారతిలో ఉందని ఆర్డీవో కు అధికారాలు ఈ చట్టంలో కల్పించడం జరిగిందన్నారు రైతులెవరు ఆందోళన చెందవద్దని వారి సమస్యలను ఈ భూభారతిలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. భూ లిటిగేషన్ సమస్యలను కూడా భూభారతిలో పరిష్కరించే అవకాశం ఉందన్నారు .భూ సరిహద్దులు పారదర్శకంగా జరిగేలా బుధార్ కూడా ఈ భూభారతిలో ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు ఒకే సమయంలో రిజిస్ట్రేషన్ న్యూట్రిషన్ చేసే విధంగా ఆప్షన్ ఉందన్నారు విరాసత్ మెడిటేషన్ చేయాలంటే తప్పకుండా సంబంధికులకు నోటీసులు జారీ చేసి పరిశీలించిన అనంతరం చేస్తామన్నారు ప్రతి సమస్యకు రైతులు అప్పీల్ చేసుకునే అవకాశం ఈ భూభారతి చట్టంలో ఉందని కలెక్టర్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారుల పై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టరు తెలిపారు.

# ఈత సరదా విషాదం కాకూడదు

● జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో ఎంతో మంది పిల్లలు, యువకులు ఎండ వేడి నుంచి సేద తీరటానికి, ఈత నేర్చుకోవడానికి జలాశయాల వద్దకు వెళ్ళడం ద్వారా ప్రమాదాలకు గురయ్యే అవకాశం వుందని కావున ఈత సరదా కుటుంబం లో విషాదం నింపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు జిల్లా ప్రజలకు తెలియజేశారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని, ఈత ను నేర్చుకునే చిన్నారులు,యువతి యువకులు ఈత వచ్చిన వారి తల్లిదండ్రుల సమక్షంలో నేర్చుకోవాలని సూచించారు. ముఖ్య%శీ%గా తల్లిదండ్రులు తమ పిల్లలను జలాశయాల వద్దకు చెరువుల వద్దకు కాలువల వద్దకు కుంటలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, మహిళలు బట్టలు ఉతికే%శీ%దికు చెరువుల దగ్గరకు కుడా ఈత వచ్చిన కుటుంబ సభ్యుల వెంట మాత్రమే వెళ్ళాలనీ తెలిపారు. అలాగే పోలీస్ కళా బృందం ద్వార గ్రామాలలో ఈతకు వెళ్ళే చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ముఖ్యంగా తల్లీ దండ్రులు వేసవి సెలవులలో తమ పిల్లల పై దృష్టి పెట్టాలని సూచించారు.

# బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్ డెసిగ్నేషన్ రద్దు

- జనరల్ అసిస్టెంట్‌గా గౌరవప్రదంగా మార్పు చేసిన కోల్ ఇండియా యాజమాన్యం
- అమలుకు ఆదేశాలు జారీచేసిన సింగరేణి సంస్థ
- వెల్లడించిన యాదగిరి సత్తయ్య అధ్యక్షులు



**ప్రత్యేక ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** స్టాండర్డైజేషన్ కమిటీ 4వ సమావేశం రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్)లో జరిగింది. సమావేశంలో ఏబికె ఎమ్మెస్ (బి ఎమ్మెస్)తరపున సుధీర్ గురుడే, ముజ్రాల్ హక్ అన్సారి, సింగరేణి నుండి యాదగిరి సత్తయ్య పాల్గొన్నారు. సంస్థ ద్వారా ఈ క్రింది అంశాలను చర్చించిన తర్వాత, నిర్ణయం గురించి సవివరమైన సమాచారం క్రింద ఇవ్వబడింది. ఎన్సిడబ్లుఎ-11 ప్రకారం వీలైనంత త్వరగా బేసిక్ ఫిట్‌మెంట్ ట్యాక్స్, బకాయిలు మరియు సవరించిన పెన్షన్ చెల్లింపులకు సంబంధించి రిటైర్డ్ కార్మికుల డిమాండ్‌పై సత్వర చర్య తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చింది. క్యాడర్ స్కీమ్ సిఫార్సుపై ఇంకా తయారు చేయని కేడర్ స్కీమ్‌పై సాంకేతిక ఉపసంఘం కమిటీ సమావేశంలో త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిప్లొమా హెూల్డర్లకు నోషనల్ ప్రాధాన్యత కోసం డిమాండ్ 9 ఆగస్టు 1993 నుండి లేవనెత్తబడింది, యాజమాన్యం అన్ని కంపెనీల నుండి వివరణాత్మక సమాచారాన్ని తీసుకుంటుంది. తదుపరి సమావేశంలో దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్/పిఎల్ఐ చెల్లింపుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పి.ఎల్.ఐ పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ పొందడంపై సంస్థ డిమాండ్‌పై తగిన చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపినారు. బొగ్గు పరిశ్రమ (సింగరేణి)లో పనిచేస్తున్న కార్మికులకు బదిలీ వర్కర్ జనరల్ మజ్దూర్ హెూదాను రద్దు చేస్తూ గౌరవప్రదమైన హెూదా జనరల్ అసిస్టెంట్ కల్పిస్తూ సవరించిన హెూదాను సింగరేణిలో అమలు చేయుటకు చర్యలు తీసుకునే విధంగా చూస్తామని తెలిపినారు, మోటార్ వెహికల్ డ్రైవర్ హెూదాను మోటార్ వెహికల్ ఆపరేటర్ గా గౌరవప్రదం కల్పిస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చర్చ తర్వాత, టిఎస్ గ్రేడ్ సి నుండి టిఎస్ గ్రేడ్ బి కి పదోన్నతి నిరాకరించబడిన సూపర్‌వైజర్‌కు %ఒడా% గ్రేడ్‌కి పదోన్నతి కల్పించడానికి ఒక సారి అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకోబడిందని తెలిపారు. సంస్థను విశ్వాసంలోకి మరియు తీసుకుని వీలైనంత త్వరగా మెడికల్ అటెండెంట్ రూల్ లో అవసరమైన సవరణలు చేయడం గురించి చర్చించి, తక్షణమే చర్యలు తీసుకుంటామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తున్న పన్నెండు వేల రూపాయల (రూ.12,000) సెటిల్లింగ్ అలవెన్స్‌ను రూ.15,000కి పెంచడానికి యాజమాన్యం సిద్ధంగా ఉంది, అయితే దానిని కనీసం రూ.20,000కి పెంచాలని సంస్థ కోరింది తదుపరి సమావేశంలో ఆదేశాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనల ప్రకారం, 7/8 సంవత్సరాలు పూర్తయిన తర్వాత నిర్ణీత తేదీ నుండి ఎస్ఎల్ పి అమలు చేయుటకు చర్యలు తీసుకోవాలని చేసిన డిమాండ్ మేరకు తదుపరి సమావేశంలో నిర్ణయిస్తామని తెలిపారు. 10) సాధారణ కార్మికులందరినీ ఎంపిక చేయడానికి బదులుగా క్యాట్-1 నుండి క్యాట్ 2కి పదోన్నతి కల్పించాలి. 1/1/2017 నుండి చెల్లించాల్సిన గ్రాట్యుటీ మొత్తాన్ని రూ. 20 లక్షలకు పరిమితం చేయాలనే డిమాండ్‌పై, యాజమాన్యం వివరణాత్మక విచారణను నిర్వహించి, తదుపరి సమావేశంలో సమాచారాన్ని తెలియజేస్తుందని తెలిపారు. రూ.10,000 కంటే ఎక్కువ పింఛను పొందే వారిపై ఆధారపడిన తల్లిదండ్రులకు వారి అనారోగ్య చికిత్సకు వైద్య సదుపాయాలు కల్పించాలి, మెడికల్ రిఫరల్ విషయంలో, పెన్షన్‌ను ఆదాయంగా పరిగణించకుండా, వైద్య సదుపాయాలు కల్పించాలి సంస్థ ద్వారా, తదుపరి సమావేశంలో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. నర్సింగ్ డ్రెస్ అలవెన్స్ సంవత్సరానికి 4500/- కి పెంచాలి. తదుపరి సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మైనింగ్‌లో పనిచేస్తున్న అనియంత్రిత సర్టిఫికేట్ కలిగి ఉన్న ఉద్యోగులకు నాన్-ఆఫీసర్ కేడర్ నుండి ఆఫీసర్ కేడర్ వరకు ప్రమోషన్ ప్రయోజనాలను అందించాలనే డిమాండ్‌ను లేవనెత్తడంపై, టెక్నికల్ డైరెక్టర్ కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత తగిన సానుకూల నిర్ణయం త్వరలో తీసుకోబడుతుందని తెలిపారు. మెకానికల్/ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్, క్వాలిటీ కంట్రోల్ ఉన్నవారికి గ్రేడ్ సిలో ప్రమోషన్ యొక్క ప్రయోజనాన్ని ఇవ్వాలని నిర్ణయించబడిందని తెలిపారు. లివర్ సోరియాసిస్ వ్యాధిని ఇతర తీవ్రమైన వ్యాధుల మాదిరిగానే స్పెషల్ లైవ్స్, సిఆర్ ఎమ్మెస్ పథకంలో త్వరలో చేర్చాలని నిర్ణయించారని తెలిపారు. బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులకు కాంట్రాక్ట్ కార్మికులకు కార్పోరేట్ శాలరీ ప్యాకేజీ (సిఎస్పి)పథకం కింద, సింగరేణి మాదిరిగా కోల్ ఇండియా ఉద్యోగులకు రూ. 1 కోటి మరియు కాంట్రాక్ట్ కార్మికులకు ప్రమాదం జరిగితే రూ. 40 లక్షల బీమా ప్రయోజనం అందించాలని చేసిన డిమాండ్ మేరకు అమలు చేస్తామని త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారని యాదగిరి సత్తయ్య, అధ్యక్షులు,సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ స్టాండర్డ్ డైజేషన్ కమిటీ సభ్యులు తెలిపారు.

## పేదింటి విద్యార్థులకు సువర్ణావకాశం

- గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**దేవరకొండ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం కొరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలిపారు. డిగ్రీ ప్రవేశాల కొరకు ఇంటర్ పూర్తి చేసిన 90% ఎస్టి గిరిజన విద్యార్థులకు మొదటి అవకాశం ఉందని తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులకు ఓ ప్రకటనలో వివరాలను తెలియజేస్తూ బీఎ, బీ. కం, బీఎస్సీ-లైఫ్ సైన్స్, బీఎస్సీ, ఫిజికల్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి కోర్సులో 40 మంది విద్యార్థినిలకు చదివేందుకు ప్రభుత్వం అనుమతించిందని వారు తెలిపారు. డిగ్రీ కోర్సులు చదవాలనుకునే మహిళలు ఈ కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చు అన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులచే బోధన, డిజిటల్ తరగతులు, ఆధునిక ప్రయోగశాలలు, సుశీలమైన లైబ్రరీ మా కళాశాలలో ఉన్నాయన్నారు.అడ్మిషన్ కొరకు వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, బోనఫైడ్, ఆధార్ కార్డు, 10 ఫోటోలు రెండు జతల జిరాక్స్ కాపీలు వెంట తీసుకుని రావాలని తెలిపారు. మరింత సమాచారం కొరకు 630014483,7285959948 ఈ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## ఇష్టారీతిన ఫ్లెక్సీలు, హెూర్డింగులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్



**భద్రాచలం, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా అనుమతులు లేకుండా ఎవరైనా ఇష్టారీతిన హెూర్డింగులు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏ.ఎస్.పి విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. ఇటీవల కాలంలో కొందరు రోడ్ల పక్కన, డివైడర్లకు మధ్య ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కడుతున్నారని, ఇలాంటి చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదన్నారు. అంతే కాకుండా వర్షాలు, ఈదురు గాలులు నేపథ్యంలో ఫ్లెక్సీలు, హెూర్డింగ్ లు తెగిపోయి, విరిగి పడిపోయి ప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. కాబట్టి గ్రామ పంచాయతీ అధికారుల అనుమతి తీసుకున్న ప్రకారం వారు కేటాయించిన స్థలాల్లోనే ఫ్లెక్సీలు, హెూర్డింగులు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఇక మీదట ఎవరైనా ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, హెూర్డింగులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలకు, ఇతర ప్రమాదాలకు కారకులయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి పుట్టినరోజు వేడుకల, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్లను అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన, ప్రమాదాలకు కారణమయ్యేలా ఏర్పాటుచేసిన వారిపై ఖచ్చితంగా చర్యలు తప్పవని, అంతేకాకుండా ఆ ఫ్లెక్సీలు, హెూర్డింగులు ప్రింటింగ్ చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు నిరంతరం శ్రమించాలి

- ఇంటర్‌లో గతం కంటే అత్యుత్తమం
- ఫలితాలలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి
- కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు నిరంతరం శ్రమించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో జిల్లా 2024-2025 విద్యాసంవత్సరము నకు గాను ఉత్తమ పలితాలు సాదించడంతో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సి.రమణిని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శాలువా కప్పి సన్మానిస్తూ అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాలలో 6,208 విద్యార్థులకు గాను 3,634 మంది ఉత్తీర్ణత చెంది రాష్ట్రంలో 14 వ స్థానం పొందిందని, అలాగే రెండవ సంవత్సర ఫలితాలలో 5,530 విద్యార్థులకు గాను 3,756 మంది ఉత్తీర్ణత చెంది రాష్ట్రంలో 14 వ స్థానం పొందిందని జిల్లా విద్యాశాఖ అధికారి రమణి కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఫలితాలు గత సంవత్సరము కంటే అత్యుత్తమంగా రావడం అభినందనీయమని అందుకు కృషి చేసిన విద్యాశాఖ అధికారులను పేరుపేరునా అభినందించారు.

## ఎంఎంటీఎస్ రైలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పిస్తా..



**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ఎంఎంటిఎస్ రైలును నడిపేందుకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పిస్తానని, ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్, అరుణ్ కుమార్ జైన్‌కు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి, కూలంకషంగా చర్చించి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుంచి తెలంగాణ తిరుపతి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైలు నడిపేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేసి లక్ష్మి నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటు, నిత్యం విద్యా, ఉద్యోగ, వ్యాపారం, ఇతర ఉపాధి పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారికి, ప్రయాణ సౌకర్యం మెరుగుపడ గలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అనధికార లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు సదవకాశం

- ఎల్ఆర్ఎస్‌తో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని చేజార్చుకోవద్దు
- కలెక్టర్ హనుమంతరావు

**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** అనధికార లే అవుట్ ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాల్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వీరారెడ్డి తో కలిసి కలెక్టర్ ఎల్ఆర్ఎస్ కు సమర్పించిన ఎల్1, ఎల్2, ఎల్3 దరఖాస్తు లపై అవగాహన పరుస్తూ, జిల్లా లోని భూ యజమానులు అందరితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రతి ఒక్కరినీ ఎల్.ఆర్.ఎస్.పై వారికి ఉన్న అవగాహన ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్.ఆర్.ఎస్. యొక్క విశిష్టత వివరించారు.వారి సందేహాలను నివృత్తి పరుస్తూ, ఎల్.ఆర్.ఎస్‌పై నెలకొన్న అపోహలను తొలగింపచేశారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఎల్ ఆర్ ఎస్ రాయితీ గడువు ముగుస్తున్నందున త్వరపడాలన్నారు. గడువు పొడిగించే అవకాశం లేకపోవచ్చునని, మళ్లీ ఇటువంటి అవకాశాలు రావని, భూ యజమానుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో అర్హులైన వారందరు ఎల్ ఆర్ ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మరోసారి గుర్తు చేశారు. ఎల్.ఆర్.ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి సత్వరమే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలియజేసారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్.ఆర్.ఎస్. రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ



చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. అందుచేత అర్హులైన వారందరు ఏప్రిల్ 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ గడువు మార్చి 31తో ముగియగా, ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీ అనగా ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించిందని అన్నారు. రాయితీ వర్తింపునకు ఇదే చివరి అవకాశం అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఎల్.ఆర్.ఎస్. అవగాహన కార్యక్రమంలో జెడ్పి సి.ఈ.ఓ. శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, పంచాయతీ అధికారిణి సునంద, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య ఆణిముత్యాలను అందిస్తున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు

- అభినందించిన ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క



**భద్రాచలం, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే చిట్ట చివరి నియోజకవర్గం ఏజెన్సీ కేంద్రం అయిన భద్రాచలం పట్టణంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక పద్ధతులలో విద్యను అందిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకే కాక తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తూ ఏజెన్సీ ప్రాంతం నుండి విధ్యా ఆణిముత్యాలను అందిస్తున్న లిటిల్‌ఫ్లవర్స్ విద్యాసంస్థలు రాష్ట్రానికే గర్వకరమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల ఎన్‌టిఏ ప్రకటించిన మెయిన్స్ ఫలితాలలో ఓపెన్ కేటగిరి ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించడంతోపాటు ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన సీనియర్ జూనియర్ ఇంటర్ ఫలితాలలో అద్భుత విజయాలను కైవసం చేసుకున్న లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థినీ విద్యార్థులను బట్టి విక్రమార్క తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 993/1000 ఇద్దరు విద్యార్థులు సాధించి రాష్ట్రంలోని సంచలనాన్ని సృష్టించడంతో పాటు 990/1000 కి పైగా ఐదుగురు విద్యార్థులు మార్కులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అగ్రస్థానంలో నిలిచారని, జూనియర్ ఇంటర్లో సైతం ఎంపీసీ విభాగంలో468/470 తోపాటు బైపీసీ విభాగాలలో 438/440 మార్కులు సాధించి రాష్ట్ర మొదటి ర్యాంకులను కైవసం చేసుకోవడంతో పాటు పదిమందికి పైగా 460/470 పై మార్కులు సాధించి చరిత్రను తిరగ రాశారని అభినందించారు. విద్యను వ్యాపార ధోరణిలో చూడకుండా ఏజెన్సీ కేంద్రంలో సాధారణ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తూ లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు రాష్ట్రంలోనే ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకుంటున్నాయని కొనియాడారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధను చూపిస్తూ ఒక ప్రణాళికతో విద్యాబోధన చేస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే భద్రాచలం విద్యార్థులను అగ్రస్థానంలో నిలిపిన సంస్థల యాజమాన్యాన్ని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ ప్రాంతంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, ప్రభుత్వం తలపెట్టిన ఈ మహా కర్తవ్యానికి ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు భట్టి చేతుల మీదుగా జ్ఞాపికలను అందించగా ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేష్ బాబు, మాగంటి సిరి లక్ష్మి, గణితం అధ్యాపకులు ఎండి బషీర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడబిడ్డలతోనే సృష్టి మనుగడ

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలోని మా పాప - మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగం గా ఎస్.కె సుహానా, సమీర్ దంపతులకు 23 మార్చి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి బుధవారం నాడు జిల్లా కలెక్టర్ వెళ్లి పాప తల్లిదండ్రులతో పాటు అత్తా, మామలను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మానవ సృష్టి మనుగడ ఆడబిడ్డలతోనే సాధ్యం అవుతుందని, ఆడబిడ్డ కుటుంబానికి అమ్మగా ఉంటుందని, అన్ని బంధాలకు మాతృప్రేమ పంచేవారని,ఆడబిడ్డ ఇంటికి అదృష్టంగా భావించాలని ఆడపిల్లలు జన్మించిన తల్లిదండ్రులు భారంగా కాకుండా వరంలా భావించాలని అన్నారు. ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప - మా ఇంటి మణిదీపం కార్యక్రమం అని ఆడబిడ్డలను గొప్పస్థానంలో ఎదిగేందుకు ఎవరికి తక్కువకాకుండా పెంచాలని, మనం ఆశించే మార్పు మన ఇంటి నుండే ప్రారంభించాలని, జిల్లాలో ఏ ఇంట్లో ఆడపిల్ల పుట్టినా జిల్లా అధికారులు వెళ్లి తల్లిదండ్రులకు స్వీట్ బాక్స్ ఇచ్చి, మంచి సందేశం అందించాలని, మహాలక్ష్మి ఇంట్లో పుట్టినందుకు శుభాకాంక్షలు తెలిపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, సిపిఓ ఏ. శ్రీనివాస్, మధిర తహసీల్దార్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించాలి

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- భూభారతిపై హన్మాజీపేటలో అవగాహన సదస్సు
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

**వేములవాడ రూరల్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. భూభారతి చట్టంపై అవగాహన సదస్సును వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో బుధవారం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూభారత చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. భూ సమస్యలతో బాధపడే వారంతా చట్టాన్ని సద్వినియం చేసుకొని హక్కులు పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారని వివరించారు. గ్రామ రెవిన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వంలో 20 వేల కోట్ల పై చిలుకు



రూపాయలతో 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కి సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. హన్మాజీపేట్ పేట బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. హన్మాజీపేట్ పేట బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఇబ్బందులు ఎదురైతే తాను, కలెక్టర్ వచ్చి సమస్య పరిష్కారం చేయడం జరిగిందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు అందించిన సన్నపు వడ్లకు బోనస్ చెల్లించడం జరుగుతుంది. తద్వారా రైతులకు ఒక భరోసా కలుగుతుందని విప్ వివరించారు. మన ప్రాంతాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు - భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిందని తెలిపారు. రెండు చట్టాల మధ్య తేడాలను వివరించారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ జియో ట్యాగింగ్ తో పాస్ బుక్కులు జారీ చేస్తారని వివరించారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు, పాసుపుస్తకాలలో భూమి పటం ఉంటుందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ అనంతరం భూధార్ కార్డుల జారీ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏ ఎమ్ సీ చైర్మెన్ రొండి రాజు, వేములవాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు విజయ్ ప్రకాష్ రావు, అబూ బాకర్, వ్యవసాయ అధికారి సాయి కిరణ్ పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతులు తదితరులు ఉన్నారు.


# ఇరగదీసిన మార్కెట్లు..

**80వేల పైన ముగిసిన సెన్సెక్స్**



**ముంబై, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా 7వ రోజు లాభాలతో ముగిశాయి. నిఫ్టీ 24,300 పైన ముగియగా, సెన్సెక్స్ 521 పాయింట్లు పెరిగింది. ఇవాళ ఐటీ స్టాక్స్ లో ర్యాలీ కనిపించింది. రోజంతా దాదాపు పూర్తి వోలటైల్‌తో మార్కెట్లు నడిచాయి. ఉదయం భారీ గ్యాప్ అప్‌తో ఓపెన్ అయిన మార్కెట్లు తర్వాత భారీగా పడ్డం మొదలు పెట్టాయి. మధ్యాహ్నం నుంచి మార్కెట్లు భారీగా కోలుకున్నాయి. ఇవాళ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా, ఆటో స్టాక్స్ ఆధిక్యంలో నిలువడంతో, వరుసగా ఏడవ సెషన్‌లోనూ భారత బెంచ్‌మార్క్ సూచీలు సానుకూల ముగింపునిచ్చాయి. బుధవారం మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 520.90 పాయింట్లు లేదా 0.65 శాతం పెరిగి 80,116.49 వద్ద ఉంది. నిఫ్టీ 161.70 పాయింట్లు లేదా 0.67 శాతం పెరిగి 24,328.95 వద్ద ఉంది. నిఫ్టీ50 ఇండెక్స్ 24,300 పైన ముగిసి 4 నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. అయితే డిసెంబర్ 2024 తర్వాత మొదటిసారిగా బీఎస్ఈ సెన్సెక్స్ 80,000 పైన ముగియడం ఆసక్తికరం.




# ఇంటెల్‌లో లేఆఫ్స్!

- 20 శాతం మంది ఉద్యోగులకు ఉద్వాసన



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, అమెరికాలో మాంద్యం భయాలు, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 100 కంపెనీలు 27 వేల మందికిపైగా ఉద్యోగులపై వేటు వేశాయి. తాజాగా చిప్ తయారీ కంపెనీ ఇంటెల్‌సైతం ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైనట్లు తెలిసింది.

గత మార్చిలో ఇంటెల్ కొత్త సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్న ఇంటెల్, తన ఉద్యోగుల్లో 20 శాతానికి పైగా తొలగించాలని యోచిస్తోంది. ఈ వారంలోనే లేఆఫ్స్‌పై ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. సంస్థలోని అంతర్గత ఉద్యోగులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఎంతమంది ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుందన్నది తెలియరాలేదు. తాజా నివేదికతో సంస్థలోని ఉద్యోగుల్లో లేఆఫ్స్ గుబులు పట్టుకుంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని భయంతో వణికిపోతున్నారు.

# రియల్ ఎస్టేట్‌లో కాసుల పంట

- లగ్జరీ అపార్ట్‌మెంట్లకే కస్టమర్ల ఓటు
- వెయ్యి కోట్లు దాటినా అమ్మకాలు..



**బెంగళూరు, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రియల్ ఎస్టేట్ అమ్మకాలు కొన్ని నగరాలు, ప్రదేశాలను బట్టి మారుతుంటుంది. అయితే ఐటీకి హాట్ ప్లేస్'గా పేరు పొందుతున్న బెంగుళూరులో ఇళ్ల అద్దెలు కాదు లగ్జరీ ఇళ్ల అమ్మకాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి. తాజాగా దీనికి సంబంధించి ఒక వార్త వెలువడింది. అయితే బెంగళూరులోని లగ్జరీ అపార్ట్‌మెంట్ మార్కెట్లో రూ.10 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల అమ్మకాలు మొదటిసారిగా రూ. 1,000 కోట్ల మార్కును దాటింది. గత నాలుగు సంవత్సరాలుగా చూస్తే 42 శాతం అమ్మకాలు కేవలం 2025లోనే జరిగాయి, దీని బట్టి చూస్తే హై-ఎండ్ రెసిడెన్షియల్ హౌసెస్ డిమాండ్ ఎలా ఉందో తెలుస్తోంది. ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాలిటీ అండ్ సీఆర్ఈ మ్యాట్రిక్స్ రిపోర్టులో షేర్ చేసిన డేటా ప్రకారం, 5 వేల నుండి 7 వేల చదరపు అడుగుల మధ్య ఉన్న అపార్ట్‌మెంట్‌లకు డిమాండ్‌లో భారీగా పెరుగుదల కనిపించింది, దీని ద్వారా విశాలమైన, అల్ట్రా-ప్రీమియం లైఫ్ కోసం పెరుగుతున్న డిమాండ్ నొక్కి చెబుతున్నది.

బెంగళూరు లగ్జరీ హౌసింగ్ మార్కెట్ కొత్త క్లబ్లోకి ప్రవేశించింది. ముఖ్యంగా చీఫ్ ఎక్స్పీరియన్స్ ఆఫీసర్స్, స్టార్టప్ ఫౌండర్స్ ఇంకా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు లగ్జరీ లైఫ్ స్టయిల్ కోసం ఇన్వెస్ట్మెంట్ చేసే తెలివైన కొనుగోలుదారులను మనం చూస్తున్నాము అని ఇండియా సోథెబైస్ ఇంటర్నేషనల్ రియాలిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశ్విన్ చద్దా అన్నారు. ఈ కాలంలో బెంగళూరులోని హై-ఎండ్ లగ్జరీ అపార్ట్‌మెంట్ మార్కెట్‌లో హెబ్బల్ అగ్రగామిగా నిలిచింది, మొత్తం అమ్మకాల వాల్యూలో 22 శాతం వాటా ఇక్కడే ఉంది. అలాగే పెరుగుతున్న లగ్జరీ హబ్‌లలో దోమ్లూర్, సుధామ్‌నగర్ అండ్ బోమన్‌హల్లి కూడా ఉన్నాయి.

సీఆర్ఈ మ్యాట్రిక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ సహ వ్యవస్థాపకుడు అభిషేక్ కిరణ్ గుప్తా మాట్లాడుతూ ఇది కేవలం సాధారణ విషయం కాదని అన్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే అల్ట్రా-లగ్జరీ అపార్ట్‌మెంట్‌లలో ఆరు కొత్త మైక్రో మార్కెట్లను తాము చూశామన్నారు. గతంతో పోల్చి చూస్తే భారీ మార్పు, అలాగే మార్కెట్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో ఇది చూపిస్తుంది అని అన్నారు. అయితే బెంగళూరు మౌలిక సదుపాయాలు వేగమైన వృద్ధికి అనుగుణంగా ఉండాల్సిన అవసరం ఉందని అశ్విన్ చద్దా హెచ్చరించారు.

# 10 ఏండ్లలోపు పిల్లలకు సొంతంగా సేవింగ్స్ అకౌంట్, ఎఫ్‌డీ

- బ్యాంకులకు ఆర్బీఐ ఆదేశాలు




**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దేశంలోని అన్ని బ్యాంకులకు ఒక ముఖ్యమైన ఆర్డర్ జారీ చేసింది. దీంతో ఇప్పుడు 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలు సొంతంగా సేవింగ్స్ అకౌంట్ అండ్ ఫిక్స్డ్ డిపాజిట్‌ను ఓపెన్ చేయవచ్చు అలాగే అతను/ఆమె తల్లిదండ్రులు లేదా గార్డియన్ సహాయం లేకుండానే అకౌంట్ స్వయంగా మెయింటేన్ చేయవచ్చు. ఇంతకుముందు పిల్లలకి ఇలాంటి అకౌంట్ తెరవడానికి తల్లిదండ్రులు లేదా చట్టపరమైన సంరక్షకుడు అవసరం, కానీ ఇప్పుడు 10 సంవత్సరాల వయస్సు తర్వాత సొంతంగా బ్యాంకుల్లో అకౌంట్ ఇంకా ఎఫ్డీలు తీసుకోవచ్చు. దీనికి సంబంధించి సోమవారం అన్ని వాణిజ్య బ్యాంకులు అలాగే సహకార బ్యాంకులకు ఒక సర్క్యులర్ జారీ చేయడం ద్వారా ఆర్‌బిఐ ఈ సమాచారాన్ని అందించింది. ఏ వయసు వారైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ద్వారా అకౌంట్ తెరవవచ్చని, కానీ 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉంటే వాళ్లే స్వయంగా అకౌంట్ ఓపెన్ చేయవచ్చని అందులో పేర్కొంది. అంతేకాదు అతను/ఆమె తల్లిని సంరక్షకురాలిగా చేయడం ద్వారా కూడా అకౌంట్ తెరవవచ్చు. కొత్త రూల్ హైలెట్స్ ఇవే: లిపిల్లల వయస్సు 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే అతను/ఆమె సొంతంగా సేవింగ్స్ ఇంకా టర్మ్ డిపాజిట్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు, నిర్వహించవచ్చు. లిఅలాగే పిల్లలు ఎంత డబ్బు జమ చేయాలో, ఎంత వరకు విత్ డ్రా చేసుకోవచ్చో బ్యాంకులు నిర్ణయిస్తాయి. ఇదంతా బ్యాంకు రిస్క్ మేనేజ్‌మెంట్ విధానంపై ఆధారపడి ఉంటుంది.

ఈ మైనర్లకు 18 సంవత్సరాలు నిండిన తరువాత బ్యాంకు మళ్ళీ అతను/ఆమె నుండి కొత్తగా సంతకం అండ్ అకౌంట్ మెయింటెనెన్స్ పద్ధతిని తీసుకుంటుంది.

పిల్లలకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం/డెబిట్ కార్డ్, చెక్ బుక్ వంటి సౌకర్యాలు ఇవ్వాలా వద్దా అనేది బ్యాంకులు సొంతంగా నిర్ణయించుకోవచ్చు.

ఇటువంటి అకౌంట్ నుండి ఎక్కువగా డబ్బు విత్ డ్రా చేసుకోకూడదు అలాగే ఎల్లప్పుడూ కొంత బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేస్తుండాలి. ఇంకా కస్టమర్ కేవైసీ అంటే గుర్తింపు సరిగ్గా ఉందో లేదో చెక్ చేయబడుతుంది ఇంకా ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయబడుతుంది. 1 జూలై 2025 నాటికి ఈ కొత్త నిబంధనల ప్రకారం పాలసీలను సిద్ధం చేసుకోవాలని లేదా ఉన్న నిబంధనలను మార్చాలని ఆర్బీఐ అన్ని బ్యాంకులను కోరింది.

**ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ :** అయితే పిల్లల అకౌంట్లో ఓవర్‌డ్రాఫ్ట్ ఎప్పటికీ అనుమతించకూడదని ఆర్‌బిఐ స్పష్టం చేసిందిబీ అంటే అకౌంట్లో ఎల్లప్పుడూ బ్యాలెన్స్‌లో ఉండాలి, లోన్ తీసుకునే సౌకర్యం కూడా ఉండదు.



# సెయింట్ పీటర్స్ బసిలికాకు పోప్ ఫ్రాన్సిస్ భౌతికకాయం

**రోమ్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** క్యాథలిక్ క్రైస్తవ మతాధిపతి పోప్ ఫ్రాన్సిస్ సోమవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. స్ట్రోక్‌తో పాటు హృద్రోగ సంబంధిత సమస్య వల్ల పోప్ ఫ్రాన్సిస్ ప్రాణాలు విడిచినట్లు వాటికన్ డాక్టర్లు వెల్లడించారు. కాగా, ప్రజల సందర్శనార్థం పోప్ భౌతిక కాయాన్ని సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించారు. మూడు రోజుల పాటు పోప్ పార్థివదేహాన్ని అక్కడే ఉంచి నివాళులర్పించేందుకు ప్రజలకు అవకాశం కల్పించనున్నారు. పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల అంశంపై చర్చించేందుకు మంగళవారం ఉదయం రోమ్‌లో కార్డినల్స్ భేటీ జరిగింది. రోమ్‌లో అందుబాటులో ఉన్న కార్డినల్స్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇందులో పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయానికి సెయింట్ పీటర్స్ బసిలికాకు ఎప్పుడు తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచాలి, అంత్యక్రియలు ఎప్పుడు నిర్వహించాలి అనే విషయాలపై చర్చించారు. పోప్ ఫ్రాన్సిస్ భౌతిక కాయాన్ని బుధవారం సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు పోప్ భౌతికకాయాన్ని వాటికన్ సిటీలోని తన నివాసం నుంచి సెయింట్ పీటర్స్ బసిలికాకు తరలించారు. ఇక శనివారం ఉదయం 10 గంటలకు (ఇటలీ కాలమానం ప్రకారం) పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# కర్నాటక సీఎం, డిప్యూటీ సీఎంకు బెదిరింపు మెయిల్స్

**బెంగళూరు, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

# నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు జడ్జీలు క్షేమం

- వెల్లడించిన కేరళ సీఎం విజయన్



**తిరువనంతపురం, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కశ్మీర్ టూరుకు వెళ్లిన కేరళ ఎమ్మెల్యేలు, జడ్జీలు క్షేమంగా ఉన్నట్లు సీఎం పినరయి విజయన్ వెల్లడించారు. కశ్మీర్‌లో ఉన్నకేరళ పర్యాటకుల్ని సురక్షితంగా స్వరాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కేరళ హైకోర్టు జడ్జీలు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పీజీ అజిత్‌కుమార్, జస్టిస్ గిరీశ్.. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ టూరులో ఉన్నారు. ఆ జడ్జీలు శ్రీనగర్‌లో ఉన్న ఓ హోటల్‌లో క్షేమంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. గురువారం వాళ్లు స్వరాష్ట్రానికి తిరిగి వెళ్లనున్నారు. ఎమ్మెల్యేలు ఎం ముకేశ్, కేపీసీ మజీద్, టీ సిద్దిక్, కే అన్సలన్ కూడా శ్రీనగర్‌లోనే ఉన్నారు. వాళ్లు కూడా క్షేమంగా ఉన్నట్లు కేరళ సీఎం చెప్పారు. కేరళ పర్యాటకుల కోసం నోర్కా గ్లోబల్ కాంటాక్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్లను కూడా రిలీజ్ చేశారు. కేరళలోని కొచ్చికి చెందిన రాంచంద్రన్ అనే వ్యక్తి పెహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. తన కూతురు, మనవళ్లతో కలిసి రాంచంద్రన్ కశ్మీర్ టూరుకు వెళ్లారు. అయితే ఉగ్రదాడి సమయంలో సాయుధులు అతన్ని కాల్చి చంపారు. ప్రస్తుతం కూతురు ఆరతి, ఆమె పిల్లలు అక్కడే ఉన్నారు.

# తాజ్‌మహల్‌ను సందర్శించిన జేడీ వాన్స్ కుటుంబం



**ఆగ్రా, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన ఫ్యామిలీతో కలిసి భారత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి సోమవారం ఉదయం ఢిల్లీలో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా తొలి రోజు ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఇక నిన్న జైపూర్ వెళ్లిన ఉపాధ్యక్షుడి ఫ్యామిలీ.. ఇవాళ ఆగ్రా సందర్శనకు వెళ్లింది. జేడీ వాన్స్ తన భార్య ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి బుధవారం ఉదయం యూపీలోని ఆగ్రాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వాన్స్ ఫ్యామిలీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. అనంతరం భారీ బందోబస్తు మధ్య జేడీ వాన్స్ తన ఫ్యామిలీతో తాజ్ మహల్ సందర్శనకు వెళ్లారు. అక్కడ తాజ్ అందాలను వీక్షించి.. ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# చేతబడి నెపంతో వ్యక్తి హత్య

- 28 మంది అరెస్ట్

**భువనేశ్వర్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో గ్రామస్తులు ఒక వ్యక్తిని కొట్టి చంపారు. అక్కడకు చేరుకున్న పోలీసులపై కూడా వారు దాడి చేశారు. ఒక పోలీస్ అధికారి గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో 28 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశాలోని రాయగడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 55 ఏళ్ల భైరవ్ సాహు చేతబడి చేస్తున్నాడని గ్రామస్తులు అనుమానించారు. సోమవారం అర్ధరాత్రి వేళ అతడిపై దాడి చేశారు. కర్రలతో కొట్టి చంపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామస్తులు వారిపై కూడా దాడి చేశారు. ఈ సందర్భంగా ఒక పోలీస్ అధికారి గాయపడ్డాడు. దీంతో అదనపు పోలీసులను అక్కడ మోహరించారు. మరునాడు ఫోరెన్సిక్ బృందం నేర సంఘటనా ప్రాంతానికి చేరుకున్నది. భైరవ్ సాహు హత్యకు వినియోగించిన కర్రలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి 28 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ వ్యక్తి కుమార్తె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.






# ఇస్తాంబుల్‌లో ఊగిపోయిన భవనాలు

- టర్కీలో భారీ భూకంపం..

**ఇస్తాంబుల్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** టర్కీలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఈ భూకంప తీవ్రత 6.2 గా నమోదైంది. టర్కీ ప్రధాన నగరం ఇస్తాంబుల్‌లో తీవ్ర ప్రకంపనలు వచ్చాయని ఆ దేశ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ తెలిపింది. ఇస్తాంబుల్‌కు నైరుతి దిశలో 40 కిలోమీటర్ల దూరంలో 10 కిలో మీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది.

ప్రస్తుతానికి ఆస్తి, ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదని, ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అక్కడి అధికారులు తెలిపారు. ఈ భూకంపం ధాటికి బల్గేరియా, గ్రీస్, రొమేనియా దేశాల్లోనూ ప్రకంపనలు కనిపించాయని చెప్పారు. కాగా రెండేళ్ల క్రితం వచ్చిన భూకంపాన్ని మరువకముందే తాజాగా మళ్లీ భూమి కంపించడంతో టర్కీ వాసులు వణికిపోతున్నారు.

2023 ఫిబ్రవరిలో టర్కీలో 7.8 తీవ్రతతో భూకంపం వచ్చింది. దాంతో తీవ్రస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఆ విలయంలో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. సిరియాలోనూ ప్రకంపనలు రావడంతో 6 వేల మంది చనిపోయారు. ఇక, ఇటీవల మయన్మార్, థాయ్‌లాండ్‌లో భారీ భూకంపాలు సంభవించాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టాలకు దారితీశాయి.

# సాలూర లిఫ్ట్ కు బుద్దె రాజేశ్వర్ లిఫ్టుగా నామకరణం

## కుటుంబం కంటే ప్రజల కోసమే పనిచేసిన మహనీయుడు

## ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి



బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి )

విలువలతో కూడిన రాజకీయ నాయకుడిగా బుద్దె రాజేశ్వర్ కు పేరు ఉందని, కుటుంబం కంటే ప్రజల కోసమే పనిచేసిన మహనీయుడని ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో సీనియర్ నాయకులు, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన బుద్దె రాజేశ్వర్ స్మారకార్థం ఆయన విగ్రహాన్ని పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ వక్తలు బుద్దె రాజేశ్వర్ చేసిన సేవలను, రాజకీయ అనుభవాలను నెమరు వేసుకున్నారు. అనంతరం పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తన రాజకీయ చరిత్రలో బుద్దె రాజేశ్వర్ లాంటి నాయకుడిని చూడలేదన్నారు. కుటుంబాన్ని పక్కనపెట్టి కేవలం ప్రజల కోసమే పాటుపడడంతో పాటు సాలూరు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతాడని ఆయన అన్నారు. అయితే కుటుంబ సభ్యులు మనోధైర్యం వీడకుండా ముందుకు సాగాలని వారికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సాలూర లిఫ్టుకు బుద్దె రాజేశ్వర్ లిఫ్టుగా ప్రజల ఆమోదం మేరకు నామకరణం ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బుద్దె రాజేశ్వర్ సతీమణి, బోధన్ మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి, మాజీ జడ్పీటీసీ ఇల్తేపు శారద, టిపిసిసి డెలిగేట్ గంగాశంకర్, విగ్రహ దాత ప్రజ్ఞ రాజు, స్థల దాత ఇల్తేపు గంగారం, పిఆర్ టియు మాజీ జిల్లా అధ్యక్షులు ఇల్తేపు శంకర్, డాక్టర్ కౌలయ్య, మందర్న రవి, గోగినేని నరసయ్య, నరేందర్ రెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, చందు పటేల్, ఏసిపి శ్రీనివాస్, పట్టణ సీఐ వెంకటనారాయణ, రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, విలేకరులు వినాయక్ రాజు, బలరామ రాజు, గడ్డం గంగులు, లింబూరి లక్ష్మణ్, మధు, రాజేష్, అఫ్రోజ్, రమేష్, ఉమాకాంత్, రమేష్, బుద్దె సంజయ్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బోధన్ మున్సిపల్ కమిషనర్ కు అండగా ఉద్యోగులు కార్యాలయం ఎదుట నిరసన

## తప్పుడు వార్తలతో అధికారులను ఇబ్బంది పెట్టొద్దు




బోధన్, ఏప్రిల్ 23 ( జనంసాక్షి )

: బోధన్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట నారాయణకు మున్సిపల్ ఉద్యోగులు అండగా నిలిచారు. ఊరు పేరు లేని కొన్ని పత్రికలు, యూ ట్యూబులు మున్సిపల్ కమిషనర్ పై అసత్య ఆరోపణలు చేస్తూ కథనాలు రాయడాన్ని వ్యతిరేకిస్తూ మున్సిపల్ ఉద్యోగులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బోధన్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట నారాయణపై రెండు రోజుల క్రితం వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి, అబద్ధాలపై ఆధారపడి, ఏ విధమైన పరిశోధన లేకుండా ప్రచురించబడ్డాయన్నారు. ఇలాంటి అసత్యమైన కథనాలు ఒక నిజాయితీ గల అధికారిని లక్ష్యంగా చేసుకొని, అతని వ్యక్తిత్వాన్ని, సేవలను కించపరచే చర్యగా భావిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. ఈ మేరకు బోధన్ మున్సిపాలిటీ మేనేజర్, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి బోధన్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేశారు. పత్రికలు, మీడియా సంస్థలు తమ బాధ్యతను గుర్తు పెట్టుకొని, నిర్ధారణలతో కూడిన సమాచారానికే ప్రాధాన్యత ఇవ్వాలని, ఎవరిపైనా నిరూపణలు లేని ఆరోపణలు చేయడం మానవత్వానికి తగదని, ప్రజాస్వామ్య విలువలను నాశనం చేసే చర్య అని అన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలను ప్రచురించిన పత్రికలు, ఎలాంటి అనుమతిలేని యూ ట్యూబ్ లపై ప్రభుత్వము తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛ పేరు మీదుగా బాధ్యతలేని వార్తలు ప్రచురించడం పూర్తిగా అప్రమేయమైన చర్య అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే మాత్రం కఠిన చర్యలు తప్పవని ఉద్యోగులు హెచ్చరించారు.

# అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందాలి

## లబ్ధిదారులకు ఇసుక ఉచితం.. రవాణా ఛార్జీలు చెల్లించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీల వారిగా ఇండ్ల నిర్మాణాల పురోగతి పై ఆరా తీశారు. ఎందుకు లక్ష్యం చేరుకోలేదో వివరాలు అడిగి తెలుసుకొని,త్వరగా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రామ, కమిటీలు గుర్తించిన వారితో పాటుగా ఎవరైనా నిరుపేదలు ఉంటే పూర్తి వివరాలు తీసుకొని ఇండ్లు ఇవ్వాలన్నారు .గ్రామాలు, వార్డుల్లో గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన గృహాలను ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చవద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందన్నారు. రవాణా ఛార్జీలు మాత్రమే లబ్దిదారు చెల్లించాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక అయిన గ్రామాలు,వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో పని చేసి ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో అధికారులు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటించి, అర్హులకు ఇండ్ల నిర్మాణాలపై సూచనలు అందించాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, సర్వే వివరాలు ప్రతి రోజూ సాయంత్రం తమకు పంపించాలని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, పీడీ హౌసింగ్ శంకర్, డీఈలు,ఏఈలు పాల్గొన్నారు.

# మహిళ కూలీల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ



నర్సంపేట, ఏప్రిల్ 23 (జనంసాక్షి)

: వ్యవసాయ రంగంలో ఆరుగాలం కష్టపడి పంట పండించడం కోసం కీలకమైన పాత్ర పోషిస్తూ శ్రమనే నమ్ముకుని అర్ధాకలితో అలమటిస్తూ జీవనం కొనసాగిస్తున్న మహిళా కూలీల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నాయని మహిళ కూలీలరాష్ట్ర కన్వీనర్ గొప్ప ని పద్మ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. మహిళా కూలీల జిల్లా సదస్సు నర్సంపేటలోని స్థానిక కార్యాలయంలో రుద్రారపు లక్ష్మి ఆవ మహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషిస్తూ అనేక రంగాల్లో శ్రమ చేస్తూ అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కుటుంబ పోషణకు సరైన ఆర్థిక వనరులు లేక అనేక అవస్థలు మహిళలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వీరి సమస్యలను గతంలో ఉన్న పాలకవర్గాలు కానీ ఎప్పుడు పరిపాలిస్తున్న కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పూర్తిగా విస్మరించిందని, వారి కుటుంబాలు వారి కుటుంబాల్లోని పిల్లలు సరైన విద్య అంధక వైద్యం లేక ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కార్మిక కుటుంబాలు ఈరోజు వలసలు వెళ్లి బతకాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ప్రతి పనిలో మహిళలు లేకుండా వ్యవసాయ రంగంలో కానీ నిర్మాణ రంగంలో కానీ ప్రతి రంగంలో మహిళల శ్రమ అధికంగా ఉందని దీన్ని గుర్తించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాలకు ఉందని మహిళల శ్రమను విస్మరించి పరిపాలన కొనసాగించినట్లయితే ఈ ప్రభుత్వాలకు మహిళలు తగిన బుద్ధి చెప్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కూలీల జిల్లా నాయకురాలు శారద, వెంకటమ్మ, మౌనిక, మంజుల, కుక్కల కట్టమ్మ, జంగిలి స్వర్ణలత, జక్కుల లచ్చుమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు నమిండ్ల స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బోళ్ళ సాంబయ్య పాల్గొన్నారు.

# పుష్కరాల పనులకు ప్రత్యేక అధికారులు

## క్యాజువల్ గా తీసుకోవద్దు.. సీరియస్ గా తీసుకుని పూర్తి చేయాలి

## దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

## కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనుల పరిశీలన



కాళేశ్వరం, ఏప్రిల్ 23 (జనంసాక్షి)

పుష్కరాల పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, పనులను క్యాజువల్ గా తీసుకోవద్దు అని సీరియస్ గా తీసుకుని పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను, కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఆర్జేసి రామకృష్ణ రావు, విద్యుత్తు శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, డిపిఓ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, దేవాదాయ శాఖ ఈఈ కనక దుర్గా ప్రసాద్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నిర్మల, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, ధార్మిక అడ్వైజర్ గోవింద రాజు, ఇతర జిల్లా అధికారులతో కలసి విఐపి ఘాట్, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు, 100 గదుల సత్రం పనులు పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖల వారిగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పూర్తి చేయుటపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 10 రోజులు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రోజు పనులలో ప్రగతి రావాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల ప్రగతి వివరాలు వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయాలని సూచించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటు మే మొదటి వారం వరకు పూర్తి చేయాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమయం సమీపిస్తున్నదని పనుల్లో వేగం పెంచాలని, రేయింబవళ్లు పనులు జరిగితే తప్ప పనులు పూర్తి కావని, ఆశించిన స్థాయిలో వేగంగా పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మే మొదటి వారం వరకు 7 హారతి ప్లాట్ ఫార్మ్స్ కూడా పూర్తి చేయాలని తెలిపారు. ఘాట్, సరస్వతి విగ్రహం, సత్రం పనులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పనులు పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా నియమించి నిరంతరం పనులను పర్యవేక్షణ చేయు విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 10వ తేదీ వరకు అన్ని పనులు పూర్తి కావాలని, ఇంజినీరింగ్ అధికారులు పనులు పూర్తి చేయుటకు టైం షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కార్యక్రమమని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద శాశ్వత మరుగుదొడ్లు, షవర్స్, భక్తులు బట్టలు మార్చుకునే గదులు 12 వ తేది వరకు ఫుల్ షేప్ లో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భక్తులు నది వరకు వెళ్ళడానికి అనువుగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, వేసవి దృష్ట్యా నదిలోకి భక్తులు వెళ్ళడానికి అనువుగా క్వయర్ మాట్ ఏర్పాటు చేయుటలో అవగాహన లేకుండా ఎందుకు చేస్తున్నారని పీఆర్ ఈ ఈ పై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వి ఐ పి ఘాట్ వద్ద అదనంగా తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టాలని ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ కి సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ తరలించడానికి 4 వాహనాలు సిద్ధంగా ఉంచాలని, గోతిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వేసి పూడ్చాలని సూచించారు. విఐపి ఘాట్ వద్ద లైటింగ్ పనులు 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద 100 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు 125 కెవి జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విఐపి ఘాట్ వద్ద సూచన చేసిన ప్రకారం మొక్కలు నాటాలని మే 10 వరకు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఘాట్ పైన చలువ పందిళ్లు వేయాలని సూచించారు. ఏదేని సమస్య ఉంటే తెలియచేయాలని, చెప్పకుండా మీలోనే దాచుకుంటే సమస్య అలానే ఉండి భక్తులు ఇబ్బందులు పడతారు అని అందుకే సీరియస్ గా తీసుకోవాలని ఆమె సూచించారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చెప్పారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్ (జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ఏనాడు రైతులను పట్టించుకోలేదని, దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని, ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా?

తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పరిహారం చెల్లించండి.. షెడ్డును తొలగించండి బాధితుల ఆందోళన

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 (జనంసాక్షి)



వేములవాడ అర్బన్ మండలం సంకేపల్లి గ్రామ శివారు రుద్రవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. బుధవారం నూతన సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు సంబంధిత శాఖ అధికారులు స్థల పరిశీలన చేశారు. సబ్ స్టేషన్ స్థలం నిర్మాణం కోసం సర్వే నంబర్ 383,384 లో ఉన్న నాంపల్లి రాజయ్య కు చెందిన షెడ్ ను తొలగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రాజయ్య కుటుంబ సభ్యులు షెడ్ వద్దకు చేరుకొని షెడ్డు కూల్చివేతను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు గంటల స్థలంలో షెడ్డు నిర్మాణం చేసుకున్నామని షెడ్ కు సంబంధించి మాకు ప్రభుత్వం నుండి ఎలాంటి నష్టపరిహారం అందలేదన్నారు. మాకు రావాల్సిన నష్ట పరిహారం చెల్లించిన తర్వాత షెడ్ ను తొలగించాలని కోరారు. నష్టపరిహారం చెల్లించకుంటే మాకు చావే శరణ్యం అని ఆవేదన వ్యక్తం చేశారు.

# సీఎం జపాన్ పర్యటనతో నిరుద్యోగ యువతకు వరం

## టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్



హైదరాబాద్ (జనంసాక్షి)

జపాన్ పర్యటన రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనతో నిరుద్యోగ యువతకు 35000 వేల ఉద్యోగాలకు లభించేలా ముఖ్యమంత్రి కృషి చేయడం చారిత్రాత్మకమైన పర్యటన అన్నారు. 17 నెలల నుండి కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల భవిషత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వం. ఒక వైపు ప్రభుత్వ రంగంలో ఒక్క ఏడాదిలోనే 60,000 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ జరిగింది. 20 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం. నిరుద్యోగ యువతకు పరిణామమన్నారు. జపాన్ దేశంతో 12 వేల కోట్ల అభివృద్ధి తో తెలంగాణ యువత కు 30,500 ఉద్యోగాలకు అవకాశం రావడాన్ని స్వాగతిస్తూమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు విదేశి పర్యటనలు తెలంగాణ యువతకు నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కోసం అన్నారు. హైదరాబాద్ ఎకో టౌన్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మూసి ప్రక్షాళనతో పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధి తో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అతిపెద్ద అభివృద్ధి రాష్టంగా మారుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఓటమిని యువత, రైతులు, కోరుకున్నారని అన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెట్టుబడుల కోసం ఇతర దేశాల నుండి పెట్టుబడుల కోసం పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ పది ఏళ్ళు అధికారంలో అవినీతి సొమ్ము తోనే 500 కోట్లు పెట్టి అంగు ఆర్భాటల పేరుతో వేడుకలు చేసుకుంటుదని అన్నారు. తెలంగాణ యువతకు ప్రవేట్ రంగంలో లక్షలాది ఉద్యోగాల కోసం ప్రభుత్వం తపన అన్నారు.

# మోడల్ సోలార్ గ్రామం ఎంపికకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 23 (జనం సాక్షి)

పీఎం సూర్యగర్ పథకంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ ఎంపిక కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్, చైర్మన్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ సమావేశంలో జిల్లాలోని 5000 పైగా జనాభా కలిగిన 19 గ్రామాలను 2011 జనాభా లెక్కల ప్రతిపదికన పి ఎం సూర్యనగర్ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలకు తదుపరి కాంపిటీషన్ 6 నెలలు తర్వాత మోడల్ సోలార్ విలేజ్ 19 గ్రామాల నుండి ఒక మోడల్ సోలార్ విలేజ్ ను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. తర్వాత కేంద్ర నిధులతో ఎంపిక చేయబడ్డ గ్రామంలో ప్రభుత్వ భవనాలకు, స్ట్రీట్ లైట్లకు వాటర్ పంప్ సెట్స్ లకు మొదలగు వాటికి సోలార్ సిస్టంలను ఏర్పాటు చేయడం జరుగుతుందనీ అన్నారు. ఈ సమావేశంలో వి. విక్టర్ అడిషనల్ కలెక్టర్బాదావత్ చందర్, సీఈఓ జిల్లా పరిషత్, కామారెడ్డి.బి రవి కాంత్ కామారెడ్డి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్,ఎన్. శ్రావణ్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్సీ, ఈ. రమణ, జిల్లా మేనేజర్, టిజి రెడ్కో , నిజామాబాద్, కే. మురళి, డిస్టిక్ పంచాయతీ అధికారి, పాల్గొన్నారు.

### ఇది ఏ రకమైన యుద్ధం.. మతం పేరుతో

## అమాయకులను చంపడం దారుణం..!



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలోని బైసరన్‌లోయలో జరిగిన ఉగ్రదాడిని యావత్ ప్రపంచం ఖండిస్తోంది. పర్యాటకులను పొట్టన బెట్టుకున్న ముష్కరులను వదిలేయొద్దని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఈ క్రమంలోనే భారత క్రికెటర్లు పలు వురు ఇప్పటికే ఎక్స్ వేదికగా పహల్గామ్ దాడిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ పోస్ట్‌లు పెట్టారు. పేసర్ మహ్మద్ సిరాజ్ సైతం తన ఆవేదనను పంచుకున్నాడు. ఇది అసలు ఏరకమైన యుద్ధం. మను షుల ప్రాణాలకు విలువన్నదే లేకుండా పోయింది అంటూ స్పీడ్‌స్టర్ తన ఎక్స్ పోస్ట్‌లోరాసు కొచ్చాడు. 'పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన భయంకరమైన దాడి గురించి తెలిసి షాకయ్యాను. మతం పేరుతో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం, అనేది హేయమైనచర్య. ఇలాంటి క్రూరమైన చర్యలను ఏ సిద్ధాంత మూ అంగీకరించదు. ఇది ఏ రకమైన యుద్ధం. మనుషుల ప్రాణాలకు ఎలాంటి విలువలేకుం డా పోతోంది. పహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల్లో నిండిన విషాదం.. వాళ్లు పడుతున్న బాధను నేను ఊహిం చలేకపోతున్నాను' అని సిరాజ్ తన ఆక్రోషాన్ని, ఆవేద నను వెల్లగక్కాడు.

## పెహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన విరాట్ కోహ్లీ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** పెహల్గామ్ ఘటనను ఖండిస్తూ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాలో ఓ పోస్టు చేశాడు. బాధిత కుటుంబస భ్యులకు ఆయన సంతాపం తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. పెహల్గామ్ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. భారత క్రికెటర్లు కేఎల్ రాహుల్, శుభమన్ గిల్ కూడా స్పందించారు. పెహల్గామ్ దాడి గురించి వింటే గుండె తరుక్కుపోతోందని, బాధిత కుటుంబాల పట్ల సానుభూతి ప్రకటిస్తున్నామని, ఈ దేశంలో ఇలాంటి హింసకు చోటు లేదు అని శుభమన్ గిల్ తన పోస్టులో పేర్కొన్నాడు. కశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తున్నానని, బాధిత కుటుంబాలు తేరుకోవాలని ఆశిస్తున్నట్లు రాహుల్ తెలిపాడు. స్పృహ లేని హింసకు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, బాధిత కుటుంబ సభ్యుల తరపున ప్రార్థిస్తున్నట్లు అనిల్ కుంబ్లే తెలిపారు.

## ఐపీఎల్‌లో తొలి ప్లేయర్ అతడే



**ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ ఐపీఎల్ 18వ సీజ న్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. కుదురుకున్నాడంటే చాలు పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడుతూ ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు గుర్రంగా మారాడు. ఈ ఎడిష న్‌లో మూడు అర్ధ శతకాలతో మెరిసిన రాహుల్ మరో మైలురాయికి చేరుకున్నాడు. ఐపీ ఎల్‌లో అత్యంత వేగంగా 5,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా రికార్డు నెల కొల్పాడు. దాంతో, మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ పేరిట ఉన్న రికార్డు తుడిచిపెట్టుకు పోయింది. ఏప్రిల్ 22 సోమవారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాహుల్ రెచ్చిపోయాడు. ఛేదనలో కళాత్మక ఇన్నింగ్స్ ఆడిన రాహుల్(57 నాటౌట్) హాఫ్ సెంచరీతో కదం తొక్కాడు. తద్వారా ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 5 వేల క్లబ్‌లో చేరాడు. ఈ డాషింగ్ బ్యాటర్ 130వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సొంతం చేసుకోగా.. వార్నర్ 130 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు.

## మూడేళ్ల తర్వాత తొలి విజయం

- టెస్టు క్రికెట్‌లో మరో సంచలనం



**ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఆతిథ్య బంగ్లాదేశ్‌కు జింబాబ్వే జట్టు పెద్ద షాకిచ్చింది. మూడేళ్ల తర్వాత బంగ్లాపై సుదీర్ఘ ఫార్మాట్‌లో జయభేరి మోగించింది. తొలి టెస్టులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57,54) హాఫ్ సెంచరీలతో అదరగొట్టగా.. పేసర్ బ్లెస్సి ంగ్ ముజరబని 9 వికెట్లతో రాణించాడు. 147 పరుగుల ఛేదనలో బంగ్లా 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తన పేస్‌తో బంగ్లా నడ్డివిరిచిన ముజరబని 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. స్వదేశంలో పెద్ద జట్లను సైతం మట్టికరిపించే బంగ్లాదేశ్‌కు చుక్కెదురైంది. జింబాబ్వే చేతిలో భారీ ఓటమి మూటగట్టుకుంది. ఎడమ చేతివాటం పేసర్ బ్లెస్సింగ్ ముజరబని విజృంభణతో రెండు ఇన్నింగ్స్‌లోనూ బంగ్లా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్(50), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(40)ల పోరాటంతో బంగ్లాదేశ్ 191కే ఆలౌటయ్యింది.

# జాతీయ పారాస్పోర్ట్స్ టాలెంట్ హంట్

- ట్రైనింగ్ క్యాంప్ ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** నవోదయ విద్యాలయ సమితి (ఎన్వీఎస్)కు చెందిన జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్వీ), ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని జేఎన్వీ రంగారెడ్డి క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన పారా అథ్లెట్ల జాతీయ టాలెంట్ హంట్, ట్రైనింగ్ క్యాంప్‌ను ముఖ్య అతిథి ఏఎంఎఫ్ ట్రస్టీ, మిసెస్ ఇండియా, ఫ్యాషన్ డిజైనర్, హోలిస్టిక్ లైఫ్ స్టైల్ ఇన్‌ఫ్లు వెన్సర్ శిల్పా రెడ్డి ఈరోజు ప్రారంభించారు. ఈ క్యాంప్ ఈనెల 28వ తేదీ వరకు జరగనుంది. ఈ శిబిరం పారాలింపిక్స్ 2028, కామన్వెల్త్ గేమ్స్ 2026, ఆసియా గేమ్స్ 2026 లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా శిల్పా రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య మెహతా ఫౌండేషన్‌తో గత పన్నెండేళ్ల నుంచి అనుబంధం ఉందన్నారు. నవోదయ విద్యాలయ సమితితో ఈ శిబిరాన్ని ఎంతో దూరదృష్టితో నిర్వహిస్తున్నామన్నారు. యువ ప్రతిభావంతులైన అథ్లెట్లకు అత్యుత్తమ అనుభవం కల్పించడమే లక్ష్యమన్నారు. ఏడాదికి ఏడాది ఈ ప్రోగ్రాం విస్తరిస్తూ ఉందన్నారు. ప్రతి ఏడాది కొత్త చాంపియన్లు వెలుగులోకి వస్తున్నారని చెప్పారు. ఒకవేళ ఎంపిక కాకపోయినా.. ప్రతి విద్యార్థి ఒక మంచి జ్ఞాపకంతో వెళ్తున్నారని చెప్పారు. పరిమితులు ఉన్నప్పటికి సాధ్యమైనంత వరకు ఎక్కువ మందిని ఎంపిక చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మా దృష్టిలో ప్రతి ఒక్కరూ చాంపియన్లే అన్నారు. క్రీడలపై ఉన్న నిబద్ధతను చూస్తే ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇంతవరకు జరిగిన ప్రయాణం పట్ల గర్విస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పది వేల మంది పైగా పారా అథ్లెట్లు స్క్రీనింగ్, శిక్షణ, కౌన్సెలింగ్ పొందారన్నారు. కేవలం నవోదయ విద్యాలయాల నుంచే 3,500 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ ప్రోగ్రామ్లో స్క్రీనింగ్, కౌన్సెలింగ్, శిక్షణ పొందారని చెప్పారు. మా ఆదిత్య మెహతా ఫౌండేషన్ అథ్లెట్లు విదేశాల్లో కూడా 300 పైగా అంతర్జాతీయ పతకాలు గెలుచుకు న్నారని తెలిపారు. ఈ ఏడాది మనకు యూత్ ఆసియన్ గేమ్స్ 2025, ఆ తర్వా త ఆసియన్ గేమ్స్ 2026 ఉన్నా యన్నారు. ఇవి 2028 పారాలింపిక్స్ కోసం అథ్లెట్ల ఎంపిక ప్రక్రియలో కీల కమైన దశలు అన్నారు. పారాలి ంపిక్స్ 2028లో భారత్ ప్రాతినిధ్యం వహించేలా ఎక్కువ మంది అథ్లెట్లకు శిక్షణ ఇవ్వడం మాలక్ష్యమన్నారు. ఈ సందర్భంగా గౌరవ అతిథిఎన్వీ ఎస్ఆర్ఓ డిప్యూటీ కమిషనర్ టీ గోపాలకృష్ణ మాట్లాడు తూ ఇది తొమ్మి దవ టాలెంట్ హం ట్ ప్రోగ్రాం అన్నారు. నాలు గేళ్ళుగా ఈ ప్రోగ్రాంలో భాగం కావడం గర్వం గా ఉందన్నారు. ఒక ఆలో చనగా ఈ ప్రోగ్రాం మొదలైం దన్నారు. ఈ పిల్లల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం, సమానత్వాన్ని పెంపొం దించాలన్న దృష్టి తో ప్రారంభించబడి ందని చెప్పారు. ఈ పిల్లలకు ఒక ఏడాది ఆ పైన శిక్షణ ఇవ్వగలిగితే, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణిస్తారని ఆదిత్య మెహతా చెప్పార న్నారు. అది ఇప్పుడు వాస్తవం అయిందన్నారు. జవహర్ నవోదయ విద్యాల య రంగారెడ్డి క్యాంపస్‌లో వందలాది మంది పిల్లలకు శిక్షణ ఇచ్చా మన్నారు. ఈ క్యాంపస్ పారా అథ్లెట్ల శిక్షణకు గుండెకాయలా భావి స్తున్నామని చెప్పారు. ఇది పారా స్పోర్ట్స్‌కి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నిలిచిందని తెలిపారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్, నవోదయ విద్యా లయ సమితి వందలాది మంది పారా అథ్లెట్లను ఒకే వేదికపైకి తీసు కురావడమే కాకుండా.. దేశవ్యాప్తంగాపారా అథ్లెట్లకు ఆశా కిరణ ంగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది 142 పతకాలు ఎన్వీఎ స్ విద్యార్థులు గెలిచారన్నారు. ఇది ఆదిత్య మెహతా ఫౌండే షన్ మద్దతుతో సాధ్యమైందన్నారు. 2028 పారాలింపిక్స్‌లో భారత్ తరపున గుర్తింపు పొందడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆది త్య మెహతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆదిత్య మెహతా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రత్యేక అవ సరాలు, ఇతర వైకల్యాలు ఉన్న వారిని గుర్తించడం ఈ క్యాంప్ ఉద్దేశం అన్నారు. ఈ క్యాం ప్‌లో గుర్తించిన వారికి నిపుణులైన కోచ్‌ల ద్వారా పారా స్పోర్ట్స్‌లో శిక్షణ కలదన్నా రు. ఈ శిక్షణా శిబిరంలో క్రీడలలో ఉన్న ప్రతిభను గుర్తిం చడానికి పరీక్షలు కలవన్నారు. ప్రాథమిక శిక్షణ ఉంటుం దన్నారు. దేశ, విదేశాలలో ఎంతో ప్రసిద్ధి చెందిన పారా అథ్లెట్లు వీళ్లతో మాట్లాడుతారన్నారు. వాళ్ల అనుభవాలు పంచుకుంటారని చెప్పారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా కౌన్సిలింగ్ సెషన్లు ఉంటాయన్నారు.



## పంత్ కు అన్యాయం జరిగింది..



**న్యూఢిల్లీ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** పంత్ బ్యాటింగ్ ఆర్డర్ పై టీమిండియా దిగ్గజ స్పిన్ బౌలర్ అనీల్ కుంబ్లే ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చ నీయంశంగా మారుతుంది. కుంబ్లే మాట్లాడుతూ.. "పంత్ బ్యాటింగ్‌కు రావడం చాలా ఆలస్యం అయింది. రిషబ్ నిరాశకు గురైనట్టు తెలుస్తుంది. అతనికి అన్యాయం జరిగిందని స్పష్టంగా తెలుస్తుంది. ఏకనా క్రికెట్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ ఏడో స్థానంలో బ్యాటింగ్ కు రావడం ఆశ్చరానికి గురి చేసింది. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సిన పంత్ ఏకంగా ఏడో స్థానంలో వచ్చి విమర్శల పాలవుతున్నారు. డగౌట్ లో ప్యాడ్ లు కట్టుకొని నిలుచున్నా.. వికెట్ పడుతుంటే తాను రాకుండా వేరే బ్యాటర్‌ను పంపించాడు. నాలుగో స్థానంలో సమద్.. ఐదో స్థానంలో మిల్లర్, ఆరో స్థానంలో బదోనిని పంపించాడు. చివరి ఓవర్లో ఏడో స్థానంలో బ్యాటింగ్ కు వచ్చి డకౌటయ్యాడు. పంత్ ఏడో స్థానంలో రావ డం పట్ల సర్వత్రాఅతను నాకు తెలిసి బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు రావాలను కున్నాడు. ఇది అతని నిర్ణయమా? లేదా కోచ్ జస్టిన్ లాంగర్ తీసుకున్నదా? లేదా గురువు జహీర్ ఖాన్ తీసుకు న్న నిర్ణయమా? ఎందుకంటే పంత్ చాలా నిరాశకు గురైనట్లు కనిపించాడు." అని స్టార్ స్పోర్ట్స్ మ్యాచ్ తర్వాత జరిగిన కుంబ్లే అన్నారు. ఐపీఎల్ మెగా ఆక్షన్‌లో రూ.27 కోట్ల రికార్డ్ ధరకు లక్నో తీసుకుంటే ఘోరంగా బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమ వుతున్నాడు. ఇప్పటివరకు కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే నమోదు చేశాడు. చూస్తు ంటే పంత్ తన మీద తనకు కాన్ఫి డెంట్ పోయిం దేమో అనే అనుమానం కలగక మానదు. తీవ్ర ఒత్తిడిలో ఉన్న పంత్ ఇకనైనా గాడిలో పడకపోతే విమర్శలు మూటగట్టుకో వాల్సిందే. తీవ్ర ఒత్తిడిలో ఉన్న పంత్ ఇకనైనా గాడిలో పడకపోతే విమర్శలు మూటగట్టుకోవాల్సిందే. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మంగళవారం లక్నో సూపర్ జయింట్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ 8 వికెట్ల తేడాతో ఈజీ విక్టరీ కొట్టింది. ఏకనా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఛేజింగ్ లో అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 51:5 ఫోర్లు,సిక్సర్) కేఎల్ రాహుల్ (57) హాఫ్ సెంచరీలు చేసి జట్టుకు విజయాన్ని అందించారు.

## ఫిడే మహిళల గ్రాండ్ చెస్ టోర్నీ విజేతగా కోనేరు హంపి



ఇంటర్నెట్ డెస్క్: ఫిడె మహిళల గ్రాండ్ ప్రి చెస్ టోర్నీ విజేతగా తెలుగుతేజం, గ్రాండ్మాస్టర్ కోనేరు హంపి నిలిచింది. పుణె వేదికగా నిర్వహించిన ఈ చెస్ టోర్నీలో తుదిపోరు సమయానికి జు జినర్ (చైనా)తో కలిసి ఆమె అగ్రస్థానంలో కొన సాగింది. ఫైనల్ రౌండ్లో కోనేరు హంపి బల్గేరి యాకు చెందిన నుర్గ్యుల్ సలిమోవాపై 1-0 తేడాతో విజయం సాధించింది. మరోవైపు, జు జినర్ సైతం రష్యాకు చెందిన పొలినా షువలోవాపై గెలుపొందింది. దీంతో ఇద్దరూ మొదటి స్థానంతో ముగించినట్లయ్యింది. అయితే అత్యుత్తమ టై-బ్రేక్ ఆధారంగా హంపి టైటిల్ విజేతగా నిలిచింది. మరో తెలుగమ్మాయి ద్రోణవల్లి హారి క. ముంగంతూల్ బతుయాగ్ (మంగోలియా)తో బీ వైశాలి.. సలోమ్ మెలియా (జార్జియా)తో దివ్య దేశముఖ్.. ఎలీనా కష్లిన్స్కాయా (రష్యా)తో తమ గేమ్లను డ్రాగా ముగించారు.

## ఫిక్సింగ్ ఆరోపణలపై .. ప్రభుత్వానికి ఫిర్యాదు



ఐపీఎల్ 18వ సీజన్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ భూతం కలకలం రేపుతోంది. వరుసగా రెండుసార్లు గెలవాల్సిన మ్యాచుల్లో ఓడిన రాజస్థాన్ రాయల్స్ ఫిక్సింగ్‌కు పాల్పడిందనే ప్రచారం ఊపం దుకుంది. ఈ నేపథ్యలో ఫ్రాంచైజీ బుధవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. తమజట్టు, ఫ్రాంచైజీ పేరును దెబ్బతీయడానికే రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ జైదీప్ బిహానీ అసత్య కథనాలు వ్యాప్తి చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. జైదీప్‌పై సత్వరమే చర్యలు తీసుకోవాలని సంజూ సేన ప్రభుత్వానికి విన్నవించింది. అసలేం జరిగిందంటే.. పద్దెనిమిదో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన 32వ మ్యాచ్‌లో రాజస్థాన్ చేజేతులా ఓడింది. 188 పరుగుల ఛేదనలో ఓపెనర్ యశస్వీఅర్ధ శతకంతో మెరిసినా. మ్యాచ్‌ను సూపర్ ఓవర్ వరకూ తీసుకెళ్లింది. ఆ తర్వాత లక్నోసూపర్ జెయింట్స్‌తోనూ అంతే. అవేశ్ ఖాన్ వేసిన ఆఖరి ఓవర్లో విజయానికి 8 పరుగులు అవసరం కాగా వరుసగా వికెట్లు కోల్పోయి. 2 రన్స్ తేడాతో ఓటమి పాలైంది. దాంతో, రాజస్థాన్ ఆటగాళ్లు ఫిక్సింగ్‌కు పాల్పడ్డారని రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ జైదీప్ ఆరోపించాడు.

# ప్రతిదీ రాజకీయం కాదు..అభివృద్ధి చెయ్యు

- సోషల్ మీడియా కే పరిమితమైన ఆర్మూర్ ఎమ్మెల్యే
- గెలిచిన నాటి నుండి ఆర్మూర్ నియోజకవర్గాన్ని కన్నెత్తి చూడలే
- సోయిలేని మాటలు మానుకో అంటూ హెచ్చరించిన వినయ్ రెడ్డి



**ఆర్మూర్ ఏప్రిల్ 23 (జనంసాక్షి) :**ప్రోటోకాల్‌కి పరిమితమైన ఎమ్మెల్యే ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక సోయి లేని మాటలు మాట్లాడుతున్నాడని ఆర్మూర్ కాంగ్రెస్ నియోజ కవర్గ ఇన్చార్జి వినయ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పివిఆర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వినయ్ రెడ్డి మాట్లాడుతూ 15 నెలల కాలం నుండి కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలతో తత్సంబంధాలతో ముందుకు వెళ్తూ, ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు తోడ్పా టును అందిస్తున్నానని చెప్పారు. గడిచిన 10 ఏండ్లు జీవన్ రెడ్డి ఆగడాలకు ప్రజలు భయ ఆందోళనకు గురయ్యారని అన్నారు. సోషల్ మీడియాలో మాత్రమే కనిపించే రాకేష్ రెడ్డి బోగస్ కంపెనీ అని ప్రజలు ఇప్పటికే తేల్చారు. పేద ప్రజలను, కుల సంఘాలను ఇంటి గేటు లోపలికి రానివ్వవనే పేరు సార్థకమైందని అన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలోనే ఆలోచించడం కాదని దమ్ముంటే ఎంపీ అరవింద్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో వాదించి కేంద్ర ప్రభుత్వ నిధులు తేవాలని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటల ప్రకారం ఒక్క రూపాయికే వైద్యం, గ్రామానికి 10 ఇండ్లు ఏమ య్యాయని ప్రశ్నించారు గతంలో నియోజకవర్గం లోని వెల్మల్ గ్రా మాన్ని దత్తత తీసుకున్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక కోటి నిధులు వెచ్చించారన్నారు. 15 నెలల కాలంలో ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన సుమారు 50లక్షలు నిధులు పైనే తెచ్చానన్నారు. అంకాపూర్ విడీసీ సభ్యులు ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్‌ను తమ గ్రామానికే తెచ్చే విధంగా చేయాలని నాదృష్టికి తీసుకువచ్చారన్నా రు. నిజామాబాద్ జిల్లాకు అమలైన నవోదయ స్కూల్ అంకాపూర్ కువచ్చేలా ఎంపీ అరవింద్,ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేయాలని ఆర్మూర్ నియోజకవర్గంలో గెలిచిన నాటి నుండి నియోజకవర్గాన్ని కన్నెత్తి చూడలేదని, బోగస్ సోయలేని మాటలు మాట్లాడొద్దని, ఆర్మూర్ అభివృద్ధిలోనీ వంతు పాత్రపోషిం చాలని హెచ్చరించారు.

**నిధులు తెచ్చింది నేనే..**

గత ప్రభుత్వంలో రద్దయిన ఆర్మూర్ పట్టణానికి చెందిన 50 కోట్ల 82 లక్షల టియుఎఫ్ఐడిసి నిధులు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,మాజీ మంత్రి,బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డితో పలుమార్లు విన్నవించగా నిధులు మంజూరు చేశారన్నారు.గత సంవత్సరం నవంబర్ నెలలో లిఖితపూర్వకంగా దృష్టికి తీసుకురాగా,ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం సబబు కాదన్నారు.

జీవో కాపీలను సైతం చూపిస్తూ వన్ టైం ఎమ్మెల్యే అంటూ ఉద్ఘాటించారు.రానున్న రోజులలో గ్రామ గ్రామాన ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ప్రజలే నిరసన కార్యక్రమాలు చేపడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయి బాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోత్కూరీ లింగాగౌడ్, తాజా మాజీ కౌన్సిలర్ కొంతంమురళి, శ్యామ్‌గౌడ్, కాంగ్రెస్‌సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## నిమ్స్ ఆసుపత్రిలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు



- నిమ్స్ అభివృద్ధికి నావంతు కృషి చేస్తా
- వేంచారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు భార్గవ్ రెడ్డి

**ఖైరతాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** పేదల ఆస్పత్రిగా పేరుగాంచిన పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందు తున్నాయని, ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని వేంచారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ భార్గవ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పను కలిసి అభివృద్ధి పనులపై చర్చి ంచారు. ఆస్పత్రిలో పేదలకు నాణ్య మైన వైద్య సేవలు అందుతున్నాయని భార్గవ్ రెడ్డి అన్నారు. మరింత మంది పేదలకు సేవలు అందేందుకు తమ ట్రస్టు సహకారం కూడా ఉంటుందని అన్నారు. వేంచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల బీపీ టెల్లింగ్ యంత్రాలు, నుఆస్పత్రికి సమకూర్చిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో అదనపు మెడికల్ సూపరింటెం డెంట్ లక్ష్మీ భాస్కర్ ఉన్నారు.

## భూ వివాదాలు తలెత్తకుండా భూభారతి చట్టం

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్ ఏప్రిల్ 23(జనంసాక్షి):** ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి (ఆర్వోఆర్)చట్టం నిలుస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం భైంసా మండలంలోని వానల్ పాడ్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూభారతి చట్టం ద్వారా భూ రికార్డుల నిర్వహణను సమర్థవంతంగా చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా ఉండేలా ఈ చట్టం రూపొందించబడిందని అన్నారు.గ్రామ రెవెన్యూ అధికారులను నియమించడం ద్వారా భూసమస్యల పరిష్కారానికి వారు ప్రత్యక్షంగా బాధ్యత వహించనున్నట్లు పేర్కొన్నారు. భూభారతి చట్టాన్ని రూపొందించేందుకు అనేక రాష్ట్రాల భూ చట్టాలను విశ్లేషించి,నిపుణులు, రెవెన్యూ అధికారులు దీని రూపకల్పనలో భాగస్వాములైనట్లు వెల్లడించారు. గతంలో భూ సమస్యల కారణంగా చాలా మంది ప్రజలు కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చిందని, భూభారతితో అలాంటి సమస్యలు తలెత్తే అవ కాశం లేదని అన్నారు. సాదాబైనమా ప్రక్రియను తిరిగి అమలులోకి తీసుకు రానున్నామని,భూ కమతాలకు భూధార్ కార్డుల పంపిణీ,భూముల మ్యాపింగ్ సదు పాయాలు భూభారతి ద్వారా లభించనున్నట్లు వివరించారు.సమస్యల పరిష్కారానికి అధికారులకు నిర్దిష్ట గడువు విధించామని తెలిపారు. అనంతరం రైతులు,ప్రజలు సదస్సులో తమ సమస్యలపై అభిప్రాయాలను తెలియజేశా రు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసిల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరిని అరెస్టు



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కరీంనగర్ కమిషనరేట్‌లోని కొత్తపల్లి పోలీసులు, కన్నపు దొంగతనాలకు పాల్పడుతున్న మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన, అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత సంవత్సరం జూలై నెలలో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి రూ.2,25,000 విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డాయి. అదేవిధంగా, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ రోడ్డు, పివిఆర్ గార్డెన్స్ సమీపంలో కె. రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్‌ను అపహరించారు. ఈ ఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్‌రూరల్ , కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు, రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ పర్యవేక్షణలో, కొత్తపల్లి ఎస్‌హెచ్ఓ (ట్రైనింగ్ ఐపీఎస్) వసుంధర మార్గదర్శకత్వంలో విచారణ ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ మాట్లాడుతూ. దర్యాప్తులో నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం, ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్ (29), విక్రమ్, హత్రు సింగ్ (41), జితేన్‌గా గుర్తించబడ్డారని తెలిపారు. వీరిపై కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు చేయబడ్డాయని ప్రధాన నిందితుడైన ప్రదీప్‌ను గత మార్చి నెలలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడైన హత్రుసింగ్ (41)మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం రావడంతో, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి , సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి మంగళవారం రోజు అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకువచ్చారు. కాగా, మరో ఇద్ద రు నిందితులు విక్రమ్, మరొక జితేన్ ఇంకా పరారీలో ఉన్నారని,వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని రూరల్ ఏసిపి శుభంప్రకాష్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన కొత్తపల్లి ఎస్సై సాంబ మూర్తి , అతని సిబ్బంది అయిన శ్రీనాథ్, అబ్దుల్ ఖదీర్, షరీఫ్, సాంబ రెడ్డి , దేవేందర్ లను రూరల్ ఏసిపి ప్రత్యేకంగా అభినందించారు.

# ‘అల్ఫోర్స్’కు రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు

- ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సత్తా
- నాణ్యమైన బోధన ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చు
- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి








**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 22 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలకు చెందిన వివిధ విభాగాల విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులను సాధించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీనియర్ ఇంటర్మీడియట్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను జె. అంజనా 997 మార్కులు సాధించి రాష్ట్రములో అగ్రగామిగా నిలవడం జరిగింది. 11 మంది విద్యార్థులు 990 అపై మార్కులు సాధించారు. ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు కె. రుత్విక్ 996 రాష్ట్రములో అత్యున్నత స్థానంలో నిలవగా పి. శ్రీనిత్యరెడ్డి 995 యమ్. రుత్విక 995, ఎ. లక్ష్మీప్రసన్న 995, ఎస్. సేవిత 994, వి.ఋషికేష్ 994, యమ్. అక్షత 994, వి.సాహితి 994 ఎస్. కార్తికేయ 994. జి. లక్ష్మీప్రసన్న 994. కె. వర్షిణి 994, యమ్. కీర్తి 994 మార్కులు సాధించి ఉన్నతస్థానంలో నిలిచారు. 128 మంది విద్యార్థులు 990 ఆపైన మార్కులు సాధించడం విశేషం. మరియు 900 ఆపై మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 2293. ఎం.ఇ సి విభాగంలోను 1000 మార్కులకు గాను వి. అక్షయ్వర్ధన్ 988. వి. రిషీత 988, మార్కులు సాధించారు. సిఇసి విభాగంలోను 1000 మార్కులకు గాను బి. గ్రీష్మా 987 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎస్. లహరి 468 హప్సహస్నాన్ 468, తహూరా నూర్ 468. టి. అన్విత రేడ్డి 468 సి. హెచ్. అమతౌరాజ్ 468, పి. కిర్తిశ్రీ 468, జె. ప్రసూనాశ్రీ 468 ఎన్. క్రిష్ణవేణి 468, జి. తరుణ్ 468, డి. నాగాసాగర్ 468, జె.ప్రణవ్జ 468, జి. సూర్యప్రకాశ్ 468, ఎ. శశివర్ధన్రెడ్డి 468, ఎల్. హాసిని 468, యమ్. శ్వేత 468, కె. పల్లవి 468, కె. అనుపమ 468, ఏ నిచిత 468, జి. తరుణ్ 468 జి. లక్ష్మీప్రియ 468 ఎ మొత్తం 20 మంది విద్యార్థులు 468 మార్కులు సాధించి అత్యుత్తమ స్థానంలో నిలిచారు. 66 మంది విద్యార్థులు 467 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు.

బైపీసి విభాగంలో 440 మార్కులకుగాను నభిలాతరీమ్ 438, జోహ మహవీష్ 438, సామాపిరదోష్ 438 మార్కులు సాధించారు. 10 మంది విద్యార్థులు 437 అపై మార్కులు సాధించారు. ఎంఈసి విభాగంలో 500 మార్కులకు గాను ఆర్. చిద్విలాస 491, మార్కులు, సిఈసి విభాగంలో 500 మార్కులకు గాను పి. భవజ్ఞ 493 మార్కులు సాధించారు.

విద్యార్థులకు అత్యుత్తమ విద్యద్వారా సంచలనాత్మక విజయాలను నమోదు చేయవచ్చని నాణ్యమైన బోధన ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చు దానికి నిదర్శనం నేటి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వీతియ సంవత్సర ఫలితాలే అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ఇటీవల ప్రకటించబడిన ఐ.ఐ.టి మెయిన్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్ , ఎమ్సెట్ ఫలితాలలో కూడ అఖండ విజయం సాధిస్తారని నా ప్రగాఢ విశ్వాసం పటిష్ట ప్రణాళికతో విద్యాభోధన, పర్యవేక్షణ విద్యార్థుల నిరంతర కృషి వల్ల ఇంతటి ఘనవిజయం సాధించడం జరిగింది. ఇంటర్ ఫలితాలలో అద్భుత మార్కులు సాధించిన మా ఆల్ఫోర్స్ ఆణిముత్యాలు, వారి తల్లిదండ్రులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని “అల్ఫోర్స్” విద్యాసంస్థల చైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి తెలిపారు.

## ఎంఎంటిఎస్ రైలు కోసం
# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పిస్తా



- హైదరాబాద్ నుంచి (రాయగిరి) యాదగిరిగుట్ట వరకు ప్రయాణ సౌకర్యార్థం
- భువనగిరి, ఆలేరు, జనగామ, రామన్నపేట స్టేషన్లలో పెండింగ్ పనులను పూర్తి చేయండి
- ఎస్సిఆర్ జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఎంఎంటిఎస్ రైలు ను నడిపేందుకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పిస్తానని, ఎస్ సి ఆర్ జనరల్ మేనేజర్, అరుణ్ కుమార్ జైన్ కు , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ను కలిసి , కూలంకషంగా చర్చించి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు నుంచి తెలంగాణ తిరుపతి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైలు నడిపేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేసి లక్ష్మి నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటు, నిత్యం విద్యా ,ఉద్యోగ, వ్యాపారం, ఇతర ఉపాధి పనుల నిమిత్తం రాకపోకలు సాగించే వారికి ,ప్రయాణ సౌకర్యం మెరుగుపడ గలదని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్లమెంట్ కేంద్రమైన భువనగిరి, లోకసభ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్ లైన భువనగిరి, ఆలేరు, జనగాం, రామన్నపేటలలో, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, రైళ్ల రాకపోకల సమయాలు మార్పు, అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణాల కోసం ఇటీవల పార్లమెంట్ లో ప్రస్తావించిన పలు అంశాలు తోపాటు, కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి విషయాలపై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువచ్చారు.

## బతుకమ్మ కుంటలోనే బతుకమ్మ ఉత్సవాలు

- అభివృద్ధి పనులను ప్రారంభించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (జనంసాక్షి) :** వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు చెప్పారు. బతుకమ్మ కుంటలు సంబంధించిన కోర్టు వివాదం మంగళవారం పరిష్కార మయ్యిందన్నారు. బుధవారం హైడ్రా కమిషనర్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను సందర్శించారు. స్థానికుల సమక్షంలో. బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేద మంత్రిచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన ఈ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువును పునరుద్ధరిస్తే పరిసరాలన్నీ ఆహ్లాదకరంగా మారుతాయని అన్నారు. పనులకు సహకరించాలని స్థానికులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానికులు పెద్దయెత్తున హాజరయ్యారు. అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు కమిషనర్‌కు హామీ ఇచ్చారు.

# అడవుల్లో యుద్ధ వాతావరణాన్ని నివారించండి

- కక్షపూరిత, పాత విధానాన్నే అవలంబించడం పాలకుల లక్షణం కాదు
- మావోయిస్టులతో శాంతి చర్చకు నిర్దిష్ట కాలపరిమితితోనైనా కాల్పుల విరమణ ప్రకటించాలి
- కేంద్ర ప్రభుత్వం సహా ప్రభావిత రాష్ట్రాల సర్కార్లకు శాంతి చర్చల కమిటీ విజ్ఞప్తి





**హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఎంతోకాలంగా దండకారణ్యంలో కొనసాగుతున్న హింసాత్మక వాతావరణం తొలగిపోయే విధంగా ఒక శాశ్వత, శాంతియుత పరిష్కార మార్గానికి సహకరిస్తామనే ఆశాజనకమైన ప్రకటనలు మావోయిస్టుల నుండి వస్తున్న తరుణంలో పాత, కక్షాపూరిత విధానాన్నే అవలంభించటం పాలకుల లక్షణం కాదని శాంతి చర్చల కమిటీ పేర్కొన్నది. ఈ సమస్యకు శాంతియుత, రాజకీయ పరిష్కారాన్ని కనుగొనేందుకు ఇదొక సదావకాశమని నమ్ముతున్నట్టు తెలిపింది. కర్రిగుట్టల అడవుల్లో, బస్తర్‌లో, జార్ఖండ్‌లో యుద్ధ వాతావరణ పరిస్థితిని నివారించాలని కేంద్ర ప్రభుత్వానికీ, తెలంగాణ, చత్తీస్గడ్ రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యవసర విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా మావోయిస్టులతో శాంతి చర్చల కోసం నిర్దిష్ట కాలపరిమితితో అయినా కాల్పుల విరమణ ప్రకటించాలని, ఇది రాజ్యాంగాన్నికి లోబడి, ప్రజాస్వామ్యబద్ధంగా జీవనం సాగించే స్వతంత్ర పౌరుల అత్యవసర, ప్రత్యేక విజ్ఞప్తిగా, అశేష ప్రజల ఆకాంక్షగానూ భావించాలని కోరింది.

హైదరాబాద్ నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో శాంతి చర్చల కమిటీ సభ్యులు పాల్గొని పలు ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి, పీస్ డైలాగ్ కమిటీ చైర్మన్ జస్టిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతూ.. రెండురోజుల నుంచి చత్తీస్‌గడ్, ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రిగుట్టలలో వందలాది మంది మావోయిస్టులు షెల్టర్ తీసుకుంటున్నారని తెలిసి, సిఆర్పిఎఫ్, కోబ్రా, తెలంగాణ నుండి గ్రేహౌండ్స్ దళాలు వారిని చుట్టుముడుతున్నట్టు వస్తున్న వార్తలు కలవరపెడుతున్నాయని అన్నారు. ఇది తప్పకుండా మరింత పెద్దఎత్తున మానవ ప్రాణ నష్టం, మారణహోమాలకు దారితీసే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే ఈ రాష్ట్రాల్లో జరుగుతున్న సాయుధ దాడుల్లో మావోయిస్టులు, ఆదివాసీలు చనిపోతున్నారని, బలగాల్లోనూ కొందరు క్షతగాత్రులవుతున్నారని గుర్తుచేశారు. మూడు నెలలుగా కేంద్రానికి, మావోయిస్టులు పార్టీకి మధ్య శాంతి చర్చలు జరగాలని ప్రయత్నం చేస్తున్నామని, మార్చి 24న ఇరుపక్షాలకూ విజ్ఞప్తి చేయగా మావోయిస్టు పార్టీ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ప్రధాని మోడీ, హోంమంత్రి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు శాంతి చర్చలకు సానుకూలంగా స్పందించాలని లేఖలు కూడా పంపినట్టు చెప్పారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనల్లో కొంత ఆశాజనకమైన స్పందన కనిపిస్తున్నదని, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే శాంతి చర్చల ప్రక్రియ ముందుకు వెళ్లగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆ లక్ష్య సాధనకై జాతీయ స్థాయిలో శాంతికాముకులతో ఏర్పడిన కమిటీ ద్వారా తగిన కార్యక్రమాలు రూపొందించుకుంటున్నామన్నారు. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్‌లో 28 మంది పర్యాటకులపై ఉగ్రదాడిని శాంతి చర్చల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సమావేశంలో పీస్ కమిటీ వైస్ చైర్మన్ జంపన్న, ఫ్రీడం, ఫైటర్, రచయిత కె.ప్రతాప్ రెడ్డి, హెచ్ఆర్ఎఫ్ అధ్యక్షుడు ప్రోఫెసర్ జీవన్ కుమార్, పీయూసీఎల్ ప్రెసిడెంట్ సీహెచ్. బాలకిషన్ రావు, పీస్ కమిటీ వైస్ చైర్మన్ ప్రో వినయ్ రెడ్డి, హెచ్ఆర్ఎఫ్ సెక్రెటరీ డా,తిరుపతయ్య, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సీసీఎం చలపతి రావు, సీపీఐ (ఎంఎల్) సీసీఎం గుర్రం వినయ్ కుమార్, సీపీఐ (ఎంఎల్) హన్మేశ్, ఆర్ఎస్పీ నాయకులు జానకిరామ్, సీనియర్ జర్నలిస్ట్ టీ తిరుమల్ పాల్గొన్నారు.



# ప్రశాతంగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్

- రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి
- 78.57 శాతం పోలింగ్ నమోదు

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, మధ్యాహ్నం 2 గంటల వరకే 78.57 శాతం ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 112 ఓటర్లలో ఎక్స్ అఫిషియో మెంబర్ 31 కాగా, అందులో 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81 మంది కార్పొరేటర్ల లో 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు 37.51 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు 77.68 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 78.57 శాతం పోలింగ్ నమోదు అయ్యింది సాయంత్రం 4 గంటల వరకు 78.57 శాతం నమోదు అయ్యింది. ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ రిటర్నింగ్ అధికారితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను రిసెప్షన్ సెంటర్ కు బందోబస్తుతో తీసుకువచ్చిన పిదప పరిశీలన చేసిన తర్వాత స్ట్రాంగ్ రూం లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు. ఈ నెల 25న ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో నిర్వహించడం జరుగుతుంది.

# ఉగ్రదాడి దోషులను విడిచిపెట్టే ప్రసక్తి లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పహెల్గాంలో టూరిస్టులపై విచక్షణారహితంగా కాల్పులకు చేసిన దోషులను ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పెహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో హైదరాబాద్ లోని ట్యాంక్‌బండ్ వద్ద బీజేపీ నేతలు నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌పై ఉగ్రవాదులను దాడికి ఉసిగొల్పిన పాకిస్థాన్ వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఒక వర్గం వారిని టార్గెట్ చేసి జరిగిన దాడిని ప్రపంచం అంతా ఖండిస్తోందని అన్నారు. పాకిస్థాన్‌లో అసమర్థ నాయకత్వం ఉందని ఫైర్ అయ్యారు. అంతర్గత వ్యవహారాన్ని సరిదిద్దుకోలేని స్థితిలో పాక్ ఉందని ధ్వజమెత్తారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఆ దేశం కొట్టుమిట్టాడుతోన్న భారత్ పై కయ్యానికి కాలు దువ్వుతోందని ఆక్షేపించారు. ఇలాంటి దాడులతో భారత్‌ను భయపెట్టలేరని అన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని.. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా పహెల్గాం దాడి నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370